# ఐక్య ఉపాధ్యాయ

విద్యా విషయక మాసపత్రిక

జులై - 2014

సంపుటి- 40 సంచిక : 07



## సంపాదక వర్గం

సిహెచ్. రవి, ప్రధాన సంపాదకులు

ఎన్.నారాయణ

ఎం. సంయుక్త

కె.సురేష్‌కుమార్

జి.ఉషాదేవి

ఎన్.కుమార్ రాజా


ఈ సంచికలో...


| | |
|---|---|
| విశ్వంలో విద్య | - 4 |
| 10వ తరగతి పరీక్షా విధానంలో... | - 5 |
| కీర్తి పతాక | - 7 |
| విద్యావీక్షణం | - 8 |
| టీచర్లకు ముప్పు తెచ్చే కోర్టు తీర్పు | - 9 |
| బాలల హక్కులు -వాటి అమలు తీరు | -11 |
| నూతన పాఠ్యపుస్తకాలు-తీరుతెన్నులు | -13 |
| ప్రపంచ జనాభా దినోత్సవం | -14 |
| నవ్యకావ్య మహారథి దాశరథి | -15 |
| ముఖ్యమైన ప్రాతినిధ్యాలు | - 16 |
| ప్రశ్నోత్తరాలు | -18 |
| ఉద్యమవార్తలు | - 20 |
| ప్రభుత్వ ఉత్తర్వులు | -31 |



| | |
|---|---|
| దశాబ్దిచందా : | ` 1000-00 |
| 5 సం॥ చందా : | ` 550-00 |
| సం॥ చందా : | ` 120-00 |
| విడిప్రతి : | ` 10-00 |

SBI Online
A/c No. 30206957939



ఐక్య ఉపాధ్యాయ

గగన్‌మహల్ రోడ్ నం. 7

దోమల్‌గూడ, హైదరాబాద్-29

Ph.No. : 040-27636840

Fax. No. : 040-27650366

MobileNo. : 9490300573

Website : www.aputf.org.

E-mail : ikyopadhyaya@gmail.com


# మోడీ సర్కార్ ధరల దూకుడు

ప్రధాని నరేంద్రమోడీ దూసుకుపోతున్నారు... పరిపాలనలో కాదు, ధరల్ని పెంచడంలో.... అధికార పీఠమెక్కిన ఐదు వారాల్లోనే ప్రజలపై భారాలు, కార్పొరేట్లకు రాయితీల మోత మోగిస్తున్నారు. మొన్నటికి మొన్న భారత రైల్వేల చరిత్రలో కనీవినీ ఎరుగనంత భారీ స్థాయిలో ప్రయాణీకుల చార్జీలను 14.2%, సరుకు రవాణా చార్జీలను 6.5% పెంచారు. నిన్న పెట్రోల్ ధరను లీటరు రూ.1.69పైసలు, డీజిల్ ధరను లీటరు రూ.0.50పైసలు చొప్పున చమురు కంపెనీలు పెంచేశాయి. ఈ పెరుగుదల కనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు ముక్కుపిండి వసూలు చేసే అమ్మకం పన్ను పర్యవసానంగా నిత్యావసరాల ధరలు ఇంకా ప్రియంకానున్నాయి. తాజాగా ఎన్‌డిఏ సర్కారు వంటగ్యాస్‌పై కన్నేసింది. సబ్సిడీయేతర సిలెండర్‌కు రూ.250 మేర పెంచాల్సిందేనని మంత్రిత్వశాఖ దాదాపుగా ఓ నిర్ణయానికి వచ్చేసింది. రాజకీయ వ్యవహారాల మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం లభించడమే ఆలస్యం వంటగ్యాస్ భగ్గుమనే అవకాశం ఉంది. చక్కెరపై పన్ను పెంచి వినిమయ మార్కెట్‌లోనూ కిలోకు మూడు రూపాయల వరకూ పెరగడానికి దారితీసింది. ఉల్లిధరలకూ రెక్కలొచ్చాయి. ఆరంభమే ఇలా వుంటే పోనుపోను మరెంత మోత మోగిస్తారోనని ఓటేసిన వారూ, వంత పాడినవారూ కూడా హడలిపోయే స్థితి కల్పించిన ఘనత ముమ్మాటికి నరేంద్ర మోడీదీ, ఆయన ఎన్‌డిఏ ప్రభుత్వానిదీ.

అభివృద్ధిలో ముందుకు వెళ్ళాలంటే "చేదుమాత్రలు తప్పవు".... అన్న ప్రధాని మాటల్లోని అంతరార్థం తేటతెల్లమౌతోంది. "దేశానికి వచ్చేస్తున్నాయి మంచి రోజులు" అని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టేసిన మోడీ సర్కారు దేశ ప్రజలపై భారాల మోత మోగిస్తూ, ప్రజాకంటక పాలనలో గత యుపిఏ సర్కారును మరిపిస్తున్నది. విత్తనం ఏదైతే మొలక అదే వచ్చినట్టు నయా ఉదారవాద నమూనా విషయంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ యుపిఏ ప్రభుత్వానికి ఏ మాత్రం తీసిపోని ఘనత మోడీ సర్కారుది. సామాన్యులపై భారాల జోరు, సంపన్నులకు వరాల హోరు చూస్తుంటే రెండాకులు ఎక్కువే చదివిందని చెప్పాలి. కేంద్రంలో బిజెపికే మెజార్టీ ఉంది గనక మరింత ఏకపక్షంగా వ్యవహరించే వీలూ కలిగింది. ప్రజలపై కాఠిన్యం, కార్పొరేట్లకు కానుకలు అనే ద్వంద్వనీతిలో మరీ తెగించే అవకాశమొచ్చింది. ఆర్థిక క్రమశిక్షణ అనివార్య మన్న అరుణ్‌జైట్లీ మాటల్లోనూ అదే తొంగిచూసింది. సిఐఐ, ఫిక్కి వంటి వాణిజ్య సంస్థలతో గాని, దేశ విదేశీ గుత్తాధిపతులతోగాని వ్యవహరించే తీరు ఇందుకు పూర్తి భిన్నం. ఎక్సయిజ్ రాయితీలను కొనసాగించాలని తీసుకున్న నిర్ణయం కూడా వారిని ఎంతగానో ఆనంద పర్చింది. రైల్వేలు, రక్షణ రంగంతో సహా అన్నిట్లోకి ఎఫ్‌డిఐలను ఆహ్వానించడం, ప్రభుత్వ సంస్థల వాటాలు బజారులో అమ్మకానికి పెట్టడం, ఎరువుల సబ్సిడీలు తగ్గించాలని, కార్మిక చట్టాలో మార్పులు చేయాలని యోచించడం వంటివన్నీ బడాబాబులకు నజరానాలు. గత దశాబ్దకాలపు యుపిఏ అసమర్థ, అవినీతిపూరిత పాలనతో విసిగివేసారిన ప్రజలు తమను ఉద్ధరిస్తానంటూ ముందుకొచ్చిన మోడీపై కొండంత ఆశతో అధికారం అప్పగిస్తే నెల తిరక్కుండానే ప్రజాకంటక విధానాలను కొనసాగిస్తూ, గత ప్రభుత్వ నిర్ణయాలనే తాము అమలు పరుస్తున్నామంటూ పదేపదే వల్లేవేస్తున్న ఎన్‌డిఏ నేతలను ప్రజలు క్షమించరు.

మొదటి నెల పాలన సందర్భంగా ప్రధాని మోడీ బహిరంగ లేఖ రాస్తూ మామూలుగా ప్రభుత్వాలకు వంద రోజుల హనీమూన్ గడువు ఇచ్చేవారనీ, కానీ తమకు వందగంటలు కూడా ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. వాస్తవం ఏమంటే తమ అసలు సిసలు లక్షణమైన మతతత్వ వివాదాలను రగుల్కొల్ప డానికి బిజెపి నేతలకు 24 గంటలు కూడా పట్టలేదు. కాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370 రద్దుపై చర్చ, మతప్రాతిపదికన కల్పించిన రిజర్వేషన్లను సమీక్షించాలని, ఉమ్మడి సివిల్ కోడ్, రామమందిర నిర్మాణం వంటి అంశాలను ఆఘమేఘాల మీద రంగం మీదకు తెచ్చారు. హిందూత్వతోపాటు హిందీత్వ పైత్యం ప్రదర్శించి మరో వివాదం రగిలించారు. మైనార్టీల మీద, మహిళల మీద పరిపరి విధాల నోరు పారేసుకున్నారు. చివరకు ఈ వివాదాలతో మోడీ కూడా విడగొట్టుకోవలసిన స్థితి కలిగింది. గో వధ గగ్గోలు తీవ్రం చేసి ప్రభుత్వానికి గడువుపై తాఖీదులు జారీ చేస్తున్నారు. సోషల్ మీడియాపై నిఘా వేయడమే గాక సాంకేతిక నిపుణుడైన మైనార్టీ యువకుడి ప్రాణాలు తీశారు. అశాస్త్రీయ, ఛాందసవాద ధోరణులను విద్యారంగంలో జొప్పించాలనే ఆలోచన చేస్తున్నారు. మతవాద, మితవాద భావజాలం వికృత విన్యాసాలకు నిదర్శనాలు ఇవన్నీ.

భిన్నమతాలు, జాతులకు నిలయమైన ఈ దేశంలో మోడీ తరహా ఏకపక్ష ధోరణి, వివాదాస్పద విధానాలు, భారాల మారి నిర్ణయాలు అనుమతించరానివి. గత 67 యేళ్లతో పోలిస్తే తమది మెరుగైన ప్రభుత్వమని మోడీ నెల రోజుల ఏలుబడిపై మురిసిపోతున్నారు. 1947 తర్వాత ఇదే గొప్ప ప్రభుత్వమని ఆయన సారథి ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ కితాబులిస్తున్నారు. సరిగ్గా ఈ కారణం చేతనే మోడీ ప్రభుత్వ నడతనూ, నడకనూ మరింత విమర్శనాత్మకంగా చూడాల్సివస్తుంది. పాలక పక్షం నేతలు అంటున్నట్టు నెల రోజుల్లో ఒక ప్రభుత్వంపై అంతిమ తీర్పు ఇవ్వడం భావ్యంకాదు. కానీ ఆరంభ సూచనలను పరిశీలించి పాఠాలు నేర్చుకోకపోతే బలపర్చిన ప్రజల నిరుత్సాహం నిరసనగా మారి నిప్పులు కక్కుతుంది. ☯

## వేతనాలు లేకుండా పనిచేస్తున్న కంగోలీస్ ఉపాధ్యాయులు

డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ ద కాంగో (డిఆర్‌సి)లో 6,50,000 శిశు, ప్రాథమిక, సెకండరీ ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో 5,45,054మంది ప్రభుత్వ వ్యవస్థలో పనిచేయుచున్నారు. ప్రభుత్వ వ్యవస్థలో పనిచేయుచున్న వారిలో మూడవవంతు మంది ఉపాధ్యాయులు అనగా 1,87,150మంది వేతనాలు లేకుండా పనిచేస్తున్నారు. గత దశాబ్దకాలంగా బోధనా సామర్థ్య ర్యాంక్‌లో గుర్తించదగిన వృద్ధి ఉన్నప్పటికిని మూడవవంతు ఉపాధ్యాయులు వేతనాలు పొందుట లేదు. 2012లో 2.5 మిలియన్లమంది బడి వయసు బాలలు బడిబయట ఉన్నారు.

విద్యామంత్రి జూన్ 10న ప్లీనరీ సెషన్‌లో మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభం కారణంగా విద్యాప్రమాణాలు స్వల్పంగా తగ్గాయని, అయినప్పటికి అభివృద్ధి కొరకు చేపట్టే చర్యల్లో భాగంగా 'విద్య' అనే పేరుతో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా పాఠశాల భవన నిర్మాణం కొరకు ప్రభుత్వ బడ్జెట్ నుండి 237 బిలియన్ల కంగోలీస్ ఫ్రాన్సిస్ (200 మిలియన్ల యూరోలు) కేటాయిస్తుందని తెలిపారు.

మంచి వేతనాలు, పని పరిస్థితులు కల్పించకుండా ఏ దేశంలోనైనా నాణ్యమైన ఉపాధ్యాయులు ఉండడం సాధ్యం కాదని, ఒప్పందం మేరకు వేతనాలు ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు చెల్లించాలని సంఘ నాయకులు కోరారు.

## డెన్మార్క్‌లో ఉపాధ్యాయుల ఆవశ్యకతను తెలిపే ఉద్యమం ఆరంభం

"భవిష్యత్తు పాఠశాలలోనే ఆరంభం" అనే నినాదంతో డానిష్ యూనియన్ ఆఫ్ టీచర్స్ (డిఎల్‌ఎఫ్) జూన్ 16న డేనిష్ ఉద్యమాన్ని ఆరంభించింది. ప్రభుత్వ పాఠశాలలపై కేంద్రీకరిస్తూ, ప్రతి విద్యార్థికి మరియు తద్వారా సమాజానికి ఉపాధ్యాయుల ప్రాముఖ్యత ఉందని ఈ ఉద్యమం తెలుపుతుంది. విద్యార్థులను వ్యక్తులుగా మరియు మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రధానమైనదని, డెన్మార్క్ ప్రభుత్వం ఈ అంశంపై శ్రద్ధ పెట్టాలని, అందుకు ప్రభుత్వ పాఠశాలలపై పెట్టే ఖర్చును డెన్మార్క్ భవిష్యత్తుకు పెట్టే ముఖ్యమైన ఖర్చుగా గుర్తిస్తుందని నమ్ముతున్నామని డిఎల్‌ఎఫ్ నాయకులు తెలిపారు.

## ఆఫ్రికన్ ఛైల్డ్ డే

ఆఫ్రికాలో "సార్వత్రిక విద్య"ను వెలుగులోకి తెచ్చే విధంగా, జూన్ 16న డే ఆఫ్ ద ఆఫ్రికన్ ఛైల్డ్ (ఆఫ్రికా బాలల దినోత్సవం)ను నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా వేలసంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు. యునెస్కో (యుఎన్‌ఇఎస్‌సిఓ), యునిసెఫ్ (యుఎన్‌ఐసిఇఎఫ్) వంటి అంతర్జాతీయ సంస్థలు, 45 దేశాల్లో అనేక స్వచ్ఛంద సంస్థలు, టీచర్స్ మరియు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్య ప్రాధాన్యతను తెలుపుతూ ప్రకటనలు చేశారు. ఇంకా 30 మిలియన్ల మంది బాలలు బడిబయట ఉన్నారు. ఆఫ్రికాలోని సహారా ప్రాంతంలో బడిబయట ఉన్న బాలలు ఎదుర్కొంటున్న కష్టాలను వెలుగులోకి తేవడానికి 100కుపైగా విధానాలను అవలంబిస్తున్నారు. ఈ ప్రాంతంలో నిరక్షరాస్యులైన యువతలో 60% బాలికలే. యునిసెఫ్ మరియు యునెస్కో సంస్థల సహకారంతో ప్రభుత్వం పాఠశాలలకు వెళ్ళే బాలలు ఎదుర్కొంటున్న యిబ్బందులు, హింస నివారించే దిశగా చర్యలు తీసుకుంటుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

## ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రతపై న్యాయపరమైన దాడి

ఉపాధ్యాయుల హక్కుల రక్షణ చట్టాలు రాజ్యాంగ విరుద్ధమని, ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రతను తొలగిస్తూ కాలిఫోర్నియా అత్యున్నత న్యాయస్థానము చేసిన నిర్ణయాన్ని అమెరికా ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. నేషనల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ (ఎన్‌ఇఏ) మరియు అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ (ఏఎఫ్‌టి) కోర్టు తీర్పును తీవ్రంగా ఖండిస్తూ, ఇది నాణ్యమైన బోధన మరియు నాణ్యమైన విద్యపై దాడి చేయడమే అని విమర్శించారు. కాలిఫోర్నియాలో 2008 నుండి ప్రభుత్వ విద్యకు పెట్టే ఖర్చును 14% తగ్గించారు. ప్రతి విద్యార్థి అభివృద్ధి చెందాలంటే నిలకడగా ఉండే బోధనా సిబ్బందికి సహకరించటం అవసరమని, ఉపాధ్యాయుల రక్షణ కొరకు ఉన్న నియమాలపై దాడిచేసే నిర్ణయాలు ప్రభుత్వ విద్యను అస్థిరపరుస్తుందని సంఘ నాయకులు తెలిపారు.

## ప్రైవేటీకరణతో అందరికీ నాణ్యమైన విద్యకు ప్రమాదం

ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పరం చేయాలనే ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆలోచనను ఆస్ట్రేలియన్ ఎడ్యుకేషన్ యూనియన్ (ఏఇయు) తీవ్రంగా ఖండిచింది. ప్రభుత్వ పాఠశాలలకు నిధులను నిలిపివేసి, విద్యార్థులకంటే స్వంత లాభాల కోసం పాకులాడే పెద్ద కార్పొరేషన్ల ఆధీనంలోని పాఠశాలలకు నిధులివ్వమని ప్రధాని అధికారులకు సూచనలిచ్చారు.

కరిక్యులమ్ తయారు చేయడంలో కార్పొరేషన్లకు అవకాశం ఇవ్వడం జరిగితే, ఆ కరిక్యులమ్ విద్యార్థుల అవసరాలు తీర్చేదిగా కాక కార్పొరేషన్స్ అవసరాలు తీర్చే సంకుచితమైన కరిక్యులమ్ అవుతుందని, పాఠశాల కరిక్యులమ్ వేలంపాట పాడే కార్పొరేటర్లకు అమ్ముకోకూడదని సంఘ నాయకులు తెలిపారు. కార్పొరేట్ల లాభాలు చేకూర్చే విధంగా పాఠశాలలు వారికి అప్పగించడం అనేది గతంలో ఆస్ట్రేలియాలోని విద్యకు ఉన్న గర్వించదగిన చరిత్రకు వ్యతిరేకంగా పయనించడం అవుతుందని, నాణ్యమైన విద్యకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, వ్యవస్థకు న్యాయం జరగదని ఏఇయు నాయకులు తెలిపారు.

## సంఘ గుర్తింపు రద్దుచేసిన కోర్టు నిరాహారదీక్షలో ఉపాధ్యాయులు

ఉద్యోగ విరమణ పొందిన మరియు తొలగించబడిన ఉపాధ్యాయులను సంఘ సభ్యులుగా అనుమతించిన కారణంగా, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ యొక్క సిఫారస్‌లకు విరుద్ధంగా కొరియా టీచర్స్ యూనియన్ (కెటియు) యొక్క గుర్తింపు (చట్టబద్ధతను)ను తొలగించాలని కొరియా కోర్టు తీర్పునిచ్చింది. కోర్టు తన తీర్పులో కెటియును చట్ట విరుద్ధమైన శ్రామిక వర్గంగా పేర్కొంటూ తొలగించబడిన ఉపాధ్యాయుల సభ్యత్వం వలన ఉపాధ్యాయ సంఘం యొక్క స్వేచ్ఛ మరియు స్వయంపాలన సామర్థ్యం క్షీణిస్తుందని వివరించింది.

కోర్టుతీర్పును వ్యతిరేకిస్తూ కెటియు అధ్యక్షుడు జూన్ 9 నుండి నిరాహారదీక్ష చేపట్టారు. కెటియు 1989లో స్థాపించబడి, 1999లో గుర్తింపుపొంది కొరియా విద్యార్థులకు నాణ్యమైన విద్య కల్పించడానికి అనేక పోరాటాలు చేసినదని మరియు కొరియా ప్రజల సామాజిక న్యాయం కొరకు పోరాడుతున్నదని, ప్రైవేట్ పాఠశాలల అవినీతి నాయకులకు వ్యతిరేకంగా పోరాడుతున్న సంఘాన్ని ఈ విధమైన కోర్టు తీర్పుతో అంతర్జాతీయంగా దక్షిణ కొరియాను ఒంటరి చేయడం బాధాకరమని ఈ తప్పుడు నిర్ణయానికి వ్యతిరేకంగా పై న్యాయ స్థానానికి విన్నవించుకుంటామని, పోరాటం కొనసాగుతుందని కెటియు నాయకులు తెలిపారు.



# SSC EXAM

## పాఠశాల విద్య 10వ తరగతి పరీక్షా విధానంలో సంస్కరణలు

మన రాష్ట్రంలో 2014-15 విద్యా సంవత్సరం నుండి 9,10 తరగతుల పరీక్షా విధానంలో సంస్కరణలు చేపడ్తూ ప్రభుత్వం జిఓ ఎంఎస్ నం.17 విద్య; తేది.14.05.2014న విడుదల చేసింది. ఈ సంస్కరణలను చర్చించవలసిన అవసరం ఎంతైనా వుంది. మన పరీక్షా విధానంలో మార్పులు రావలసిన ఆవశ్యకత గురించి గత దశాబ్ద కాలంగా చర్చ జరుగుతోంది. ఈ చర్చ రాష్ట్రస్థాయికి పరిమితమైంది కాదు. జాతీయ స్థాయిలోనూ జరిగింది. ఈ సంస్కరణల లక్ష్యం విద్యార్థులకు భారంలేని, విలువలతో కూడిన, సృజనాత్మకమైన నాణ్యమైన విద్యను అందించటం. కేవలం పాఠ్య పుస్తకాలకు పరిమితమై, యాంత్రికంగా, పరీక్షలే ధ్యేయంగా, పరీక్షలకు సంసిద్ధం చేస్తున్న కర్మాగారాలుగా పాఠశా లలున్నాయని దీని వలన విద్యార్థులు వత్తిడికి లోనౌతున్నారని, ఆ వత్తిడి తొలగించి విద్యార్థులు స్వేచ్ఛగా పరీక్షలు వ్రాసేందుకు సంస్కరణలు అవసరమని వివిధ కమీషన్లు సూచించాయి.

అందులో ప్రముఖమైంది ప్రొ॥ యశ్‌పాల్ కమిటీ

ఈ నేపథ్యంలో వెలువడినవే జాతీయ విద్యా ప్రణాళికా చట్రం- 2005. (ఎన్‌సిఎఫ్-2005), 'పరీక్షల సంస్కరణలపై నేషనల్ గ్రూప్' - 2006లో వచ్చిన పొజిషన్ పేపరు, మన రాష్ట్రంలో రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం-2011. ఇవికాక 2009లో చేసిన విద్యాహక్కు చట్టం దీనిని నొక్కి చెప్పింది. పరీక్షా విధానం విద్యా విధానంలో ముఖ్యమైనదయినా ఒక భాగం మాత్రమే! ఇంతకాలం పరీక్షా విధానాన్ని అనుసరించి బోధన అభ్యసనలు జరుగుతూ వచ్చాయి. దీని ఫలితమే విద్యార్థులు, ఉపాధ్యాయులపై ఒత్తిడి. అందుకే ఎన్‌సిఎఫ్-2005 బోధనా ప్రక్రియలలో, పాఠ్యాంశాల ఎంపిక, పాఠ్య పుస్తకాల రూప కల్పనలలో తీసుకోవలసిన మార్పులు సమగ్రంగా చెప్పింది. బాల బాలికల్లో అన్వేషించటం, చర్చించటం, విషయాన్ని ఇతర పుస్తకాల నుండి సేకరించటం (రిఫరెన్స్), విచక్షణా జ్ఞానాన్ని పెంపొందించేలా విశ్లేషణా నైపుణ్యాలను అలవడేలా చేయటం-పిల్లల సమగ్ర అభివృద్ధికి తోడ్పడేలా... అంటే మానసికంగా, శారీరకంగా, సాంఘికంగా, భావోద్వేగపరంగా, నైతికపరంగా వివిధ కృత్యాల్లో పాల్గొనేట్లు పాఠశాల సహకరించాలి. పాఠ్య విషయాలకే పరిమితమై జరుగుతున్న బోధన సహ పాఠ్య కార్యక్రమాలుగా భావిస్తున్న వ్యాయామ ఆరోగ్య విద్య, కళలు-సాంస్కృతిత విద్య, కంప్యూటర్-పని విద్య విలువలు-జీవన నైపుణ్యాల వంటి అంశాలలో కూడ బోధనాభ్యసనం జరిగి వీటిని కూడ మూల్యాంకనం చేయటం అవసరం అని ఎన్‌సిఎఫ్-2005 చెప్పింది.

కేవలం పబ్లిక్ పరీక్షలకే (వార్షిక పరీక్షలు) భారత్వాన్ని కేటాయిం చటం కాకుండా పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయున్ని పరిగణనలోనికి తీసుకొని (ఇప్పుడు ఇది లోపిస్తోంది) కొంత భారత్వాన్ని అంతర్గత మూల్యాంకనానికి లేదా నిర్మాణాత్మక మూల్యాంకనానికి కేటాయించాలి. దీని వలన పిల్లల ప్రగతిని నిరంతరం ఉపాధ్యాయుడు అంచనా వేయగలడు. అందుకే ఎన్‌సిఎఫ్-2005 నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని ప్రతి పాదించింది. ఈ విధానం ప్రస్తుతం సిబిఎస్ఇ పాఠశాలల్లో సంతృప్తి కరంగా అమలవుతోంది. పిల్లలో పరీక్ష వత్తిడి తగ్గటానికి ప్రయోగాలు, ప్రాజెక్ట్ పనులు, అసైన్‌మెంట్లు, పిల్లల నోట్‌బుక్స్, సహ విద్యార్థులతో చర్చలు, ఉపన్యాసాలు మొ॥ అంశాలను మూల్యాంకనం చేస్తారు. దీనికి అనుగుణంగా పాఠ్యప్రణాళిక రూప కల్పన, పాఠ్యపుస్తక రచన, పరీక్షా విధానంలో మార్పులు ఉండాలి. దీనికి నిరంతర సమగ్ర మూల్యాంకనం జరగాలి అని పైన పేర్కొన్న పత్రాలు చెప్పాయి.

2006లో పరీక్షల సంస్కరణ కోసం నియమించిన జాతీయ నిపుణుల బృందం పరీక్షల సంస్కరణ మీద ఏం చెప్పిందో చూద్దాం... "ఈ క్రింది మౌలిక అంశాలలో సంస్కరణలు జరగకుండా పరీక్షల సంస్కరణలు మాత్రమే చేస్తే సాధించేది నామమాత్రమే."



ఎం.ఏ.కె. దత్తు

1. ఉపాధ్యాయ శిక్షణ (Teacher Training), ఉపాధ్యాయుల సామర్థ్యం (Teacher Quality), ఉపాధ్యాయ - విద్యార్థి నిష్పత్తిలో గుణాత్మక మార్పు.
2. కరిక్యులమ్, పాఠ్యపుస్తకాలు మరింత ఆసక్తికరంగా, రిలెవెంట్‌గా, ఛాలెంజింగ్‌గా ఉండటం.
3. విద్యకు అన్ని స్థాయిల్లో ముఖ్యంగా సెకండరీ స్థాయిలో ఎక్కువ నిధులను కేటాయించటం.

**నిరంతర సమగ్ర మూల్యాంకనం** (CCE) : ఒక సంవత్సర కాలాన్ని 2 టరములుగా విభజిస్తారు. మొదటి టరమ్‌లో రెండు నిర్మాణాత్మక మూల్యాంకనాలు ($F_1$ & $F_2$) టర్మ్ చివర అంతవరకూ నేర్చుకొన్న పాఠ్యాంశాలలో మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం ($S_1$) నిర్వహిస్తారు. రెండవ టర్మ్‌లో మరలా రెండు నిర్మాణాత్మక మూల్యాంకనా లు ($F_3$ & $F_4$) టర్మ్ చివర రెండవ సంగ్రహణాత్మక మూల్యాంకనం ($S_2$) నిర్వహిస్తారు. 10వ తరగతి వారికి ఇది పబ్లిక్ పరీక్ష. మొదటి టర్మ్‌లోని పాఠ్యాంశాల నుండి ప్రశ్నలు రెండవ సంగ్రహణ మూల్యాంకనంలో ఉండవు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలో కూడ! ఇది భారము లేని, వత్తిడి లేని పరీక్షా విధానం. సిబిఎస్ఇలో ఇది పాటిస్తున్నారు. సిసిఇ విధానంలో ఉపాధ్యాయునిది కీలకమైన, ఉన్నత పాత్ర. అతడు ప్రతి పాఠ్యాంశంలోనూ విద్యార్థి ప్రగతిని అంచనా వేస్తాడు. ($F_1$ & $F_2$లలో) విద్యార్థి నైపుణ్యాలను అంచనా వేస్తాడు. వెనకబడిన విద్యార్థికి ధైర్యం చెప్తాడు. దీనివలన ఒకసారి పరీక్షించిన పాఠ్యాంశాలు మరలా పరీక్షించ నవసరం లేదు. విద్యార్థిలోని భావవ్యక్తీకరణలు, ప్రాజెక్ట్ / ప్రయోగాలు చేసే నైపుణ్యం, స్వంతంగా వ్రాయటం, ఉపన్యసించటం వంటి అంశాలను పరిగణనలో నికి తీసుకొని పబ్లిక్ పరీక్షల్లో 20% మార్కులు నిర్మాణాత్మక

మూల్యాంకనానికి కేటాయించటం విద్యార్థికి పరీక్ష భయాన్ని పోగొట్టటమే కాదు విశ్వాసాన్ని పెంచుతుంది. పాఠ్యాంశాలలో పెద్దగా రాణించని విద్యార్థి కళలు, క్రీడల్లో అద్భుతమైన ప్రజ్ఞ ప్రదర్శిస్తున్నారని సిసిఇ అమలు చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు చెప్పటం సిసిఇ లక్ష్యం నెరవేరింద నటానికి నిదర్శనం. ఇది మన 10వ తరగతి పరీక్షల సంస్కరణల నేపథ్యం.

ఇప్పుడు మన రాష్ట్రంలో పరీక్షల సంస్కరణలకు చేసిన ప్రయత్నాలు చూద్దాం. మన రాష్ట్రంలో కూడ దశాబ్దకాలంగా పరీక్షా విధానం – సంస్కరణల మీద చర్చ జరుగుతోంది. ప్రొ॥ యశ్‌పాల్ వంటి వారు పరీక్షల భారాన్ని ఎత్తిచూపినప్పుడు, ప్రైవేట్ విద్యా సంస్థలు మార్కులు, ర్యాంకులతో ప్రకటనలు హోరెత్తించినప్పుడు పరీక్షల సంస్కరణల మీద, 10వ తరగతి పేపర్ల సంఖ్య తగ్గించటం మీద, మార్కుల స్థానంలో గ్రేడులు ప్రవేశ పెట్టాలని 2005లో చర్చ జరిగింది. మరలా దాని ఊసు లేదు. ఎన్‌సిఎఫ్–2005 తర్వాత 7 సం॥లకు 2012లో 10వ తరగతి బోర్డు సర్టిఫికెట్‌లో మార్కుల స్థానంలో గ్రేడ్, గ్రేడ్ పాయింట్లు ఇవ్వటం ప్రారంభించారు. అయితే ఈసారి ప్రైవేట్ విద్యా సంస్థలు గ్రేడ్ పాయింట్లతో ప్రకటనలు గుప్పిస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుండి (2014–15) 9,10 తరగతుల పరీక్షల విధానం సమూలంగా మార్చి సిసిఇ పద్ధతి ప్రవేశపెడ్తున్నట్లు ప్రకటించారు. ఈ విధానం ప్రవేశపెట్టేముందు పరీక్షలకు సంబంధించి కొన్ని అంశాలపై చర్చ జరిగినట్లు కన్పించదు.

1. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రతి పేపరు 80 మార్కులకు ఇస్తారు. మిగిలిన 20మార్కులు అంతర్గత మూల్యాంకనం ద్వారా తీసుకొంటారు. మన రాష్ట్రంలో ఏ పాఠశాలలోనూ చదవకుండానే (without school study) 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు వ్రాసే వారి సంఖ్య గణనీయంగా ఉంది. ఈ నూతన విధానంలో వీరికి 20 మార్కులు ఏ విధంగా పరిగణనలోకి తీసుకొంటారో వివరించలేదు.
2. 10వ తరగతి ప్రథమ భాషలో కాంపోజిట్ కోర్సు ఉంటుంది. 80 మార్కులకు ప్రథమ భాష ఒక పేపరు, 20 మార్కులకు సంస్కృతం ఒక పేపరు ఉంటాయి. దీనిని నూతన విధానంలో ఏం చేస్తారో చెప్పలేదు. అనుభవపూర్వకంగా చూస్తే ఈ సంస్కృతం పేపరు మార్కుల కోసమే కాని, జ్ఞాన సమపార్జన కోసం కాదని అందరికీ తెలుసు. ఎందుకంటే సంస్కృతం పేపరు తెలుగు / ఇంగ్లీషు భాషల్లో వ్రాస్తారు. సంస్కృతంలో వ్రాయవలసిన అవసరం లేదు. మరి ప్రత్యేకంగా సంస్కృతం పేపరు దేనికి? వీటిని ఎన్‌సిఇఆర్‌టి వారు ఆలోచించి ఉండవలసింది. ఈ రెండూ ప్రధాన అంశాలు కనుక పేర్కొనటం జరిగింది. ఈ సంస్కరణల అమలుకు ఇప్పటి వరకూ తీసుకొన్న కార్యక్రమాలనూ వాటి తీరునూ చూద్దాం.

పరీక్షల సంస్కరణకు National Focus Group on Examinations వారి సూచనలతో ప్రారంభిద్దాం. కరిక్యులమ్, పాఠ్యపుస్తకాలు ఆసక్తికరంగా ఆయా తరగతుల స్థాయికి అనుగుణంగా పరిపూర్ణంగా కాకపోయినా సంతృప్తి కరంగా తయారు చేశారు. ఈ సంవత్సరం గతంకన్నా భిన్నంగా 10వ తరగతి పాఠ్య పుస్తకాలు సకాలంలోనే ఇచ్చారు. రెండవది సిసిఇ విధానం అమలులో పాఠశాలల్లో ఉపాధ్యాయ–విద్యార్థి నిష్పత్తి 1:30 మించ కూడదు. ఉపాధ్యాయుడు విద్యార్థిని నిరంతరం విభిన్నాంశాలలో మూల్యాంకనం చెయ్యాల్సి వుంటుంది. ప్రయోగాలు, ప్రాజెక్టులు, చర్చలు మొ॥ సంతృప్తికరంగా విద్యార్థికి న్యాయం జరిగేలా మూల్యాంకనం చేయాలంటే ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి తక్కువగా ఉండాలి. దీనికి అనుగుణంగా చర్యలు చేపట్టలేదు. ఉపాధ్యాయ పోస్టులు పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. మారిన సహపాఠ్యాంశాలకు ఉపాధ్యాయుల్ని నియమించలేదు. అనుగుణంగా టైంటేబుల్ రూపకల్పన చేయలేదు. పైగా మూల్యాంకనం చేయవలసిన అంశాలకు ఉపాధ్యాయ నియామకం ఉండదని సూచిస్తున్నట్లుగా విలువలు– జీవన నైపుణ్యాలను భాషోపాధ్యాయులు / సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు, కళలు– సాంస్కృతిక విద్య సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు / భాషోపాధ్యాయులకు కంప్యూటర్ విద్య – భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు / జీవశాస్త్ర ఉపాధ్యాయునకు, వ్యాయామ–ఆరోగ్య విద్య ఫిజికల్ డైరెక్టర్ / వ్యాయామో పాధ్యాయునికి, వారు లేకపోతే ఇతర ఉపాధ్యాయులకు కేటాయించ మని ప్రభుత్వ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఆయా అంశాలను బోధించ టానికి అందులో నైపుణ్యంగల ఉపాధ్యాయులు అవసరం అని ఎస్‌సిఇఆర్‌టి వారికి తెలుసు. అయినా దానిని విస్మరించారంటే ఇది మొక్కుబడి తంతు అవుతుందేకాని, విద్యార్థి ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్‌కు ఉపయోగపడదు. సిసిఇ లక్ష్యాలకు వ్యతిరేకం.

**ఇక నిరంతర సమగ్ర మూల్యాంకనం–మన వారి భాష్యం :** పైన నిరంతర సమగ్ర మూల్యాంకనం గురించి చర్చించాం. సంవత్సరంలో రెండు సంగ్రహణాత్మక మూల్యాంకనాలు ఉంటాయి. మొదటి మూల్యాంకనంలో ఉన్న పాఠ్యాంశాలు రెండవ మూల్యాంకనంలో మరలా ఉండవు. కాని జిఓ నం. 17లో 9,10 తరగతులకు 3 సంగ్రహణాత్మక మూల్యాంకనాలు వుంటాయని పేర్కొన్నారు. ఎస్‌సిఇఆర్‌టి వారు నిరంతర సమగ్ర మూల్యాంకనం గురించి యిచ్చిన కరదీపికలో (1–8 తరగతులకు) 2 సంగ్రహణాత్మక మూల్యాంకనాలను సూచించారు. తర్వాత ఏప్రిల్‌లో 3వ సంగ్రహణాత్మక మూల్యాంకనం జరపాలని ఉత్తర్వులిచ్చారు. ఇది అశాస్త్రీయం. విద్యార్థిపై ఒత్తిడి పెంచేది. విద్యార్థిపై పరీక్షభారం ఎక్కడ తగ్గుతుంది? గతంలో 4 యూనిట్ పరీక్షలు, త్రైమాసిక, అర్థ సంవత్సర, వార్షిక పరీక్షలను పేరు మార్చి $F_1, F_2, F_3, F_4$, $S_1, S_2, S_3$ అన్నారు. ఇది సంస్కరణ ఎలా అవుతుంది? కొత్త సీసాలో పాత సారా! ఇలా ఎందుకు జరుగుతోంది? ఎన్ని కమీషన్లు చెప్పినా మన మనసులో పరీక్షలంటే విద్యార్థిని ఎక్కువ అంశాలమీద పరీక్షించి ఎంత గుర్తుంచుకొన్నాడో తెలుసుకోవటం అనే పాతుకుపోయిన వైఖరిని వదిలించుకోకపోవటమే! (గతంలో కూడ ఈ విధానం ఉండి. SSLC/ HSLC ఉన్న రోజుల్లో (1969కి పూర్వం) 5వ ఫారం, 6వ ఫారంలలో చెప్పిన అన్ని పాఠ్యాంశాలు SSLC పబ్లిక్ పరీక్షల్లో పరీక్షించేవారు. తర్వాత ఎస్ఎస్‌సి వచ్చింది. చాలాకాలం ఎస్ఎస్‌సిలో 9వ & 10వ తరగతుల సిలబస్‌లో ప్రశ్నలుండేవి. ఈ విధానం సరైంది కాదని దానిని మార్చుకొన్నాం) ఈ వైఖరిని విధాన నిర్ణయం చేసే అధికారులు ముందు అవగాహన చేసుకోవాల్సి ఉంది. మన దేశంలో యన్‌సిఎఫ్–2005 చేసిన సూచనలు మొదటగా సిబిఎస్ఇ వారు అమలు చేశారు. మారుతున్న కాలంతో సిబిఎస్ఇ మారింది. గ్రేడింగ్ విధానం అమలు చేసింది. సిసిఇని అమలు చేసింది. ఫలితాలు బాగున్నాయి. సిసిఇని దశలవారీగా అమలు చేస్తూ ప్రతి దశలో సమీక్షలు నిర్వహించింది. పాఠ్యాంశాలు, పాఠ్య పుస్తకాలతో పాటు అన్ని సబ్జెక్టులకు, సహపాఠ్యాంశాలయిన డ్రాయింగ్, క్రాఫ్ట్, యోగా, మ్యూజిక్ మొ॥ వాటికి పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించారు. మంచి ఫలితాలు వస్తున్నాయి.

మన రాష్ట్రంలో 2011 నుండి సిసిఇ 1 నుండి 8 తరగతులకు అమలు చేస్తున్నా దాని ఫలితాలను సమీక్షించలేదు. ఉపాధ్యాయుల కొరత, సరైన శిక్షణ లేకపోవటం (నామమాత్రపు శిక్షణ యిచ్చారు),

# కీర్తి పతాక



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో విజయ గీతమాలాపించింది. పిఎస్ఎల్వి-సి23 ప్రయోగం విజయవంతం కావడం అంతరిక్ష సాంకేతిక విజ్ఞాన రంగంలో మన ఘనతను మరోసారి చాటిచెప్పింది. వాణిజ్యపరంగా కూడా ప్రాముఖ్యం ఉన్న ప్రయోగం ఇది. ఈ రాకెట్ కక్ష్యలో ప్రవేశ పెట్టిన ఉపగ్రహాలలో ఫ్రాన్స్‌కు చెందిన 714 కిలోల భారీ ఉపగ్రహంతోపాటు, 14-15 కిలోల బరువైన జర్మనీ, కెనడా, సింగపూర్‌లకు చెందిన ఉపగ్రహాలు ఉన్నాయి. పిఎస్ఎల్వి రాకెట్‌ను భారత కీర్తిపతాకగా అభివర్ణించడం అతిశయోక్తికాబోదు. 1993 నుంచి ఇప్పటి వరకు జరిగిన 27 పిఎస్ఎల్వి ప్రయోగాలలో తొలి సందర్భాన్ని మినహాయిస్తే వైఫల్యాలు లేవనే చెప్పవచ్చు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానాన్ని ఉపయోగించినది కావడం దీని మరో ప్రత్యేకత. ఇంతవరకు 35 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించిన ఈ రాకెట్ మన దేశాన్ని అమెరికా, రష్యా తదితర అగ్రశ్రేణి దేశాలు అయిదింటి సరసన 'వాణిజ్యశ్రేణి'లోకి ప్రవేశపెట్టిందని చెప్పాలి. 300 శతకోటి డాలర్ల విలువైన అంతర్జాతీయ అంతరిక్ష విపణిలో మన దేశం వాటాపొందే అవకాశం కల్పించింది. ఇస్రో నిర్వహించిన చంద్రయాన్-1, మార్స్ మిషన్‌లు విజయవంతం కావడంలో పిఎస్ఎల్వి పాత్రే కీలకం. ఖర్చును కనీస స్థాయికి తగ్గించడానికి దేశీయ పరిజ్ఞానం ఎంత అవసరమో పిఎస్ఎల్వి చాటిచెబుతుంది. చంద్రయాన్-1కి ఇస్రో చేసిన 8 కోట్ల 90 లక్షల డాలర్ల వ్యయం అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా చేసిన వ్యయంలో 17వ వంతు మాత్రమే. అలాగే, ఆసియా దేశాలలోనే భారత్‌ను అగ్రస్థానంలో నిలిపిన మార్స్ మిషన్‌కు చేసిన వ్యయం 7 కోట్ల 30 లక్షల డాలర్లు మాత్రమే. ఇది ఒక రికార్డు కూడా. ఒక హాలీవుడ్ చిత్రంకన్నా ఈ ఖర్చు తక్కువ అని ప్రధాని నరేంద్రమోడీ సరిగానే చెప్పారు. 1974లో మన దేశం అణుపరీక్షలు నిర్వహించిన దరిమిలా పాశ్చాత్య దేశాలు మన అంతరిక్ష పరిశోధనలపై విధించిన ఆంక్షల ఫలితంగా స్వదేశీ పరిజ్ఞానం దిశగా మనం అడుగులు వేసిన సంగతి ఇక్కడ గుర్తు చేసుకోవాలి. అమెరికా తదితర దేశాల ఆంక్షలను ఇస్రో శాస్త్రవేత్తలు ఒక సవాలుగా తీసుకుని తమ మేధస్సుకు పదును పెట్టి దేశీయంగా సాంకేతికతను అభివృద్ధి చేశారు. కనుకనే అంతరిక్ష రంగంలో వాణిజ్యపరంగా లాభాలు గడించే స్థాయికి దేశం చేరుకోవడమే కాక, అయిదు అగ్రగామి దేశాల సరసన స్థానం పొంద గలిగింది. ఈ స్ఫూర్తితో రక్షణ తదితర రంగాలనూ స్వావలంబన దిశగా నడిపించలేక పోవడంలో పాలకుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కన్పిస్తుంది. దేశీయంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవడం మినహా ప్రత్యామ్నాయం లేదని ఇప్పటికైన వేల కిలోలను మించిన కమ్యూనికేషన్ ఉపగ్రహాలను ప్రయోగించగలిగిన భారీ రాకెట్ జిఎస్ఎల్వి ఇస్రో ప్రతిభా పాటవాలకు పెద్ద పరీక్షగానే పరిణమించింది. వచ్చే రెండేళ్లలో ఈ పరీక్షను దాటడానికి కృషి చేస్తామని ఇస్రో చెబుతున్నది. ఆ కృషి ఫలించాలని ఆకాంక్షిస్తూ ప్రస్తుత ఘన విజయానికి అభినందిద్దాం.

**పాఠశాల విద్య - 10వ తరగతి పరీక్షా విధానంలో సంస్కరణలు**

అందరికీ తెలిసినదే! అందుకే National Focus Group on Examination చెప్పిన అంశాల్లో ముఖ్యమైన ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచటం, శిక్షణ, ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిలో గుణాత్మక మార్పులకు ఈ సంస్కరణల్లో పరిష్కార మార్గాలు చూపలేదు. ఇక ముఖ్యమైనది, అత్యంత ప్రాధాన్యత సంతరించుకొన్న అంశం "అన్ని స్థాయిల్లో... ముఖ్యంగా సెకండరీ స్థాయిలో విద్యకు ఎక్కువ నిధులు కేటాయించాలి". దీనిపై ఎలాంటి స్పందన ఈ సంస్కరణలలో లేదు. ఉపాధ్యాయ నియామకాలు, ప్రతి పాఠశాలకు విద్యుత్, కంప్యూటర్లు, ప్రయోగశాలలు, లైబ్రరీ వీటిని కాపాడే ప్రహరీగోడ, వాచ్‌మన్ నియామకం.... అన్నీ డబ్బుతో కూడినవే! ప్రభుత్వ పాఠశాలలకు ఇవన్నీ సమకూర్చాలి. అప్పుడే విద్యార్థికి న్యాయం జరుగుతుంది. అలాకాకుండా కేవలం పేపర్ల సంఖ్య తగ్గించటం, మార్కులు విభజించటం పరీక్షల సంస్కరణకాదు.

ప్రభుత్వం వెంటనే ఈ క్రింది అంశాలకు ప్రాధాన్యత కల్పించాలి.

1. సిసిఇని నిజమైన స్పిరిట్‌తో అమలు చేయటానికి $F_1, F_2, S_1$, - $F_3, F_4$-$S_2$ లుగా $S_1$లోని పాఠ్యాంశాలను మినహాయించి $S_2$ని పబ్లిక్ పరీక్షగా నిర్వహించాలి.
2. సహపాఠ్యాంశాలు బోధించటానికి, మూల్యాంకనం చేయటానికి ప్రత్యేకంగా ఉపాధ్యాయులను నియమించాలి.
3. ఉపాధ్యాయ - విద్యార్థి నిష్పత్తి 1:30గా వుంచి అదనపు ఉపాధ్యాయులను నియమించాలి.
4. సక్సెస్ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం బోధించటానికి అదనంగా ఉపాధ్యాయులను నియమించాలి.
5. ప్రతి పాఠశాలకు కంప్యూటర్లు, కంప్యూటర్ టీచర్లు, ప్రయోగశాలలు, లైబ్రరీ (లేటెస్ట్ పుస్తకాలతో) సమకూర్చాలి.
6. ఉపాధ్యాయులకు సిసిఇ పద్ధతిలో బోధించటానికి ఈ విధానంపై అనుభవమున్న వారితో శిక్షణ ఇవ్వాలి.

అలా చేయటం కష్టం కాదు. చిత్తశుద్ధి ఉంటే!

**ముగింపు :** మారిన పరీక్షా విధానం బోధనాభ్యసనం మీద ఆధారపడి ఉండాలి. అలాకాకుంటే తోక (పరీక్షా విధానం) కుక్క (బోధనాభ్యసన ప్రక్రియ)ను ఆడిస్తున్నట్లు అవుతుంది. (ఈ వాఖ్య National Focus Group on Examination Reforms భారత దేశ విద్యా విధానం మీద వస్తున్న బాధాకర విమర్శగా పేర్కొంది.)

నాగటి నారాయణ



# విద్యాహక్కు చట్టం ఇంతే సంగతులా! చట్టాన్ని పట్టించుకోని కొత్త ప్రభుత్వాలు

జాతి యావత్తూ ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న విద్యాహక్కు చరిత్ర కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితులు దాపురిస్తున్నాయి. 60 యేళ్ళ స్వతంత్ర భారత విద్యారంగంలో వచ్చిన చరిత్రాత్మక చట్టం నాలుగేళ్లు తిరక్కుండానే చట్టుబండగా మిగిలిపోనున్నదా? కేంద్రంలో మరియు తెలుగువారి రెండు రాష్ట్రాల్లోనూ కొత్త ప్రభుత్వాలు గద్దెనెక్కాయి. విద్యారంగం గురించి చాలా గొప్పలు పోతున్నారు. కానీ అసలు విషయం విద్యాహక్కు చట్టం గురించి ఎవరూ ఏమీ చెప్పటం లేదు.

చరిత్రాత్మక విద్యాహక్కు చట్టం (ఆర్‌టిఇ) అమల్లోకి (2010 ఏప్రిల్ 1) వచ్చి 4వ సంవత్సరం గడుస్తోంది. ఇది ఐదేళ్లలో పూర్తిస్థాయిలో ఆచరణలోకి రావాలని నిర్ణయించటం జరిగింది. విధివిధానాలు, ప్రమాణాలు, గడువు, నిధులు, బాధ్యతలు నిర్ధారించబడినవి. ప్రతియేటా అమలు తీరుతెన్నులను సమీక్షించాలని, మోనిటరింగ్ సెల్స్‌ని ఏర్పాటు చేయాలని నిర్ణయించ బడింది. మొదటి మూడేళ్లా వార్షిక నివేదికలు ప్రకటించిన మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం నాలుగో సంవత్సరానికి ముఖం చాటేసింది. అయినా బాధ్యతగల కొన్ని ప్రభుత్వేతర సంస్థలు (ఆర్‌టిఇ ఫోరమ్, సిఎస్ఎస్, క్రై వగైరా). ఎస్‌టిఎఫ్ఐ, విద్యా పరిరక్షణ సమితి, యుటిఎఫ్ వంటి సంఘాలు నిరంతరం ఆర్‌టిఇ అమలు కోసం ప్రభుత్వాలపైన వత్తిడి తెచ్చే ప్రయత్నం చేశాయి. స్వంత సర్వేలు జరిపి కొన్ని నివేదికలు రూపొందించాయి. వారి ప్రకారం ఆశ్చర్యకరమైన వాస్తవాలు, పాలకుల వైఫల్యాలు కొట్టొచ్చినట్లుగా కనబడుతున్నాయి.

విద్యాహక్కు చట్టం అమలుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన టైమ్ టేబుల్ ప్రకారం 2013 మార్చి 31 వరకు (3 సంవత్సరాల కాలంలో) పూర్తి కావాల్సిన పనులు ఏమిటో తెలుసా? బడిఈడు గల బాలలు (6-14 సం॥లు వయస్కులు) అందరినీ బడిలో చేర్చాలి. కానీ ఇప్పటికీ అధికారిక లెక్కల ప్రకారం కోటిమంది పిల్లలు బడి బయటనే వుండిపోయారు. వసతుల కల్పన సంగతి అందని ద్రాక్షగా మిగిలి అనేక పాఠశాలలు అనాథశరణాలయాలుగానే కునారిల్లుతున్నాయి. దేశ వ్యాప్తంగా పది లక్షలమంది అదనంగా ఉపాధ్యాయులను నియమించాలనే ఆదేశం అరణ్యరోదనగానే మిగిలిపోయింది. కనీసం 7 లక్షలమందినైనా వెంటనే నియమించాలనే సూచనను పట్టించుకోవటం లేదు. 31% ప్రాథమిక పాఠశాలల్లో బాలికలకు విడిగా మూత్రశాలలు లేవు. 44% స్కూళ్లలో అంగవికల విద్యార్థులకు ర్యాంప్స్ ఏర్పాటు చేయనేలేదు. ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి, తరగతి గది విద్యార్థుల నిష్పత్తిలోనూ లక్ష్యం నెరవేరనే లేదు. కాగా 90వేల ప్రాథమిక పాఠశాలలు ఒక్క టీచర్‌తోనే నెట్టుకొస్తున్నాయి. 2010 నుండి 2013 వరకు ఆర్‌టిఇ (ఎస్ఎస్ఏ) ద్వారా జరిగిన అభివృద్ధిలో మరికొన్ని వివరాలు పట్టిక-1లో చూడ వచ్చును.

**పట్టిక-1**
**విద్యా హక్కు చట్టం మొదటి 3 యేళ్లలో సాధించిన ప్రగతి నివేదిక (అన్ని పర్సంటేజిల్లో)**

| విషయం | 2009-2010 | 2012-2013 |
|---|---|---|
| తరగతికి 30మందిలోపు విదార్థులు వుండే ప్రాథమిక పాఠశాలలు | 40 | 29 |
| గదికి 35మందిలోపు విదార్థులుండే ప్రాథమికోన్నత పాఠశాలలు | 36 | 32 |
| త్రాగునీరు ఏర్పాటు చేసిన స్కూల్స్ | 93 | 95 |
| బాలికలకు విడిగా టాయ్‌లెట్స్ వుండేవి | 59 | 69 |
| వికలాంగుల విద్యార్థుల కోసం ర్యాంప్‌లు | 47 | 56 |
| ఆట స్థలములు గలవి | 51 | 57 |
| సరిహద్దు గోడలు గల పాఠశాలలు | 51 | 61 |
| వంట గదులు గల పాఠశాలలు | 43 | 60 |
| విద్యార్థి టీచర్ నిష్పత్తి 30లోపు వున్నవి | 46 | 37 |
| యుపిఎస్‌ల్లో పిటిఆర్ 35లోపు వున్నవి | 36 | 33 |

ఢిల్లీలోని ఆర్‌టిఇ ఫోరమ్ అంచనా మేరకు దేశ వ్యాప్తంగా వున్న 11 లక్షల (ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాలలో) స్కూళ్లలో 92% పాఠశాలలు విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయటం లేదు. మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు ఇవ్వవలసిన ప్రోత్సహకాలు (పాఠ్య పుస్తకాలు, దుస్తులు వగైరాలు), ఉపాధ్యాయుల నియామకాలు తదితర ప్రమాణాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రధాన లోపంగా వుంటే... 25% సీట్లలోనైనా పేదవర్గాల పిల్లలకు చదువు చెప్పాలనే నిబంధనను ప్రైవేట్ పాఠశాలలు పట్టించుకోవటం లేదు. చట్టం ఐదేండ్లు అమలు కావల్సిన కాలంలో రూ. 2,31,233 కోట్లు కావాలని నిపుణుల కమిటీ సిఫారసు చేయగా ఇప్పటికి రూ. 88,813 కోట్లు మాత్రమే కేటాయించబడినవి. యుద్ధప్రాతిపదికన నిర్వహించాల్సిన జాతీయ కర్తవ్యానికి ఇంత బాధ్యతారహితంగా నిధుల విషయంలో నిర్లప్తిత పాటిస్తే మరో 60 యేళ్లు గడిచినా అందరికీ సమానంగా నాణ్యమైన విద్యను అందించాలనే విద్యాహక్కు లక్ష్యం నెరవేరే అవకాశం లేదు. ఇప్పటికైనా కేంద్రంలోని బిజెపి, తెలంగాణలోని టిఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి ప్రభుత్వాలు విద్యాహక్కు చట్టం అమలు చేయటానికి కేంద్రీకరించాలి. ఆర్‌టిఇ ఫోరమ్ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి.

1. ఎన్‌డిసి అత్యవసర సమావేశాన్ని నిర్వహించి, అందరితో చర్చించి విద్యాహక్కు చట్టం అమలు కోసం రోడ్‌మ్యాప్ ప్రకటించాలి.
2. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాహక్కు చట్టం అమలుకు చేసిన కృషి, సాధించిన ఫలితాలతో కూడిన శ్వేత పత్రాలు ప్రకటించాలి.
3. ఆర్‌టిఇ పైన విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలు, సమాజ భాగస్వామ్యాన్ని సమకూర్చాలి.
4. పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసి)లను బలోపేతం చేసి రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలి.
5. గ్రీవెన్స్ రిడ్రెసల్ మెకానిజంను జిల్లా, స్థానిక స్థాయిలో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి.
6. 14-18 సం॥ల వయస్సు పిల్లలకు కూడ విద్యాహక్కు చట్టాన్ని విస్తరింప చేయాలి.
7. ఆర్‌టిఇ అమలు మరియు విద్యాభివృద్ధికి తగినన్ని నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమకూర్చాలి.

# టీచర్లకు ముప్పు తెచ్చే కోర్టు తీర్పు



అమెరికాకు జలుబు చేస్తే ఇక్కడి వారు తుమ్ముతారు. మనకూ వారికి మధ్య ఉన్న సంబంధం అలాంటిది. దానిని మరింతగా గట్టి పరిచేందుకు రానున్న రోజుల్లో చర్యలు వేగవంతం అవుతాయి. కిటికీ తెరిస్తే మంచి గాలితో పాటు ఈగలూ, దోమలూ వస్తాయన్న సామెత తెలిసిందే. మన దేశ కిటికీలను విదేశాలకు తెరిచిన తరువాత మంచిగాలి ఎంత మేరకు వచ్చిందో తెలియదు గాని ఈగలూ, దోమలూ కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్నాయి.

అమెరికాలో మాదిరి యజమానులకు ఇష్టమైతే హైర్ లేకుంటే ఫైర్ అన్న విధానాన్ని అమలు జరపాలని ఎప్పటి నుంచో డిమాండ్. అలా చేస్తేనే కార్మికులు వళ్లు వంచి పనిచేస్తారన్నది ఆ వాదన సారాంశం. అందుకు భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని రాజస్థాన్ ప్రభుత్వం ఉపాధి అనుకూల సంస్కరణలనే పంచదార పూత పూసి దూకుడుగా అమలు జరిపేందుకు పూనుకుంది. ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం వంద మందిని మాత్రమే ప్రభుత్వ అనుమతి లేకుండా యాజమాన్యం రిట్రెంచ్ చేయవచ్చు. రాజస్థాన్ రాణి వసుంధరా రాజె ఉపాధి అనుకూల సంస్కరణలు అమలులోకి వస్తే మూడు వందల మందిని ఒక్క నోటీసుతో ఇంటికి పంపవచ్చు.



ఎం.కోటేశ్వరరావు
ప్రముఖ పాత్రికేయులు

ఈ సందర్భంగా కార్మికులు, కంపెనీల గురించి మనకెందుకు అన్న ఆలోచన టీచర్లకు రావటం సహజం. అన్ని సంస్కరణలూ ఒకేసారి తీసుకువచ్చి కార్మికవర్గాన్ని ఐక్యం చేయటం గతకాలపు యజమానుల మొరటు పద్దతి. విభజించి పాలించు అన్నట్లుగా ఒక్కొక్క తరగతికి మెల్లమెల్లగా అమలు జరపటం నేటి పద్దతి. విద్య గతంలో మన దేశంలో ఆదేశిక సూత్రాల్లో భాగం ఇప్పుడు హక్కు. అమెరికాలో కూడా విద్యా హక్కు చట్టం ఉంది. ఇప్పుడు ఆ చట్టమే టీచర్లు, ప్రభుత్వ స్కూళ్లకు ఎసరు తెస్తోంది. దాన్ని అడ్డుపెట్టుకొని టీచర్లకు భద్రత లేకుండా చేయటంతో పాటు ప్రభుత్వ స్కూళ్ల స్థానంలో ప్రవేశించేందుకు కార్పొరేట్ కంపెనీలు పావులు కదుపుతున్నాయి.

జూన్ పదిన అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలోని లాస్ ఏంజల్స్ కోర్టు ఇచ్చిన తీర్పు ఒక్క అమెరికన్ టీచర్లకే గాక నయా ఉదారవాద విధానాలు అమలు జరుపుతున్న మనవంటి దేశాల టీచర్లందరికీ ఒక హెచ్చరిక. దీని సారాంశం ఏమంటే ప్రభుత్వ స్కూళ్ల టీచర్లు అయినంత మాత్రాన వారికి ఎలాంటి ప్రత్యేక రక్షణలు ఉండవు. టీచర్లకు ఉన్న సర్వీసు రక్షణల కారణంగా తమకు నాణ్యమైన విద్య లభించలేదని కొందరు విద్యార్థులు వేసిన దావాను కోర్టు సమర్థించింది.

విద్యా ప్రమాణాలు అనేవి రూళ్ల కర్రల్లాంటివి కాదు. అనేక సామాజిక,ఆర్థిక, సాంస్కృతిక అంశాల ప్రభావితంగా ఉంటాయి.తొమ్మిది మంది కాలిఫోర్నియా రాష్ట్ర ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు వేసిన దావాలో రాష్ట్ర ఎడ్యుకేషన్ కోడ్, శాశ్వత ఉపాధి చట్టం వంటివి అందరికీ సమానమైన రక్షణ కల్పించాలన్న క్లాజును ఉల్లంఘిస్తున్నాయని పేర్కొన్నారు. అంటే ఇది విద్యా ప్రమాణాలకంటే ఇతర అంశాలకు ప్రాధాన్యమిచ్చే దావా తప్ప మరొకటి కాదు. దీని వెనుక 'స్టూడెంట్స్ మాటర్స్' పేరుతో ఒక సంస్థను నిర్వహిస్తున్న సిలికాన్ వాలీ కోటీశ్వరుడు డేవిడ్ వెచ్ ఉన్నాడు. ప్రభుత్వ స్కూళ్లను మూసివేసి వాటిని ప్రయివేటు కార్పొరేట్లకు అప్పగించాలని కోరే వారి తరపున అది పని చేస్తోంది. అందుకే ఈ కేసుకు ప్రజల మద్దతు కూడగట్టేందుకు భారీ మొత్తంలో డబ్బు చెల్లించి పెద్ద లాయర్లను, ఒక ప్రచార సంస్థను నియమించారు. కాలిఫోర్నియా రాష్ట్ర కోర్టులో వచ్చిన తీర్పుతో మిగతా రాష్ట్రాలలో, వాషింగ్టన్ డిసిలో కూడా ఇలాంటి దావాలనే వేయాలని నిర్ణయించారు.

ప్రభుత్వ స్కూళ్లను మూసివేసి విద్యారంగ బాధ్యతలను వదిలించుకోవాలని చూస్తున్న అమెరికా ప్రభుత్వానికి ఈ తీర్పు అడగని వరంలా మారింది. బోధనా వృత్తికి నూతన చట్టాన్ని రూపొందించేందుకు కాలిఫోర్నియా కోర్టు తీర్పు ఒక ఆదర్శంగా తీసుకోవాలని విద్యాశాఖ మంత్రి అర్నే డంకన్ వెంటనే వ్యాఖ్యానించారు. ఒకసారి ఉద్యోగంలో చేరిన తరువాత పర్మనెంట్ చేయటం, సీనియారిటీ వంటి రక్షణల కారణంగా టీచర్లలో ప్రమాణాలు పడిపోతున్నాయని, సరిగా పనిచేయటం లేదని విద్యార్థుల తరపు పిటీషనర్లు చేసిన వాదనతో కోర్టు ఏకీభవించింది.ఉద్యోగం, సీనియారిటీ రక్షణ వంటి అంశాలు వివక్షాపూరితమైనవని, దీని వలన స్కూళ్లలో పూర్తిగా అసమర్థులైన టీచర్లు ఉంటున్నారని, ఆ పరిస్థితి అల్పాదాయ మరియు మైనారిటీ విద్యార్థుల అవసరాలను తీర్చలేదని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఒక పత్రిక ఈ తీర్పు 'విద్య విజయం' అని వర్ణించింది. సమర్థతలేని టీచర్ల కారణంగా ఒక్కొక్క తరగతి విద్యార్థులు తమ జీవిత కాలంలో 14లక్షల డాలర్లు నష్టపోతున్నారని హార్వర్డ్ విశ్వవిద్యాలయ ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్ చేసిన అధ్యయనంలోని అంశాన్ని న్యాయమూర్తి ఉపయోగించుకున్నాడు. సరిగా పాఠాలు చెప్పని టీచర్లను విధులనుంచి తొలగించాలంటే చట్టాలు అంగీకరించటం లేదని, ఒక వేళ చర్య తీసుకోవాలన్నా రెండు నుంచి పది సంవత్సరాల వ్యవధి పడుతోందని, ఒక్కో టీచర్‌ను తొలగించాలంటే రెండున్నర నుంచి నాలుగు లక్షల డాలర్లు ఖర్చు అవుతోందని విద్యాశాఖ అధికారులు తమ సాక్ష్యంలో చెప్పారు. కాలిఫోర్నియా రాష్ట్రంలో ఒక

టీచర్‌ను పర్మనెంట్ చేయటానికి 18నెలల వ్యవధి నిర్ణయించారని, అయితే టీచర్ సామర్థ్యాన్ని నిర్ధారించటానికి అది తక్కువని, మూడు నుంచి ఐదు సంవత్సరాలు ఉండాలని పిటీషనర్లు వాదించారు. రాష్ట్రంలో 2,75,000 మంది టీచర్లు ఉండగా వారిలో అసమర్థులు 2,850 నుంచి 8,250 మంది వరకు ఉన్నారని, వారి సంఖ్య తక్కువే అయినప్పటికీ మొత్తంగా వ్యతిరేక ప్రభావం పడుతుందని న్యాయమూర్తి వ్యాఖ్యానించాడు. సరిగా చెప్పని టీచర్ల కారణంగా ఆఫ్రో-అమెరికన్(నల్లజాతి) విద్యార్థులు 43శాతం, లాటిన్ అమెరికన్లు 63శాతం మంది నష్టపోతుండగా తెల్లజాతీయులు ఐదుశాతం మందే నష్టపోతున్నట్లు ఒక అధ్యయనంలో పేర్కొన్నారు. దీన్ని ఆధారం చేసుకొని మన రాష్ట్రంలో, ఇతర చోట్ల ఇలాంటి కేసులు దాఖలు అయ్యే అవకాశం లేదని, అలాంటి తీర్పులు రావని, మన న్యాయవ్యవస్థ నుంచి అలాంటి భాష్యాలు వెలువడవని ఎవరైనా చెప్పగలరా?

ఈ దావా విద్యార్థులకు ఏం కావాలన్న అంశానికి సంబంధించింది కానట్లే, తీర్పు కూడా లోపభూయిష్టమైనదని కాలిఫోర్నియా టీచర్స్ ఫెడరేషన్, ఇతర యూనియన్లు విమర్శించాయి. ఇది విద్యార్థులకు అనుకూలమైనది కాదు, మౌలికంగా ప్రభుత్వ విద్యావ్యవస్థకు వ్యతిరేకమైనది, తగినన్ని నిధుల కేటాయింపు లేకపోవటం, దారిద్ర్యం, ఆర్థిక అసమానతల కారణంగా తలెత్తే సమస్యలకు టీచర్లను బలిపశువులను చేస్తున్నదని టీచర్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ జాషువా పెచ్‌హాల్ట్ వ్యాఖ్యానించారు. స్కూళ్లలో సానుకూల వాతావరణానికి అవసరమైన వనరులను అందించటానికి బదులు టీచర్ల హక్కులను హరించటానికి ఈ తీర్పు దోహదం చేస్తుందని పేర్కొన్నారు. శాన్‌ఫ్రాన్సిస్‌కోలో ఉన్న పౌరహక్కుల ఉల్లంఘన, జాతివివక్ష, స్కూళ్ల ప్రాంగణాలలోనే అరెస్టు చేయటం వంటి పరిస్థితులను ఈ తీర్పు పరిగణనలోకి తీసుకోలేదని లాయర్స్ యూనియన్ పేర్కొన్నది. టీచర్లను తొలగించటం ద్వారా విద్య మెరుగు పడుతుందన్న రుజువులేమీ లేవని, ప్రయివేటీకరణ ఎత్తుగడల అమలుకు మాత్రమే దోహదం చేస్తుందని విద్యావేత్త డియానే రావిచ్ వ్యాఖ్యానించారు. ఈ దావా వెనుక ఉన్న నిజంగా విద్యార్థులకు మద్దతుగా ఉన్నట్లయితే వారికి అవసరమైన సౌకర్యాలను కోరి ఉండేవారని పేర్కొన్నారు.

ఇసుక నుంచి తైలం తీయవచ్చు, కుందేటి కొమ్ము సాధించవచ్చు అన్నట్లుగా పెట్టుబడిదారులు తమకు లాభాలు వచ్చే మార్గాలను అనుసరించటం తెలిసిందే. అమెరికాలో స్కూలు పిల్లల నుంచి లాభాలు పిండేందుకు కార్పొరేట్ సంస్థలు 'ఉమ్మడి పరీక్షా విధానాన్ని' రూపొందించాయి.

అందుకుగాను తొలుత 2002లో దేశంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఒకే విధమైన పరీక్షా పద్ధతులు ఉండాలంటూ ఒక నిబంధనను ప్రభుత్వంతో ఆమోదింపచేయించారు. దీంతో టీచర్లు పిల్లలు రాయటం, చదవటం వంటి అంశాలపై శ్రద్ధ తీసుకోవటానికి బదులు ఆ పరీక్షలకు తయారు చేయించటంపై(బట్టీ పట్టించటానికి) కేంద్రీకరణకు పరిమితం అయ్యే విధంగా అది మార్చివేసింది. ఎందుకంటే ఆ నిబంధన ప్రకారం పరీక్షల్లో తగినన్ని మార్కులు రాకపోతే స్కూళ్లకు నిధుల కోత పెట్టాలన్న నిబంధన విధించారు. టీచర్లు ఇందుకోసం కార్పొరేట్ సంస్థలు రూపొందించిన గణిత, ఆంగ్ల భాష సాఫ్ట్‌వేర్, పుస్తకాలను ఆశ్రయించాల్సి వచ్చింది. స్కూళ్లు తమ నిధులను వాటికోసం ఖర్చు పెట్టాల్సి వచ్చింది. ఈ విధంగా కంపెనీలు లాభాలు పొందాయి తప్ప పిల్లలకు ఉపయోగపడింది లేదు. ఎందుకంటే మన దేశంలో మాదిరి పిల్లలందరూ ఒకే విధంగా లేరు. ఫలితాలు రాని స్కూళ్లలో శిక్షణ పేరుతో మరింత భారం మోపారు, కొందరు టీచర్లను ఇళ్లకు పంపారు, ఫలితాలు తక్కువ వచ్చిన స్కూళ్లను ప్రయివేటు యాజమాన్యాలకు అప్పగించటం ప్రారంభించారు.

ఉమ్మడి పరీక్ష, సాంకేతిక పరిజ్ఞానం అందచేత పేరుతో ప్రవేశపెట్టిన అంశాల వలన మనందరికీ తెలిసిన మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్, మరొక కంపెనీ ప్రధానంగా లబ్ది పొందింది. తొలి రోజుల్లో ఈ కంపెనీలు విద్యారంగంలో ఆధునిక నైపుణ్యాలను ప్రవేశ పెట్టే పేరుతో తమ ఫౌండేషన్ల ద్వారా స్కూళ్లకు విరాళాలు అందచేసి తమ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అవసరమైన నేపథ్యాన్ని తయారు చేసుకున్నాయి. తాము రూపొందించిన విధానాన్ని స్కూళ్లపై రుద్దేందుకు గేట్స్ ఫౌండేషన్ ఒక్కటే విద్యాశాఖను 'ప్రభావితం చేసేందుకు' పదిహేడు కోట్ల డాలర్ల విరాళాలు, లంచాలిచ్చింది. తమ కంపెనీ లబ్దికోసం స్కూళ్లకు అవసరమైన కోర్సులు, సాఫ్ట్‌వేర్ తయారీకి విరాళాల రూపంలో నిధులు ఖర్చు చేయటం లాభాపేక్షతో చేసిన చర్యగా పరిగణిస్తూ గత డిసెంబరులో న్యూయార్క్ రాష్ట్రం పియర్సన్ కంపెనీకి 77 లక్షల డాలర్ల జరిమానా విధించింది. గేట్స్, పియర్సన్ ఫౌండేషన్లు పుస్తకాల బదులు ఆన్‌లైన్‌లో చదవటం, లెక్కలు చేయటం వంటి సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులను ప్రవేశపెట్టి తలిదండ్రులతో కొనిపించింది. అంతే కాదు, టీచర్ల సామర్థ్యాన్ని మదింపు చేసే పేరుతో రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను ప్రభుత్వానికి అంటగట్టాయి.

పియర్సన్ కంపెనీ విద్యా సంబంధ పుస్తకాల ప్రచురణలో అగ్రగామి. అయితే పుస్తకాల ముద్రణ స్థానంలో డిజిటల్ టెక్నాలజీని ప్రవేశపెట్టింది. ఆధునిక పరిజ్ఞానం అందచేసే పేరుతో దానికి విద్యాశాఖతో ఆమోద ముద్రవేయించుకుంది. ఒక్క లాస్ ఏంజల్స్ విద్యాశాఖ పరిధిలోనే 2013లో ఆరులక్షల 51వేల మంది విద్యార్థులతో వంద కోట్ల డాలర్ల విలువ గల తన ఐపాడ్లను కొనిపించింది. సిలబస్, పరీక్షా పత్రాలు సర్వం అదే అందచేస్తుంది. వీటిపై టీచర్లకు శిక్షణ పేరుతో ఐదేళ్ల కాలానికి న్యూయార్క్ రాష్ట్రం 3.2, ఇల్లినాయిస్ 13.8, కెంటకీ 5.7,అటా 20, టెక్సాస్ 46.2 కోట్ల డాలర్లను ఈ కంపెనీకి చెల్లించేట్లు ఒప్పందం చేసుకుంది. అంతకు ముందు కొన్ని రాష్ట్రాలలో అది విఫలమై ఆ కార్యక్రమాన్ని నిలిపివేసినప్పటికీ గుడ్డిగా మరికొన్ని రాష్ట్రాలు ఆ కంపెనీతో ఒప్పందం చేసుకున్నాయంటే అవినీతి తప్ప మరొకటి కాదు.

పోనీ ఈ ఉమ్మడి పరీక్షా విధానం ఫలితాల నిచ్చిందా అంటే 2013లో న్యూయార్క్ రాష్ట్రంలో 70శాతం మంది తప్పారు. దీన్ని సాకుగా తీసుకొని మరిన్ని విద్యా సంస్కరణలు అవసరమని విద్యాశాఖ అధికారులు కొత్త పల్లవి అందుకున్నారు. అత్తారింటికి దారేది సినిమాలో బ్రహ్మానందాన్ని కొట్టేందుకు నిర్ణయించుకున్న పవన్‌కళ్యాణ్ మాదిరి ఎటుతిప్పి ఎటు చెప్పినా ప్రభుత్వ టీచర్ల తొలగింపు, స్కూళ్ల ప్రయివేటీకరణ అంశాలనే ముందుకు తెస్తున్నారు. అయితే ముందే చెప్పుకున్నట్లు ఈ విధానాలకు కొన్ని ఎదురు దెబ్బలు తగలటంతో గేట్స్, పియర్సన్ కంపెనీలు దూకుడును తగ్గించాయి.

అమెరికాలో పన్నెండవ తరగతి వరకు హైస్కూలు విద్య అత్యధిక భాగం ప్రభుత్వరంగంలోనే ఉంది. కార్పొరేట్ల పరిభాషలో దాని మార్కెట్ విలువ లక్షా 30వేల కోట్లు. అంటే ప్రయివేటీకరిస్తే అంత మొత్తాన్ని తలిదండ్రుల నుంచి పిండుకోవచ్చు. హైస్కూలు విద్య సాంకేతిక పరిజ్ఞాన మార్కెట్‌లో కార్పొరేట్ పెట్టుబడులు 2005 కేవలం 1.3 కోట్ల డాలర్లు మాత్రమే, అదే 2011 నాటికి 38.9 కోట్లకు పెరిగాయంటే ప్రయివేటీకరణ ఎంత ఊపందుకుందో ఊహించుకోవాల్సిందే. లాభాలకు పక్కా గ్యారంటీ ఉండే విద్యారంగ పరిశ్రమను పెట్టుబడిదారులు, అందునా ద్రవ్య పెట్టుబడిదారులు(డబ్బు జలగలు, రాబందులు) అసలు వదులుకుంటారా?



# బాలల హక్కులు - వాటి అమలు తీరు

కళ్ళముందే ఎన్నో ఊహించని మార్పులు చోటుచేసు కొంటున్నాయి. కానీ పిల్లల స్థితిలో ఏ మార్పులేదు. కనీస హక్కులు కూడా పొందలేని పిల్లలు వీధివీధినా కన్పిస్తారు. అత్యంత దుర్భరమైన, హేయమైన, అమానవీయ పరిస్థితుల్లో లక్షలాదిమంది పిల్లలు మన చుట్టూ బ్రతుకీడుస్తున్నారు. చెత్తకుండీల దగ్గర కాగితాలు ఏరుకొంటూ, పగిలిన గాజుపెంకుల మధ్య ఖాళీ సీసాలు సేకరిస్తూ, హొటళ్ళలో ఎంగిలి ప్లేట్లు ఎత్తుతూ, టీ అంగళ్ళలో బల్లలు తుడుస్తూ, భవన నిర్మాణ పనుల్లో, మెకానిక్ షెడ్లలో, కూరగాయల మార్కెట్లలో, బస్టాండ్ రైల్వేస్టేషన్లలో అడుక్కొంటూ, పొలాల్లో పశువులు మేపుతూ చిన్నారులు దర్శనమిస్తారు. అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాం, అమెరికాను భవిష్యత్‌లో వెనక్కు నెడతాం అని మాట్లాడేవాళ్ళకు సజీవ ప్రశ్నలుగా ఎదురొస్తుంటారు. రేపటి పౌరులు కదా వీళ్ళ గురించి రేపు ఆలోచించు కొందాం అని అనుకొంటుందో ఏమోగాని మన భారతీయ సమాజం, నేడు బాలల్ని పట్టించుకోవడం లేదు. మన దేశంలో అన్ని వ్యవస్థలు – కుటుంబ వ్యవస్థ, న్యాయ, వైద్య విద్య, హక్కుల పరిరక్షణ వ్యవస్థలు చిన్నారుల్ని నిర్లక్ష్యం చేస్తున్నాయి.



సిహెచ్.శ్రీహరి

మన దేశంలో 6–18 వయస్సు పిల్లలు 30కోట్ల వరకూ ఉన్నారు. దేశవ్యాప్తంగా ఈ మధ్య జరిగిన ఎన్నికల సమయంలో అనేక సమస్యలు మేనిఫెస్టోలలోను, బహిరంగంగాను చర్చకు వచ్చాయి. కానీ పిల్లల గురించి ఏమీలేదు. రేపటి పౌరులు కదా రేపు మాట్లాడుకొందాం అనే ధోరణిలో వున్నారా? ఓటర్ల గురించి మాట్లాడే రాజకీయ పార్టీలు రేపటి ఓట్ల గురించి సహజంగానే మౌనం వహించాయి.

### బాలల కనీస హక్కులు – వాటి అమలు తీరు

**విద్యాహక్కు :** 18 సం॥ల వయస్సు వరకూ ఉన్న వారు బాలలు. వారికి చదువుకొనే హక్కు వుండాలి. వారికి నాణ్యమైన విద్య అందించే ఏర్పాటు చేయాలి. కానీ మన ప్రభుత్వం ఈ పరిమితిని 14 సం॥కు కుదించి విద్యాహక్కు చట్టం తెచ్చింది. అదీ వందేళ్ళ పోరాటాల తర్వాత భగత్‌సింగ్ ప్రేరేపించిన ప్రజా డిమాండ్ నేపథ్యంలో 1910లో గోఖలే బ్రిటీష్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో చర్చకు పెడితే స్వాతంత్ర్యం వచ్చిన 62 సం॥లకుగానీ (2009లో) విద్యాహక్కు చట్టాన్ని



పొందలేకపోయాం. దీని ప్రకారం బాలుడు / బాలిక బడిబయట ఉండరాదు. కానీ ప్రస్తుతం 6–18 వయస్సు వారు 50% బడిబయటే ఉన్నారు.

పిల్లల చదువుల పట్ల మనకు ఏమంత ఘనమైన చరిత్రేమీ లేదు. 1524లోనే జర్మన్ మున్సిపాలిటీలు నిర్బంధ ఉచిత విద్యను ప్రవేశ పెట్టాయి. 1647లో అమెరికాలోని మసాచుసెట్స్‌లో, 1800 ప్రాంతంలో స్కాట్‌లాండ్, ఆస్ట్రియా, స్వీడన్, 1872 జపాన్ నిర్బంధ ఉచిత విద్యను అమలు చేశాయి. ఈ దేశాలు ఇప్పుడు అభివృద్ధిలో ఎక్కడ వున్నాయో చూస్తున్నాం. మన ప్రభుత్వాలకు ఈ దృక్పథం లేకపోవడమే మన బాలల దైన్యస్థితికి కారణం. అభివృద్ధిలో మన వెనుకబాటు తనానికి మూలం. 2009 తరువాత ఇప్పటికైనా సమర్థ వంతంగా అమలు చేస్తున్నారా? లేదు! చట్టం చేసి చేతులు దులుపు కొన్నారు పాలకులు. బలమైన ప్రజా డిమాండ్‌తో గాని వీరి వైఖరిలో మార్పురాదు.

**పౌష్టికాహారం పొందే హక్కు :** దేశంలో సగంమంది బాలలు పౌష్టికా హార లోపంతో వున్నారు. అంటే ప్రతి ఇద్దరిలో ఒకరన్నమాట. దళిత గిరిజనులు ఈ లెక్కకు నిలువెత్తు సాక్షులుగా మనముందు తిరుగా డుతున్నారు.

గతంలో కోర్టు సీరియస్ అయితేగాని మన రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం మొదలు పెట్టలేదు. ఏదో కొనసాగిస్తున్నారు గానీ, ఈ భోజనాన్ని పౌష్టికాహారం అనలేం. నిధులు పెంచి మరింతగా పోషక విలువలు పెంచే ఆలోచన మన ప్రభుత్వాలకు అస్సలు లేదు. బడిలో వున్న వారి సంగతే ఇలావుంటే బడిబయట రైల్వే స్టేషన్లలో, బస్టాండుల్లో యాచకులు గా వున్న పిల్లల పౌష్టికాహారం గురించి ఏం మాట్లాడుకోగలం? ఈ రాజ్యం చేస్తున్న దుర్మార్గాల్లోకెల్లా అత్యంత దుర్మార్గ మైనది బిడ్డలకు మంచి తిండి పెట్టలేకపోవడం!!

**ఆరోగ్యం మరియు సంరక్షణ హక్కు :** 2 సం॥లలోపు పిల్లల్లో మన దేశంలో 58% మంది పూర్తిగా వ్యాక్సినేషన్ పొందని వారు. 60%మంది రక్తహీనతతో వున్నారు. దీన్నిబట్టి శిశు మరణాల తీవ్రత ఎంతుందో అర్థం చేసుకోవచ్చు. అభివృద్ధికి నమూనాగా ప్రచారంలో వున్న గుజరాత్ లో ప్రతి నలుగురులో ఒకరు రక్తహీనతతో వున్నారు. రోజు రోజుకీ వైద్యం ప్రైవేటీకరణతో, ప్రభుత్వ ఆసుపత్రుల

# ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం

ముఖ్యమంత్రి : **నారా చంద్రబాబు నాయుడు**

సాధారణ పరిపాలన, న్యాయం, విద్యుత్, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, పరిశ్రమలు, వాణిజ్యం, ప్రభుత్వరంగ సంస్థలు, సినిమాటోగ్రఫీ, పర్యాటకం, మంత్రులకు కేటాయించని ఇతర శాఖలు.

| | | |
|---|---|---|
| 1. | ఉపముఖ్యమంత్రి | : **కేఈ కృష్ణమూర్తి**<br>రెవెన్యూ, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు |
| 2. | ఉపముఖ్యమంత్రి | : **నిమ్మకాయల చినరాజప్ప**<br>హోం, విపత్తుల నిర్వహణ |
| 3. | **యనమల రామకృష్ణుడు** | : ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు శాసనసభా వ్యవహారాలు |
| 4. | **సిహెచ్ అయన్నపాత్రుడు** | : పంచాయితీరాజ్, గ్రామీణ, నీటి సరఫరా, ఎన్ఆర్ఈజీఎస్ (ఉపాధి హామీ) |
| 5. | **బొజ్జల గోపాలకృష్ణారెడ్డి** | : సహకారం, అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతికం |
| 6. | **డి.ఉమామహేశ్వర రావు** | : నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి, జలవనరుల నిర్వహణ |
| 7. | **పి.నారాయణ** | : పురపాలక, పట్టణాభివృద్ధి, పట్టణ నీటి సరఫరా, పట్టణ ప్రణాళిక |
| 8. | **పరిటాల సునీత** | : ఆహారం, పౌరసరఫరాలు, ధరల సమీక్ష, వినియోగదారుల వ్యవహారాలు |
| 9. | **ప్రత్తిపాటి పుల్లారావు** | : వ్యవసాయం, మార్కెటింగ్ గిడ్డంగులు, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి,మత్స్యశాఖ,అగ్రి ప్రాసెసింగ్ |
| 10. | **కామినేని శ్రీనివాస్** | : వైద్య, ఆరోగ్య, వైద్య విద్య |
| 11. | **గంటా శ్రీనివాసరావు** | : మానవ వనరుల అభివృద్ధి (ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత సాంకేతిక విద్య) |
| 12. | **పల్లె రఘునాథరెడ్డి** | : పౌర సంబంధాలు - సమాచార శాఖ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎన్ఆర్ఐ సంబంధాలు, తెలుగు భాష, సంస్కృతి మైనార్టీ సంక్షేమం అభివృద్ధి |
| 13. | **పీతల సుజాత** | : గనులు-భూగర్భం, మహిళా సాధికారత, శిశు సంక్షేమం, వయో వృద్ధుల సంక్షేమం |
| 14. | **అచ్చెన్నాయుడు** | : కార్మిక, ఉపాధి కల్పన కర్మాగారాలు<br>యువజన వ్యవహారాలు, క్రీడలు నైపుణ్యం అభివృద్ధి |
| 15. | **శిద్దా రాఘవరావు** | : రవాణా, రహదారులు-భవనాలు |
| 16. | **కిమిడి మృణాళిని** | : గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణం పారిశుద్ధ్యం |
| 17. | **కొల్లు రవీంద్ర** | : ఆబ్కారీ, బీసీ సంక్షేమం-సాధికారత, చేనేత |
| 18. | **రావెల కిషోర్‌బాబు** | : సాంఘిక సంక్షేమం - సాధికారత గిరిజన సంక్షేమం-సాధికారత |
| 19. | **పి.మాణిక్యాలరావు** | : దేవాదాయం |

వ్యవస్థీకృత వైఫల్యాలతో పిల్లల ఆరోగ్యం మరింత ప్రమాదంలో పడుతోంది. స్పూనుతో కాకుండా గోరుముద్దలు పెడితే బిడ్డల్ని సంరక్షించడం మీకు రాదు అని ప్రభుత్వం తల్లిదండ్రుల్ని శిక్షించే యూరప్ దేశాలతో పోల్చితే దిక్కుమొక్కు లేని మన భారతీయ బాలలు ఎక్కడున్నట్లు? ఏం తింటున్నట్లు? ఏం పొందుతున్నట్లు?

**భావవ్యక్తీరణ హక్కు :** బుడిబుడి నడకలప్పుడు, వచ్చీరాని మాటలప్పుడు పిల్లల్ని ఆసక్తిగా గమనిస్తారు, మురిసిపోతారు. ఏంతెలివి ఈ తరానికి? అని గొప్పలకుపోతారు. నడవడం, మాట్లాడ్డం, ఆలోచించడం మొదలైన తరువాత వాళ్ళ మాటలకు విలువనివ్వరు. "నీకు తెలియదు ఊరుకో" అని విసుక్కొంటారు. "మా మాటల మధ్య నీ న్యూసెన్స్ ఏమిటి" అని కసురుకొంటారు. మన భారతీయ సామాజిక వ్యవస్థ నేటికీ ఫ్యూడల్ అహంకార పూరిత పెద్దరికాన్ని ప్రదర్శిస్తోంది. ఇది పిల్లల వ్యక్తీకరణ హక్కును కాలరాస్తోంది. అనేక సందర్భాలలో అణచివేతకు గురిచేస్తోంది. తమ పిల్లల కోసం ఎంతో కష్టపడుతున్న తల్లిదండ్రులు కూడా తమ వైఖరి పిల్లల్ని ఎంతగా అణచివేస్తోందో గమనించరు. తరాలు మారినా అనుశ్రుతంగా, అవిచ్ఛిన్నంగా ఈ ధోరణి కొనసాగుతోంది.

**దోపిడి నుండి రక్షణ హక్కు :** మన దేశంలో భవన నిర్మాణం, హోటళ్ళు, మెకానిక్ షెడ్‌లు, చిన్న పరిశ్రమలు లాంటి అనేక పని పరిస్థితుల్లో పిల్లలు గొడ్డుచాకిరీ చేస్తుంటారు. అభివృద్ధి చెందిన దేశాల్లో పిల్లల్ని అగౌరవపర్చడమే పెద్ద నేరం. ఇక్కడ గొడ్డుచాకిరీని సాధారణ విషయంగా చూస్తారు. చాలీచాలని నిద్ర, సుదీర్ఘ పనిగంటలు, దుర్భర పని పరిస్థితులు తిట్లు, దండనలు పసి శరీరాల్ని, హృదయాల్ని గాయపరస్తూ వుంటాయి. చెప్పుకొనే అవకాశం వుండదు. వినేనాథుడూ వుండడు, భరించడమో, పారిపోవడమా ఇవే ప్రత్యామ్నాయాలుగా వుంటాయి. కలలు కనే వ్యవధి కూడా లేని స్థితి. మైరన్‌వైనర్ చెప్పినట్లు పెద్దల ఉపాధి, ఆదాయం పెరగాలంటే ఇది పరిష్కారం కాదు.

**జీవించే హక్కు :** నెల్లూరు జిల్లాలో కృష్ణపట్నం పోర్టు చుట్టు ప్రక్కల గ్రామాల్ని కమ్ముకొని వున్న ధర్మల్ పవర్‌ప్లాంట్ల మధ్య బొగ్గు, మసి, ప్రమాదకర ఉద్గారాలమధ్య చిన్నారుల్ని చూస్తే, వాళ్ళ కాళ్ళు, మెడల మీద ప్రమాదకర మచ్చల్ని చూస్తే, పట్టణాల శివారు ప్రాంతాల్లో మురికి కూపాల్లో పిల్లల్ని చూస్తే వీళ్ళకు కనీసం బ్రతికే అవకాశాన్ని అయినా మన దేశం ఇస్తోందా అన్పిస్తుంది.

ఆడ పిల్లల్లో ప్రతి ఆరుమందిలో ఒకరు వివక్షకారణంగా, భ్రూణ హత్యల కారణంగా, రేప్‌చేసి హత్య చేయబడిన కారణంగా చనిపోతున్నారు. క్రూరమృగాల మధ్య అరణ్యంలో బ్రతుకుతున్నట్లు వుంది ఆడ పిల్లల పరిస్థితి. ఆరు దశాబ్దాల స్వాతంత్ర్యం కనీసం బ్రతికే హక్కుని పిల్లలకు ఇవ్వలేదు. ఇది అభివృద్ధి నిషాల మధ్య విషాదం!!

**తల్లిదండ్రుల సాంప్రదాయక ఆధిపత్య ధోరణి, స్వేచ్ఛా మార్కెట్ శక్తుల దురాశల మధ్య పిల్లలు నలిగిపోతున్నారు. పిల్లల దైన్యస్థితి పట్ల కనీసం సార్వత్రిక వ్యాకులతకూడా లేదు.... ఎవరి వస్తు వ్యామోహంలో వాళ్ళు!! అరకొర జోక్యం చేసుకుంటే నీతిని బోధించడం, వాళ్ళను సరైన మార్గంలో పెట్టడమనేది పవిత్ర ధర్మంగా భావిస్తారే తప్ప పిల్లలు అనుభవిస్తున్న శారీరక, మానసిక అణిచివేతను గుర్తించరు. రాజ్యం కూడా చట్టాలు చేసి ఊరుకొంటుందే తప్ప బాధ్యతగా తీసుకోవడం లేదు. తల్లిదండ్రుల నుండి, యాజమానుల నుండి రక్షించే అత్యున్నత సంరక్షక పాత్రను రాజ్యం తీసుకోవాలి. పిల్లలకు స్వేచ్ఛను ప్రసాదించాలి. స్వేచ్ఛనివ్వడం అంటే విముక్తి చేయడమే!! దండనల నుండి, దూషణల నుండి, అనారోగ్యం నుండి, నిరక్షరాస్యత నుండి, మురికి నుండి, చాకిరి నుండి, ఆధిపత్యం నుండి, పెద్దల సంకుచితత్వం నుండి, పెట్టుబడిదారుల ధనదాహం నుండి సంక్షోభాల నుండి, యుద్ధాల నుండి........**



# నూతన పాఠ్యపుస్తకాలు-తీరుతెన్నులు
## 10వ తరగతి గణితం-ఒక పరిశీలన

రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ (SCERT) రూపొందించిన రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం - 2011 ప్రకారం మన రాష్ట్రంలో 2011 నుండి పాఠ్య పుస్తకాలు దశలవారీగా మారాయి. 2011-12 విద్యా సంవత్సరంలో 1,2 తరగతులకు, 2012-13లో 3,6,7 తరగతులకు, 2013-14లో 4,5,8,9 తరగతులకు నూతన పాఠ్య పుస్తకాలు ప్రవేశ పెట్టడం జరిగింది. ప్రత్యేకించి ఈ విద్యా సంవత్సరం 2014-15లో 10వ తరగతికి నూతన పాఠ్య పుస్తకాలు రూపొందించబడ్డాయి.



ఎన్.కుమార్ రాజా

జాతీయ విద్యా ప్రణాళిక పరిధి చట్రం (NCF)-2005, విద్యాహక్కు చట్టం(RTE)-2009లకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం-2011 మేరకు పిల్లలు తమకున్న సహజ శక్తి సామర్థ్యాల ద్వారా బడిబయటి జీవితం అనుసంధానం చేసుకుంటూ పరస్పర ప్రతిచర్యలు, ప్రాజెక్టు పనులు, అన్వేషణలు, ప్రయోగాలు, విశ్లేషణలు చేయగలుగుతూ పాఠ్యాంశాలను అవగాహన చేసుకునే విధంగా పాఠ్య పుస్తకాలు ఉండాలి. ఈ అంశాలన్నింటిని క్రోడీకరిస్తూ విద్యార్థుల మానసిక స్థాయిలకు, సామాజిక అవసరాలకు, ఉన్నత విద్యావకాశాలకనుగుణంగా ఒకటి నుండి పదవ తరగతి వరకు పాఠ్య ప్రణాళిక కూర్చుకొని ప్రస్తుత పాఠ్య పుస్తకాలు రాయబడ్డాయని రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ తెలియజేసింది.

అయితే నూతన పాఠ్య పుస్తకాలపై ఉపాధ్యాయుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పాఠ్య పుస్తకాలు ఏయే కీలక సూత్రాల ఆధారంగా తయారు అయ్యాయి, వివిధ సబ్జెక్టుల లో పాఠ్యాంశాల ఎంపిక ఎలా జరిగింది, అధ్యాయాల అమరిక ఎలా ఉంది, నూతన పాఠ్య పుస్తకాలలోని ప్రత్యేకతలు ఏమిటి, నూతన పాఠ్యాంశాల వలన వివిధ సబ్జెక్టులలో విద్యార్థుల స్థాయి ప్రస్తుత పాఠ్య పుస్తకాలతో పోలిస్తే పెంచబడిందా లేదా తగ్గించబడిందా అనే అంశాలపై ఉపాధ్యాయుల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుచున్నది. దీనిపై పాఠ్యపుస్తక అభివృద్ధి కమిటీ సభ్యులు, పాఠ్య పుస్తక రచయితలచే రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థవారు వివరణ యిప్పించవలసి వుంది.



నూతన పాఠ్య పుస్తకాలలోని నూతన పాఠ్యాంశాలపైన, వాటి బోధనాభ్యసన పద్ధతులపై జిల్లా, డివిజన్ స్థాయిలలో పాఠ్యపుస్తక అభివృద్ధి కమిటీ సభ్యులు, పాఠ్యపుస్తక రచయితలచే నేరుగా ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఏర్పాటు చేయవలసి వుంది. అన్ని తరగతులకు, అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయ కరదీపికలు ముద్రించి పాఠశాలలకు పంపి, ఉపాధ్యాయులకు విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందించాల్సి ఉన్నది.

**పదవ తరగతి గణితం - ఒక పరిశీలన :** పదవ తరగతి నూతన గణిత పాఠ్య పుస్తకంలో పాత పాఠ్యపుస్తకంతో పోలిస్తే సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. పాఠ్యపుస్తకం పరిమాణంలోను, రంగులలోను, అధ్యాయాల అమరికలోనూ, వర్ణ చిత్రాలు, విశ్లేషణాత్మక పట్టికలు, నిత్య జీవిత సంఘటనల ఉదాహరణలతోను ఆకర్షణీయంగా రూపొందించబడింది. అయితే సిలబస్ ప్రధానంగా 'సంఖ్య వ్యవస్థ, బీజ గణితం, రేఖా గణితం, క్షేత్రమితి, సాంఖ్యక శాస్త్రం, నిరూపక రేఖా గణితం, త్రికోణమితి' వంటి ఏడు రంగాలకే పరిమితం చేయడం జరిగింది. పదవ తరగతి గణితం మొత్తం సిలబస్‌ను 14 అధ్యాయాలుగా విభజించారు. అదనంగా 'గణిత నమూనా విధానాలను' అనుబంధంగా ప్రవేశ పెట్టారు.

నూతన విద్యా విధానంలో భాగంగా 8 మరియు 9 తరగతులలోని గణిత పాఠ్యాంశాలలో పదవ తరగతిలోని పలు గణిత పాఠ్యాంశాలు సంబంధం కలిగివున్నాయి. అయినప్పటికి పాత గణిత పాఠ్య పుస్తకాలతో పోలిస్తే కొన్ని గణిత రంగాలను విస్మరించినట్లు కన్పిస్తుంది. మరికొన్ని గణిత పాఠ్యాంశాల స్థాయి తగ్గించడం జరిగింది. ఉదాహరణకు పాత గణిత పాఠ్యపుస్తకంలో వున్న ప్రవచనాలు, ప్రమేయాలు, ఏకఘాత ప్రణాళిక, గణన, శ్రేణులు, సాంఖ్యక శాస్త్రం వంటి అధ్యాయాలను నూతన పాఠ్య పుస్తకంలో కొనసాగించినా, వాటిలో గతంలో వున్న కొన్ని ఉప అంశాలు తొలగించారు. దీనితో పాఠ్యపుస్తకంలో స్థాయి తగ్గిన అభిప్రాయం గణిత ఉపాధ్యాయుల్లో కలుగుచున్నది. పూర్వ సిలబస్‌లో 8వ తరగతిలోనే సమితులు అధ్యాయం పరిచయం చేసి, 9 మరియు 10 తరగతులలో స్థాయి పెంచుతూ కొనసాగించారు. ప్రస్తుత నూతన పాఠ్య ప్రణాళికలో భాగంగా 'సమితులు' అధ్యాయాన్ని 10వ తరగతిలో పరిచయం చేయడం జరిగింది. అందులో కేవలం నిర్వచనం, సమితుల రకాలు, వెన్ చిత్రాలు, సమితి పరిక్రియలు వంటి ప్రాథమిక భావనలకే పరిమితం చేయడం జరిగింది. 9వ తరగతిలో ప్రవేశపెట్టిన 'సంభావ్యత' అధ్యాయాన్ని 10వ తరగతిలో కొనసాగిస్తూ మరికొన్ని నూతన పదములు వివరణ, వాటి భావనలు చేర్చడం జరిగింది.

ఈ సిలబస్‌నందు పాఠ్య విషయాలు అన్ని ప్రాథమిక గణిత భావనలు, సాధారణీకరణాల

# ప్రపంచ జనాభా దినోత్సవం

జనాభా పెరుగుదలకు సంబంధించిన అంశాలపట్ల ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కల్పించడం కొరకు, ప్రతి సంవత్సరము జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవం పాటిస్తున్నారు. 1804 సంవత్సరంలో 1 బిలియన్‌కు చేరిన ప్రపంచ జనాభా, 1927 సం॥ 2 బిలియన్లకు, 1959 సం॥ 3 బిలియన్లకు, 1974లో 4 బిలియన్లకు మరియు 1987 జులై 11న ప్రపంచ జనాభా 5 బిలియన్లకు చేరింది. ప్రపంచ జనాభా గవర్నింగ్ కౌన్సిల్ ఆఫ్ ద యునైటెడ్ నేషన్స్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం (యుఎన్‌డిపి) మొదటగా 1989లో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ప్రారంభించింది. ప్రపంచ జనాభా 1987 జులై 11న 5 బిలియన్లకు చేరిన సందర్భంలో ప్రజాప్రయోజనం మేరకు ప్రపంచ జనాభా దినోత్సవం జరపాలనే అంశం ముందుకొచ్చింది.

ప్రపంచ జనాభా విస్ఫోటనం అనేది ఒక పెద్ద సమస్య. అదుపులేని జనాభా పెరుగుదల కారణంగా ప్రపంచంలో పేదరికము, నిరుద్యోగం, కాలుష్యం, అడవుల తరుగుదల వంటి అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఈ విస్ఫోటనాన్ని నిలువరించటానికి చేసే తీవ్రమైన కృషిలో భాగంగా ప్రపంచ జనాభా దినోత్సవం జరపడం అనేది ఒక అడుగువేయడం మాత్రమే...

కుటుంబ నియంత్రణ ప్రాముఖ్యత, స్త్రీ పురుష సమానత్వం, పేదరికము, మాతాశిశు ఆరోగ్యం, బాలికల హక్కుల రక్షణ మానవ హక్కులు వంటి అతి ముఖ్యమైన సమస్యల సాధన లక్ష్యంగా ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుతున్నారు. 1987లో 5 బిలియన్లు ఉన్న ప్రపంచ జనాభా 1998లో 6 బిలియన్లకు, 2011లో 7 బిలియన్లకు, 2014 జనవరి 1నాటికి 7,137,661,030 చేరిన ఈ పరిస్థితుల్లో చిన్న కుటుంబాల ప్రాముఖ్యతను, ఆరోగ్యకరమైన జీవన ప్రాముఖ్యతను ప్రజలు గుర్తించి చర్యలు చేపట్టవలసిన అవసరం ఉంది.

ప్రపంచ జనాభా గత 200 సంవత్సరాలుగా చాలా వేగంగా పెరుగుతుంది. చైనా, ఇండియాల మొత్తం జనాభా, ప్రపంచ జనాభాలో 37%గా ఉన్నది. ఆసియా ఖండము 4.2 బిలియన్ల జనాభాతో అత్యధిక జనాభా ఉన్న ఖండముగా ఇది ప్రపంచ జనాభాలో 60%నికి సమానము.

అంతర్జాతీయ స్థాయిలో 200 దేశాలకు పైగా ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకుంటూ, ఈ సందర్భంగా, సెమినార్స్, చర్చలు, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు, స్లోగన్స్, వర్క్‌షాపుల నిర్వహణ, రౌండ్ టేబుల్ చర్చలు, ప్రెస్ కాన్ఫరెన్స్ ద్వారా, వార్తల పంపిణీ చేయడం ద్వారా ప్రజలను చైతన్యపరచడానికి ప్రపంచ జనాభా దినోత్సవం తోడ్పడుతుంది. 2014 జులై 11న జరుపుకుంటున్న 25వ ప్రపంచ జనాభా దినోత్సవ సందర్భంలో జనాభా పెరుగుదల సమస్య తీవ్రతను ప్రతి వ్యక్తి గుర్తించి, సమస్య సాధన దిశగా ముందుకు సాగుతారని ఆశిద్ధాము.

## నూతన పాఠ్యపుస్తకాలు - తీరుతెన్నులు

ద్వారా అన్వేషణ, అవగాహనపై మౌలిక నిర్మాణ విధాన రూపంలో ఉన్నాయి. ఈ విధానం వలన ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను జట్టు పనులు, కృత్యాల ద్వారా బోధనాభ్యసన కావించవలసి వుంటుంది. ఇక ప్రతి అధ్యాయాన్ని నిత్యజీవిత సంఘటనలు, ఉదాహరణలతోను ప్రారంభించి భావనలు వివరించడానికి ప్రయత్నించారు. ప్రతి అధ్యాయంలో 'ఇవి చేయండి', 'ప్రయత్నించండి', 'ఆలోచించి, చర్చించి, రాయండి' వంటి శీర్షికలతో యిచ్చిన అభ్యాసాలు విద్యార్థులు ఆ పాఠ్యాంశాలను ఎంత మేరకు అవగాహన చేసుకున్నారో తెలుసుకునేందుకు ఉపయోగపడుతాయి. ప్రతి అధ్యాయంలోను అభ్యాసాల సంఖ్యను తగ్గించారు. అలాగే అభ్యాసంలోని లెక్కల సంఖ్యనూ తగ్గించారు. అభ్యాసాలకు ముందు ఎక్కువ సంఖ్యలో ఉదాహరణ లెక్కలు ఇవ్వడం విద్యార్థులకు గణిత భావనల అవగాహనకు ఉపయోగపడుతుంది.

ఇక బోధనాభ్యసన విధానానికి వస్తే పాత పాఠ్యపుస్తక బోధనా విధానానికీ, నూతన పాఠ్యపుస్తకం ఆధారంగా చేపట్టబోయే బోధనా విధానానికి స్పష్టమైన తేడా గణిత ఉపాధ్యాయులందరూ గమనించవలసిన అంశము. నూతన సిలబస్‌కనుగుణంగా రూపొందించిన గణిత పాఠ్యపుస్తకంలో నిర్దేశించిన విద్యా ప్రమాణాలు సాధించేందుకు బోధనాభ్యసన, మూల్యాంకనా విధానంలో మార్పులు చేసుకోవలసిన అవసరం వున్నది. ప్రతి గణిత ఉపాధ్యాయుడు పదవ తరగతి నూతన సిలబస్, విద్యా ప్రమాణాలకనుగుణంగా అధ్యాయాలను నిశితంగా అభ్యసనం చేసుకొని, తరగతి గదిలో బోధనాభ్యసన వ్యూహాలు ఏర్పాటు చేసుకున్నప్పుడే ప్రస్తుత పాఠ్య పుస్తక బోధనాభ్యసన పుస్తకంలో విజయవంతం కాగలరు.

ప్రస్తుత నూతన పాఠ్య పుస్తకంలో నిర్దేశించిన గణిత లక్ష్యాలను సాధించడానికి ఉపాధ్యాయుడు విద్యార్థులచే జట్టుకృత్యములు, ప్రాజెక్టు పనులు, పిల్లల ప్రతిస్పందనలు గమనించడం, నిరంతర సమగ్ర మూల్యాంకనము నిర్వహించవలసి వుంటుంది. ఇందుకై విద్యాహక్కు చట్టంలో పేర్కొన్న విధంగా తరగతి గదిలోని ఉపాధ్యాయ విద్యార్థుల నిష్పత్తి 1:30గా ఉండాలి. అప్పుడే నూతన పాఠ్య ప్రణాళిక మేరకు నూతన పాఠ్యపుస్తకాలలో పేర్కొన్న బోధనాభ్యసన ప్రక్రియలు, లక్ష్యాలు సాధించడానికి ఉపాధ్యాయులకు సులభంగాను, విద్యార్థులకు ప్రయోజనకరంగాను వుంటుంది.

### ఉపాధ్యాయులకు ఆహ్వానం

రాష్ట్ర విద్యా ప్రణాళికా పరిధి పత్రం-2011 ప్రకారం రాష్ట్రంలోని అన్ని తరగతులకు పాఠ్యపుస్తకాలు 2011 నుండి మారాయి. ప్రత్యేకించి ఈ విద్యా సంవత్సరం 2014-15లో 10వ తరగతి పాఠ్యపుస్తకాలు మారాయి. ఉపాధ్యాయులు నూతన సిలబస్, నూతన పాఠ్య పుస్తకాలలో చోటు చేసుకున్న మార్పులు అధ్యయనం చేసి, వాటి తీరుతెన్నులు, అభివృద్ధికి సూచనలు వ్యాసరూపంలో తెలియపరిస్తే ఐక్యఉపాధ్యాయలో ప్రచురించగలము. పాఠ్యపుస్తకాల సమీక్షపై చర్చలో పాల్గొనవలసిందిగా ఉపాధ్యాయులను ఆహ్వానిస్తున్నాము.

ఇట్లు

**ప్రధానసంపాదకులు, ఐక్యఉపాధ్యాయ**

# నవ్యకావ్య మహారథి దాశరథి




"ఓ నిజాము పిశాచామా! కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని తీగెలను తెంపి అగ్నిలో దింపినావు, నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని తెలంగాణ తేజాన్ని తెలుగు సాహిత్యంలోకి రంగరించిన మహా స్వాప్నికుడు దాశరథి. ఆయన పుట్టింది వరంగల్ జిల్లాలోని చిన్నగూడూరు గ్రామం అయినా విద్యాభ్యాసమంతా ఖమ్మం జిల్లాలోని 'గార్లలో' జరగడం వలన ఉర్దూ, పారశీక సాహితీ సౌరభాలు ఆఘ్రాణించాడు. పండిత వంశంలో 1925 జులై 22న జన్మించిన దాశరథి తండ్రి వెంకటాచార్యుడు సంస్కృత పండితుడు కాగా, తల్లి వెంకటమ్మకు ఆంధ్ర కావ్యాలతో పరిచయం వుండడం; భారత, భాగవతాలను తెలుగు చేసిన వెంకటాచార్యులు తాతగారు కావడంతోను మరియు కేశవార్యశాస్త్రి గారు గురువుగా లభించడం వలన సంస్కృత వ్యాకరణం, కౌముది, వేదాలకు–ఉపనిషత్తులకు సంబంధించిన ఎన్నో విషయాలను విద్యార్థి దశలోనే ఔపోసన పట్టిన ఈయన కవితారంగంలో అజానుబాహుడుగా శిఖర సమానుడైన దాశరథిపై మార్క్సిజం ప్రభావం గాఢంగా ఉంది. అందుకే ....."మరల రావణుడుదయించె ధరణి మీద" అంటూ హుంకరిస్తూ నియంతల్ని ఎదిరించేందుకు కలాన్ని కత్తిగా వాడిన కవి దాశరథి కృష్ణమాచార్య. నాటి నైజాం నవాబు నిరంకుశత్వాన్ని జైలుగోడల మధ్యే గర్జించి సవాలు చేసిన కలంయోధుడాయన. ఖమ్మం జిల్లాలోని గిరిజనం మధ్య ప్రజల మనిషిగా వాగులు–వంకలు, కొండ – కోనలు తిరుగుతూ ఆంధ్ర మహాసభ కార్యకర్తగా ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొని జైలుకు వెళ్ళడమేగాక అతిరథమహారథులెందరో ఆయనకు సహచరులు కావడంతో ఆయన కలం నుండి కవితాజ్వాలలు ఎగసి పడ్డాయి. నైజాం అయినా, హిట్లర్ అయినా, చైనా ప్రభువైనా, పాకిస్తాన్ నియంతైనా గుండెలదరిపడ్డాయి. స్వేచ్ఛ కోరే జనానికి అభ్యుదయ గీతాలందించబడ్డాయి.



సంపటం దుర్గాప్రసాద్

ఆయన కవితాస్త్రాలన్నీ మదోన్మాదుల ఉన్మత్త చేష్టలపై సంధించినవే. ఆకలి – దప్పుల అన్యాయాలపై, పెత్తందారీ వ్యవస్థలపై, యుద్ధం అంటూ బుద్ధిలేక పలవరించే సామ్రాజ్యవాదులపై గురిపెట్టిన మర ఫిరంగులే. అసమానతలను, దారిద్ర్యాన్ని దునుమాడడానికి తన కలానికి పదును పెట్టాడు. తెలంగాణను మేల్కొల్పిన వైతాళికునిగా చైతన్య కవితా ప్రవంతికి లంగరు ఎత్తాడు. తన 'రుద్రవీణ'ను తెలంగాణకు అంకితం చేసి తెలంగాణ ఆత్మగీతంగా వాసికెక్కాడు. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ఆరంభించిన ఆయన కవితా ప్రస్థానం అనేక కొత్తపుంతలు తొక్కుతూ నవ్యకావ్యమహారథిగా సాహితీ వినీలా కాశంలో సుస్థిర స్థానాన్ని పొందాడు. 1949లో అచ్చులోకి తెచ్చిన 'అగ్నిధార' లగాయతూ 'మహేంద్రోదయం; పునర్నవం; మహాబోధి లాంటి కవితా ఖండికలు, కావ్యాలు 'కవిబెబ్బులి'గా ఆయన వెలయించిన మహత్తర సాహితీ సంపదలు.

"నా తెలంగాణ తల్లి కంజాతవల్లి
నా తెలంగాణ కోటి అందాల జాణ
నా తెలంగాణ లేమ సౌందర్యసీమ
నా తెలంగాణ కోటి రతనాల వీణ"

అంటూ ప్రతి మదినీ పరవశింపజేసిన ఆయన తెలంగాణకు ప్రతి రూపమై ప్రతి మదిలో నిలిచి పోయాడు. ఆయా పత్రికలలో వచ్చిన ఆయన 48 కవితల సంపుటి 'ఆలోచనాలోచనాలు'. దాశరథిని అసలు సిసలైన ప్రజాకవి అనడానికి ఓ సందర్భంలో పలికిన ఈ పలుకులే నిదర్శనం. 'జనం–మనం, మనం–జనం, జనంలేంది మనం లేం' అంటాడు. ఆయన కవితలన్నీ శాంతికాముకతను ప్రబోధిస్తాయి. ఆయన కవితల లక్ష్యం ఒక్కటే మానవత–ఐకమత్యం'. 'నేనంటాను' అనే కవితలో 'బందను కోయాలి సుమదళం, గుండెను కోయాలి నయన జలం, కదనరంగమున నేనుంటాను, కత్తిని మించాలి కవులకలం అంటూ కవుల కర్తవ్యాన్ని గుర్తెరగ జేశాడు.

కాలానికనుగుణంగా నవ్యకావ్య కన్యసిగలో ఎన్నో పారిజాతాలను పూయించిన దాశరథి తెలుగు–ఉర్దూలను రెండు కళ్ళుగా భావించి అనువాదాలు గావించిన రుబాయీలు, గజల్స్, ఖవ్వాలీలు సాహిత్య లోకంలో శాశ్వత స్థానాన్ని సంపాదించుకొన్నాయి. వ్యాసాలు, నాటికలు, గేయ కవిత్వం, వచన కవిత్వం ఇలా విభిన్న సాహిత్య ప్రక్రియలను వైవిధ్యభరితంగా కొనసాగించాడు. అమృతాభిషేకం, కవితా పుష్పకం, ఇత్యాది గ్రంథాలకు ఎన్నో అవార్డులు వరించి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమీ, ఆయా విశ్వ విద్యాలయాల గౌరవ డాక్టరేట్లు అనేకం అందుకున్న ఆయన జలగం వెంగళరావు ముఖ్య మంత్రిగా పనిచేసిన కాలంలో రాష్ట్ర ప్రభుత్వ 'ఆస్థాన కవి'గానూ పని చేసిన వీరు 1961లో 'వాగ్దానం' చిత్రం ద్వారా సినీ గేయరచయితగా ప్రవేశించి చిరస్థాయిగా నిలిచిపోయే 500లకుపైగా గీతాలను అందించారు. ఉర్దూతో కలగలసిన పదాలు వచ్చాయంటే అది దాశరథిదే అన్నంతగా ప్రసిద్ధుడై 'ఖవ్వాలీ' పాటలకు అసలు–సిసలు చిరునామాగా మారిన దాశరథి వీణపాటకు పెట్టింది పేరు. అంతేకాదు ఆకాశవాణిలో కార్యక్రమాల నిర్వాహకుడిగా, ప్రయోక్తగా హైదరాబాద్‌లో చాలాకాలం పనిచేశారు.

తెలంగాణ వీణ మీటి ఎన్నో సరికొత్త రాగాలను పలికించి, వినూత్న మనోహర గీతికల్ని వెలయించాడు. తెలంగాణ విముక్తిని సాధించ దానికి కంకణబద్ధుడైన ఆయన కలం ఎప్పుడూ నిప్పులు విరజిమ్ముతూ భావావేశాన్ని కలిగించే కవితాకణికలను పుట్టించింది. రాక్షస రాజ్యాలను ఏలిన రాజుల పాలిట సింహ స్వప్నమై మెరిసింది.

"విషము గుప్పించినాడు నొప్పించినాడు
మా నిజాం రాజు జన్మజన్మాల బూజు"

అనడానికి ఎంతటి గుండె దిటవు కావాలి?

"ఆ చల్లని సముద్రగర్భం
దాచిన బడబానలమెంతో
ఆ నల్లని ఆకాశంలో
కనరాని భాస్కరులెందరో..."

ఈ ఒక్క పాట చాలు ఆయన కలం పీడిత ప్రజావాణికై కలవరించిందని; భూగోళం పుట్టుక, మానవ పరిణామక్రమం, ఆర్థిక వ్యత్యాసం, సమాజ నిర్మాణం తదితరాలన్నింటిని జొప్పించి అన్నార్తులు– అనాథలుండని ఆ నవయుగమదెంత దూరం??? అంటూ 'ప్రశ్న'వేసిన ఆయన కలం స్పృశించని ప్రక్రియలేదు. చేయని విన్యాసమూలేదు. అందుకే తన ప్రజ్ఞతో తనుతానే మలచుకొని తెలంగాణ కవులలో అగ్రగామిగా, ఆదర్శప్రాయుడిగా నిలిచిపోయాడు దాశరథి. పాటల తోటలో విరబూసిన ఎన్నో మధుర, భావ, భక్తి, వీణా నాదాల పరిమళాలను వెదజల్లిన కవితా తోటమాలి. మంచి వక్త, అనువాదకుడూ, బహుముఖ ప్రజ్ఞాశాలియైన దాశరథి 1987 నవంబర్ 5న కానరాని లోకాలకు వెళ్ళిపోయినా, ఆయన సేద్యం చేసి పండించిన కవితా పుష్పకాలు ఆ పాత మధురాల్లా మనందర్నీ ఆలోచనా తరంగాల్లో విహరింపజేస్తాయి. చైతన్య ప్రవంతిలా పీడిత జనావళిని అట్టిపెట్టుకునే వుంటాయి. ఆ మహాకవి జయంతి సందర్భంగా ఆయనకివే సాహిత్యాభివందనాలు. కవితాంజలులు......

ఐ.వెంకటేశ్వరరావు



# ఎయిడెడ్ (పాఠశాల, హాయ్యర్ ఎడ్యుకేషన్) గురుకుల, మోడల్ స్కూల్స్ సిబ్బందికి 60 యేండ్ల పెంపు వర్తింప చేయాలి

గతంలో 58యేండ్లు రిటైర్మెంట్ వయస్సు వర్తించేవారందరికీ యాక్ట్ 4/2014 వర్తింప చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపియుటియఫ్) డిమాండ్ చేస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 యేండ్లు పెంచుతూ చేసిన ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయిమెంట్ యాక్టు 4/2014ను తేది.27.06.2014న గెజిట్ పబ్లికేషన్ చేసింది. ఈ చట్టం జులై 2వ తేదీ నుండి అమలు చేస్తూ 60 సం॥లు నిండిన నెలలో చివరి తేదీ మధ్యాహ్నం రిటైర్ చేయబడునని పబ్లిక్ ఎంప్లాయిమెంట్ యాక్ట్ 1984కు సవరణ యివ్వడమైనది. శాసనమండలిలో ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఎమ్మెల్సీలు ఈ యాక్టు 4/2014 అందరికీ వర్తింపచేయాలని ఎయిడెడ్, మున్సిపల్ సిబ్బందికి వర్తించేటట్లు స్పష్టంగా పేర్కొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంలో కౌన్సిల్ వున్న ముఖ్య మంత్రి, ఆర్థికమంత్రి ఈ చట్టం అందరికీ వర్తిస్తుందని తెలియజేశారు. పదవీ విరమణ వయస్సు 60 యేండ్లు పెంపుదలపట్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు హర్షం వెలిబుచ్చారు. అంతలోనే ఈ యాక్ట్ ఎయిడెడ్ వారికి వర్తిస్తుందా?లేదా? అనే అనుమానాలు వ్యక్తమైనాయి. దీనిపై ఆర్థికశాఖ ఉత్తర్వులు జిఓ 147; తేది.30.6.2014, సర్క్యులర్ మెమో నం.4179, తేది. 02.07.2014 ద్వారా ఎయిడెడ్ వారికి, ప్రభుత్వరంగ సిబ్బందికి ఈ యాక్ట్ వర్తించదని బాష్యం చెప్పారు. దీనిపై యుటియఫ్ అభ్యంతరం తెలియజేసింది. ఎయిడెడ్ పట్ల యిప్పటికే అనేక వివక్షతలు పాటిస్తున్న ప్రభుత్వం రిటైర్మెంట్ వయస్సు పెంపులోను అదే వైఖరి అనుసరించడం అన్యాయం. ఎయిడెడ్ వారికి ఈ యాక్ట్ వర్తింప చేయాలని జులై 1,3 తేదీలలో ఆర్థిక శాఖ, విద్యాశాఖ కార్యదర్శులకు ప్రాతినిధ్యం చేయడమైనది. ప్రభుత్వ, స్థానిక సంస్థలకు వర్తించే దాదాపు అన్ని జీఓలను ఎయిడెడ్ వారికి వర్తింపజేస్తూ 4/2014 యాక్ట్ ఎయిడెడ్ పాఠశాల, హాయ్యర్ ఎడ్యుకేషన్ సిబ్బందికి వర్తించకపోవమేమిటని ప్రశ్నించడం జరిగింది. పబ్లిక్ ఎంప్లాయిమెంట్ యాక్ట్ 1984 వర్తించే వారందరికీ యాక్ట్ 4/2014 వర్తింపజేయాలని గట్టిగా చెప్పాము. అయితే 1982 విద్యా చట్టానికి యాక్ట్ 17/1993 ద్వారా చేయబడిన సవరణ మేరకు ఎయిడెడ్ వారికి 60 యేండ్లు పెంపుదల వర్తించదని, 1982 విద్యా చట్టానికి తిరిగి సవరణ చేయాలని చెప్పుకొచ్చారు. విద్యాశాఖ ఎడ్యుకేషన్ యాక్ట్ 1982 పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఎయిడెడ్ (పాఠశాల, ఇంటర్, డిగ్రీ) సిబ్బందికి యాక్ట్ 4/2014 వర్తింపజేసే విషయమై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకోవాలని ఎయిడెడ్ సిబ్బందికి న్యాయం చేయాలని యుటియఫ్ డిమాండ్ చేస్తున్నది. వీరితోపాటు ప్రస్తుతం 58 సం॥ రిటైర్మెంట్ వర్తించే ఏపి రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు ప్రభుత్వరంగ ఉద్యోగులకు కూడా ఈ సౌకర్యం వర్తింపజేయాలని యుటియఫ్ డిమాండ్ చేస్తున్నది.

## పాఠశాల విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై విద్యామంత్రితో ఉపాధ్యాయ సంఘ నేతలు చర్చలు

పాఠశాల విద్యారంగం ఉపాధ్యాయుల సమస్యలపై మానవ వనరుల అభివృద్ధిశాఖ మాత్యులు ఉపాధ్యాయ సంఘాల నేతలతో నేడు తేది.24.06.2014 (మంగళవారం) మధ్యాహ్నం 4 గంటలకు మంత్రి చాంబర్‌లో చర్చలు జరిపారు. పాఠశాల విద్యారంగ అభివృద్ధి తక్షణం తీసుకోవలసిన చర్యలపై చర్చించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఐ.వెంకటేశ్వరరావు, పి.బాబురెడ్డి, ఇతర ఉపాధ్యాయ సంఘాల నేతలు చర్చలలో పాల్గొన్నారు. విద్యాశాఖ నుండి పాఠశాల విద్యా కమీషనర్ వి.ఉషారాణి, జాయింట్ డైరెక్టర్ భార్గవ, అడిషినల్ డైరెక్టర్ గౌరి శంకర్ పాల్గొన్నారు. యుటియఫ్ తరపున ఉపాధ్యాయ ఖాళీ పోస్టుల భర్తీకి (సుమారుగా 25వేలు) వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఉన్నత పాఠశాలలు, సబ్జెక్టు టీచర్లను సర్దుబాటు చేయాలని, సర్దుబాటు చేసే సందర్భంలో ఫిజిక్స్, బయలాజికల్ సైన్స్, గణితము, సోషల్ సబ్జెక్టు టీచర్లు మీడియం వారీగా ఉండేటట్లు సర్దుబాటు చేయాలని, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన ప్రమోషన్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, కొత్త ఉపాధ్యాయుల నియామకాలు జరిగేలోగా ఎకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను వెంటనే నియమించాలని, 2441 ప్రాథమికోన్నత పాఠశాలలను ప్యాట్రన్ ప్రకారం పోస్టులు మంజూరు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ బోధకుల పునర్నియామకాలు వెంటనే చేయాలని, ఎంఇఓ, డివైఇఓ పోస్టుల భర్తీకి అడ్‌హాక్ రూల్స్ వెంటనే రూపొందించాలని, 2013 మేలో బదిలీ అయిన వారిని రిలీవు చేయుటకు చర్యలు తీసుకోవాలని, ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రమోషన్లు, సర్దుబాటు వెంటనే అమలు చేయాలని, ఎయిడెడ్ ఖాళీ పోస్టుల భర్తీకి నియామకాలు చేయాలని, సర్వీస్ రూల్స్ సవరణ చేసి భాషా పండితులకు ప్రమోషన్లు యివ్వాలని, పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, మోడల్ స్కూళ్ళలో ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, సర్వీస్ రూల్స్ విడుదల చేయాలని, మౌలిక వసతులు, హాస్టల్ నిర్మాణం చేయాలని తదితర ముఖ్యమైన డిమాండ్లు చర్చించడం జరిగింది. చర్చలు ప్రారంభించిన మంత్రి కొన్ని ఉపాధ్యాయ సంఘాలు మాట్లాడిన తర్వాత తనకు గవర్నర్ అపాయింట్‌మెంట్ వున్నదని, ఉపాధ్యాయ సంఘాలు యిచ్చిన లేఖలపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని చెబుతూ పాఠశాల విద్య కమీషనర్‌కు సమావేశాన్ని నడిపించాలని ఆదేశించి మంత్రి సమావేశం నుంచి వెళ్ళిపోయారు.

ఉపాధ్యాయ సంఘాలు చర్చించిన అనంతరం కమీషనర్ వి.ఉషారాణి మాట్లాడుతూ హైస్కూల్, ఎలిమెంటరీ పాఠశాలల్లో సర్దుబాటుకు సంబంధించి సమాచారం మాత్రమే సేకరిస్తున్నామని దీనిపై ఉపాధ్యాయులు గందరగోళం పడాల్సిన అవసరం లేదని, వివరాలు ప్రభుత్వానికి నివేదించి నిర్ణయం తీసుకుంటామని, నెలావారీ ప్రమోషన్లు యిచ్చుటకు, ఎయిడెడ్ పాఠశాలల ప్రమోషన్ల భర్తీకి త్వరలో నిర్ణయం తీసుకుంటామని, డిఎస్‌సి-2014 నోటిఫికేషన్ కొరకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి త్వరలో పంపుతామని, రేషనలైజేషన్, 2013లో బదిలీ అయినవారిని రిలీవ్ చేయుటకు త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు.

## రిటైర్మెంట్ వయస్సు 60 యేండ్ల పెంపు ఎయిడెడ్ సిబ్బందికి వర్తింప చేయాలి జులై 2,3 తేదీలలో జిల్లా కేంద్రాలలో నిరసన ప్రదర్శన

నూతన రాష్ట్ర ప్రభుత్వం తొలి సంతకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 60 సం॥లకు పెంచడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. అయితే ఆర్థికశాఖ జూన్ 30న విడుదల చేసిన జిఓ 147లోని ఆదేశాలలో ఎయిడెడ్ విద్యా సంస్థలను పేర్కొనకపోవడంతో ఎయిడెడ్ సిబ్బంది ఆశలు అడియాసలైనాయి. శాసన మండలిలో ఈ బిల్లుపై చర్చ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం ఎయిడెడ్ సిబ్బంది విషయం స్పష్టంగా పేర్కొనాల ని పట్టుబట్టగా ఈ చట్టం అందరికీ వర్తిస్తుందని ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి తెలియజేశారు.

తదుపరి ఎయిడెడ్ సిబ్బంది పబ్లిక్ ఎంప్లాయిమెంట్ పరిధిలోని ఆర్థికశాఖ మీమాంస వ్యక్తం చేస్తుంది. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపియుటియఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ డా॥ ఎం.గేయానంద్ 2014 జులై 1న ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి డా॥ పి.వి.రమేష్‌ను కలిసి ప్రాతినిధ్యం చేయగా పై విషయం తెలియజేశారు. ఎయిడెడ్ సిబ్బందికి ఈ యాక్ట్ వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ జులై 2,3 తేదీల్లో జిల్లా కేంద్రాలలో పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలకు యుటియఫ్ పిలుపునిచ్చింది.

## విద్యారంగ సమస్యలపై దృష్టి సారిస్తా విద్యామంత్రి గంటా శ్రీనివాస్ రావు

పాఠశాల విద్యారంగ సమస్యలపై దృష్టి సారిస్తానని, పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని మానవ వనరుల అభివృద్ధిశాఖామాత్యులు గంటా శ్రీనివాసరావు యుటియఫ్ మరియు పిడిఎఫ్ ఎమ్మెల్సీల ప్రతినిధి వర్గానికి హామీయిచ్చారు. శుక్రవారం (20.06.2014) మధ్యాహ్నం మంత్రి చాంబర్‌లో యుటియఫ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఐ.వెంకటేశ్వరరావు, పి.బాబురెడ్డి మరియు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, కె.ఎస్.లక్ష్మణరావు, బి.నాగేశ్వరరావు, ఎం.గేయానంద్ మంత్రిగారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యారంగ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ప్రతినిధి వర్గం కోరింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 25వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, ఈలోగా ఎకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను వెంటనే నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ బోధకులను తిరిగి నియమించాలని, ఎంఇఓ, డివైఇఓ పోస్టులు భర్తీకి చర్యలు చేపట్టాలని, జూన్ 2013లో బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవు చేయుటకు ఆదేశాలు యిప్పించాలని, పండిట్, పిఇటి పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని, మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని వారు విజ్ఞప్తి చేశారు. పాఠశాల విద్యారంగ సమస్యలు చర్చించడానికి ఉపాధ్యాయ సంఘాలతో, ఎమ్మెల్సీలతో సమావేశాలు వేయాలని కోరారు. విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలు త్వరలో చర్చించి పరిష్కరిస్తామని విద్యాశాఖ మంత్రి హామీ యిచ్చారు.

## తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించాలి

డిఎస్సీ-2014 నియామకాలు చేపట్టేలోగా తాత్కాలిక ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపియుటియఫ్) విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేసింది. అధ్యక్ష , ప్రధానకార్యదర్శులు ఐ.వెంకటేశ్వరరావు, పి.బాబురెడ్డి, మరియు పిడియఫ్ ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రహ్మణ్యం, కె.ఎస్.లక్ష్మణరావు, డా॥ గేయానంద్, బొడ్డు నాగేశ్వరరావులతో కలిసిన ప్రతినిధి వర్గం విద్యాశాఖ కార్యదర్శి రాజేశ్వర్ తివారిని పాఠశాల విద్య కమీషనర్ & డైరెక్టర్ (ఇన్‌చార్జి) వి.ఉషారాణితో విద్యారంగ సమస్యలను చర్చించారు. ఉపాధ్యాయుల కొరత తీర్చడానికి తక్షణం తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించాలని కంప్యూటర్ బోదకులను పునర్ నియామకాలు చేయాలని గత సంవత్సరం బదిలీ చేయబడి రిలీవ్ కాని వారిని రిలీవ్ చేయుటకు చర్యలు చేపట్టాలని, ఉన్నత పాఠశాల సబ్జెక్టు టీచర్లను సర్దుబాటు చేసి వెంటనే ప్రమోషన్ పోస్టులను భర్తీ చేయాలని పండిట్స్, పి.ఇ.టీ పోస్టులను అప్‌గ్రేడేషన్, రూల్స్ సవరణలపై ఉత్తర్వులు యివ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా విద్యాశాఖాధికారుల నుండి సమాచారం వచ్చిన వెంటనే సర్దుబాటు ప్రక్రియ చేపట్టనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

## 2441 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 8వ తరగతి అనుమతి

ఆంధ్రప్రదేశ్‌లో 2441 ప్రాథమికోన్నత పాఠశాలలలో 8వ తరగతి అనుమతిస్తూ పాఠశాల విద్య కమీషనర్ వి.ఉషారాణి (ఆర్‌సి నం.8, తేది.19.06.2014) డిఇఓలకు ఈ రోజు ఆదేశాలు పంపారని యుటియఫ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఐ.వెంకటేశ్వరరావు, పి.బాబురెడ్డి తెలిపారు. జిల్లాలవారీగా 8వ తరగతికి అనుమతించిన పాఠశాలల సంఖ్య వివరాలు. శ్రీకాకుళం 260, విజయనగరం 72, విశాఖ 163, తూర్పుగోదావరి 184, పశ్చిమగోదావరి 155, కృష్ణా 161, గుంటూరు 223, ప్రకాశం 218, నెల్లూరు 203, చిత్తూరు 241, కడప 91, అనంతపురం 245, కర్నూల్ 225.

## చందాదారులకు విజ్ఞప్తి

ఐక్యఉపాధ్యాయను విజయవాడ నుండి ప్రచురించటానికి, తెలంగాణా రాష్ట్ర ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ పక్షాన నూతన మాస పత్రిక ప్రారంభించటానికి ఆర్ఎన్ఐ (ఢిల్లీ) అనుమతి కొరకు దరఖాస్తు చేసి వున్నాము. అనుమతి వచ్చేవరకు సాంకేతిక యిబ్బందుల దృష్ట్యా ఐక్యఉపాధ్యాయ పత్రిక ఉభయ రాష్ట్రాలకు ఉమ్మడిగానే ప్రచురించబడుతుందని తెలియజేస్తున్నాము.

–సంపాదకవర్గం

## ఐక్య ఉపాధ్యాయ చందారేట్లు

తేది.01.05.2014 నుండి ఐక్య ఉపాధ్యాయ చందారేట్లు ఈ క్రింది విధంగా సవరించబడినాయి.

| | |
|---|---|
| **వార్షిక** | **రూ.120/–** |
| **అర్థదశాబ్ది (5 సం॥)** | **రూ.550/–** |
| **దశాబ్ది (10 సం॥)** | **రూ.1000/–** |

పాఠకులు, యుటియఫ్ కార్యకర్తలు మార్పును గమనించి, తదనుగుణంగా పత్రిక చందాలను చేర్పించాలని మనవి.

**సంపాదకులు**

# ప్రశ్నోత్తరాలు



నిర్వహణ : సిహెచ్. రవి, ప్రధాన సంపాదకులు
mail : ikyopadhyaya@gmail.com

ప్రశ్న : **మా సోదరుని కుమారుడు 1 నుండి 3వ తరగతి వరకు మెదక్ జిల్లాలోనూ, 4 నుండి 6 వరకు రంగారెడ్డి జిల్లా 7 నుండి 9 వరకు హైదరాబాద్ జిల్లా, 10వ తరగతి నల్లగొండ జిల్లాలో చదివాడు. గత డిఎస్సిలలో మెదక్, రంగారెడ్డి జిల్లాలకు లోకల్ కాదని తిరస్కరించారు. అతను ఏ జిల్లాకు లోకల్ అవుతాడు?**

**- పి.భిక్షపతి,** బహదూర్‌గూడ, రంగారెడ్డి జిల్లా

జవాబు : జిఓ నం.186 జిఏడి; తేది.18.03.1977 ప్రకారం హైదరాబాద్ జిల్లాకు లోకల్ క్యాండిడేట్ అవుతారు. 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు 7 సం॥ల కాలంలో 2 జిల్లాల లో 3 సం॥ల చొప్పున సమానంగా చదివినప్పుడు స్కూల్ ఫైనల్ (10వ తరగతి) కంటే ముందు 3 సం॥లు చదివిన జిల్లాను స్థానిక జిల్లాగా పరిగణించాలని పై జిఓలోని అనుబంధంలో ఉదాహరణ '2' ద్వారా స్పష్టంగా పేర్కొన బడింది.

ప్రశ్న : **మా పాఠశాలలో రికార్డు అసిస్టెంట్ తేది.01.08.1990 నుండి తేది.01.08.1999 వరకు 9 సం॥ల పాటు గైర్హాజరీ అనంతరం పాఠశాలలో చేరారు. ఆ కాలాన్ని డైస్ నాన్‌గా పరిగణిస్తూ వేతనం చెల్లించమని వత్తిడి చేస్తున్నాడు. డిఇఓ గారిని వివరణ కోరితే ఉత్తర్వులు ఇవ్వకుండా, సెలవు మంజూరు చేయమని లేకుంటే సస్పెండ్ చేస్తానని ఒత్తిడి చేస్తున్నారు. డైస్ నాన్ కాలాన్ని రెగ్యులరైజ్ చేసే అధికారం ప్రధానోపాధ్యాయునికి ఉంటుందా?**

**- నరేష్ కుమార్,** హెచ్ఎం, షాబజార్, మహబూబ్‌నగర్ జిల్లా

జవాబు : ఎఫ్ఆర్ 18 మరియు ఏపిఎల్ఆర్-1933లోని రూల్ 5 ప్రకారం 5 సం॥లకు మించి గైర్హాజరైన ఉద్యోగి ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు భావించాలి. తిరిగి చేరాలంటే ప్రభుత్వం నుండి ప్రత్యేక అనుమతి పొందాలి. మీ రికార్డ్ అసిస్టెంట్‌కు 9 సం॥ల అనంతరం జాయినింగ్ పర్మిషన్ ఎవరు ఇచ్చారు. గైర్హాజరు కాలాన్ని డైస్ నాన్‌గా ప్రభుత్వం నిర్ణయించిందా? పరిశీలించండి. ఎఫ్ఆర్ 18 నోట్(1) ప్రకారం డైస్‌నాన్ కాలం ఇంక్రిమెంట్లు, సెలవులు, పెన్షన్ తదితర అన్ని సందర్భాలకు సర్వీస్‌గా పరిగణించబడదు. కనుక ఆ కాలానికి సెలవు మంజూరు చేయటం, వేతనం చెల్లించటం అనే ప్రశ్న ఉత్పన్నంకాదు.

ప్రశ్న : **నేను ఎస్‌జిటి (ఉర్దూ)గా 11 సం॥ల నుండి పనిచేస్తున్నాను. 75% అంగవైకల్యం కలిగిన అవివాహితను. తల్లిదండ్రులు, ఒక తమ్ముడు నాపై ఆధారపడి ఉన్నారు. మా తమ్ముడు డిగ్రీ, బిఇడి చదివారు. నేను ఉద్యోగం చేయలేకపోతున్నాను. కనుక నా ఉద్యోగాన్ని నా తమ్ముడికి బదిలీచేసే అవకాశం ఉన్నదా?**

**- జరీనా బేగం,** కర్నూలు జిల్లా

జవాబు : ఉపాధ్యాయ ఉద్యోగాన్ని మీ సోదరునికి నేరుగా బదిలీ చేసే అవకాశం లేదు. కానీ జిఓ నం 66 జిఏడి; తేది. 23.10.2008 (అ.ద. 25 పే 175) నిబంధనలకు లోబడి మీరు అనారోగ్యం కారణంగా శాశ్వతంగా విధులు నిర్వర్తించలేరని జిల్లా మెడికల్ బోర్డు ధృవీకరిస్తే మిమ్మల్ని మెడికల్ ఇన్‌వాలిడేషన్ క్రింద రిటైర్ చేసి మీ తమ్మునికి జూనియర్ అసిస్టెంట్ స్థాయికి మించకుండా కారుణ్యా నియామకం కోటాలో ఉద్యోగం ఇచ్చే అవకాశం ఉన్నది.

ప్రశ్న : **ఉన్నత పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది లేనప్పుడు వేసవి సెలవుల్లో ఎస్ఎస్‌సి అడ్వాన్డ్ సప్లిమెంటరీ విధులను సీనియర్ ఉపాధ్యాయునికే అప్పగించాలా? సంబంధిత ఉత్తర్వులను తెలియజేయండి.**

**- పి.సునీత,** ఇ-మెయిల్

జవాబు : అవును.
సి & డిఎస్ఇ ఉత్తర్వులు ఆర్‌సి నం.132/ఇ1-1/2008; తేది.14.05.2014 మరియు ప్రతి సంవత్సరం వేసవిలో సి & డిఎస్ఇ ఇచ్చే ఉత్తర్వులయందు బోధనేతర సిబ్బంది (జెఎ, ఆర్ఏ) లేనప్పుడు సీనియర్ ఉపాధ్యాయుడికి ఎస్ఎస్‌సి అడ్వాన్డ్ సంప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన బాధ్యతలు అప్పగించాలని స్పష్టంగా పేర్కొన్నారు.

ప్రశ్న : **విద్యాహక్కు చట్టంలోని ఏ నిబంధన ప్రకారం పాఠశాలలో 1 నుండి 8 తరగతి వరకు విద్యార్థులను నేరుగా చేర్చుకోవచ్చు? సంబంధిత వివరాలను తెలియజేయండి.**

**- కె.వి.రమణ,** ఎస్.కోట, విజయనగరం జిల్లా

జవాబు : బాలల ఉచిత నిర్బంద విద్యా హక్కు చట్టం-2009లోని 2వ అధ్యాయం 4వ సెక్షన్ మరియు ఆంధ్రప్రదేశ్ బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం నిబంధనలు-2010 ప్రకారం 6 నుండి 14 సం॥ల వయస్సుగల పిల్లలను వారి వయస్సుకు తగిన విధంగా 1 నుండి 8వ తరగతి వరకు నేరుగా చేర్చుకోవలసి ఉంటుంది.

ప్రశ్న : **గత సంవత్సరం మా పాఠశాలలో ఇద్దరు 9వ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు వ్రాయలేదు. కనీసం 20% హాజరు కూడా లేదు. కానీ ఈ సంవత్సరం 10వ తరగతిలోనే చదువుతామంటున్నారు. వయస్సు ప్రకారం 10వ తరగతికి ప్రమోట్ చేయవచ్చా?**

**- సిరిజీ,** ఇ-మెయిల్

జవాబు : లేదు. 9,10 తరగతుల విద్యార్థులు విద్యాహక్కు చట్టం పరిధి లోకి రారు కనుక రాష్ట్ర విద్యాచట్టం నిబంధనల ప్రకారం కనీస హాజరు వుంటేనే పై తరగతికి ప్రమోట్ చేయాలి.

ప్రశ్న : **అప్రెంటిస్ కాలంలో సస్పెండ్ అయిన ఉపాధ్యాయునికి సబ్సిస్టెన్స్ అలవెన్స్ చెల్లిస్తారా?
సస్పెన్షన్ ఎత్తివేసిన తర్వాత ఆ కాలాన్ని ఇఓఎల్‌గా పరిగణిస్తే ముందు చెల్లించిన సబ్సిస్టెన్స్ అలవెన్సును రికవరీ చేస్తారా?**

**- ఐ.పవన్‌కుమార్,** ఇ-మెయిల్

జవాబు : అప్రెంటిస్ ఉపాధ్యాయునికి కూడా స్టైఫండ్‌లో సగం ఎఫ్ఆర్ 53 ప్రకారం సబ్సిస్టెన్స్ అలవెన్స్ చెల్లించాలి.

పునర్నియామకం అనంతరం సస్పెన్షన్ కాలాన్ని అర్హతగల సెలవుగా నిర్ణయించిన సందర్భంలో ఎఫ్ఆర్ 54లోని సూచన '2' ప్రకారం సెలవు జీతం నుండి లోగడ పొందిన సబ్సిస్టెన్స్ అలవెన్స్‌ను సర్దుబాటు చేయాల్సి వుంటుంది. సస్పెన్షన్ కాలాన్ని ఇఓఎల్‌గా నిర్ణయించిన సందర్భంలో లోగడ పొందిన సబ్సిస్టెన్స్ అలవెన్సును రికవరీ చేయరు.

ప్రశ్న : **రిటైర్మెంట్ వయస్సు 58 సం॥ల నుండి 60 సం॥లకు పెంచిన ఉత్తర్వు ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వర్తిస్తుందా?**

**- జిరత్నయ్య,** ఇ-మెయిల్

జవాబు : ప్రస్తుత చట్టం ఎయిడెడ్ ఉపాధ్యాయులకు వర్తించదని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ సర్క్యులర్ Memo No.4179/14/HRM-IV/2014 ; తేది.02.07.2014 ద్వారా వివరణ ఉత్తర్వులు విడుదల చేసింది. ఎయిడెడ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు రిటైర్మెంట్ వయస్సు 60 సం॥ల పెంపు వర్తింపజేయాలంటే ఏపి ఎడ్యుకేషన్ యాక్ట్-1982కు సవరణగా యిచ్చిన యాక్ట్ నం.17/93ను సవరించాల్సి వుంటుందని ఆర్థికశాఖ తెలిపింది. సదరు యాక్టుకు సవరణ చేసి ఎయిడెడ్ వారికి కూడా పెంపుదల వర్తింప జేస్తామని పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు, ఏపియుటియఫ్ నాయకులకు ముఖ్యమంత్రి స్పష్టమైన హామీ యిచ్చారు.

ప్రశ్న : **మా ప్రాథమికోన్నత పాఠశాలలో 1 ఎస్‌జిటి, 2 ఎస్ఏలు, 2 పండిట్ పోస్టులున్నాయి. 1 నుండి 5 తరగతులు ఒక్క ఎస్‌జిటినే చెప్పాలంటున్నారు. సమంజసమా? ఎస్ఏలు, పండితులు, 6,7 తరగతులకు మాత్రమే బోధించాలని జిఓ ఉందా?**

**- హెచ్.పవన్,** ఇ-మెయిల్

జవాబు : జిఓ నం.55 విద్య; తేది.23.04.2011 ప్రకారం ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని లెక్కించేటప్పుడు 1 నుండి 5 తరగతుల వరకు 19 మంది విద్యార్థులకు 1 ఎస్‌జిటినే కెటాయించారు. 6,7 తరగతులకు 120మంది వరకు 2 ఎస్ఏలు, 2 పండితులను కెటాయించారు. మీ పాఠశాలలో 1 నుండి 5 తరగతులలోపు విద్యార్థుల సంఖ్య 20లోపు ఉంటే 1 ఎస్‌జిటినే బోధించాల్సి వుంటుంది. 1-5 తరగతులలో విద్యార్థులు అధికంగా ఉంటే కొత్త పోస్టులు మంజూరయ్యే వరకు విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా ఉపాధ్యాయులు పరస్పర అవగాహనతో పని విభజన చేసుకోవడం శ్రేయస్కరం.

ప్రశ్న : **నేను 1978 నుండి ఉర్దూ ఎస్‌జిటిగా పనిచేస్తూ తేది.22.12. 1996న ఎస్ఏ ప్రమోషన్ పొంది తేది.03.01.1997న విధులలో చేరాను. నేను విధులలో చేరేలోపుగానే 1996 డిఎస్‌సి అభ్యర్థులు చేరారు. ప్రధానోపాధ్యాయుల పదోన్నతి సీనియార్టీ జాబితాలో నా పేరును 1996 డిఎస్‌సి ఉపాధ్యాయుల తర్వాత చేర్చారు. నేను ఏపిఏటిని ఆశ్రయిస్తే ప్రమోషన్ ఆర్డర్ తేదీ ప్రకారం సీనియార్టీ లిస్ట్‌లో చేర్చమని ఆదేశాలిచ్చారు. నా బ్యాచ్‌లోనే డిసెంబర్ 16 నుండి 20 వరకు ప్రమోషన్ పొందిన వారికి ఆర్డరు తేదీ ప్రకారం హెచ్ఎం ప్రమోషన్ కల్పించారు. నాకు మాత్రం ఇవ్వలేదు. సమంజసమా?**

**- పి.అక్బర్‌ఖాన్,** ప్రకాశం జిల్లా

జవాబు : ఏపి స్టేట్ అండ్ సబార్డినేట్ సర్వీస్ నిబంధనల ప్రకారం ప్రమోటీలు, డైరెక్ట్ రిక్రూటీలలో విధులలో చేరిన తేదీ ప్రకారమే సీనియార్టీ నిర్ణయిస్తారు. మీకు ఏపిఏటి ఉత్తర్వులు ఉన్నాయంటున్నారు. ఇంకా మీ బ్యాచ్ వారందరికీ ప్రమోషన్ ఆర్డర్ తేదీ ప్రాతిపదికగా సీనియార్టీ ఇచ్చారంటున్నారు. కనుక మీకు ఇవ్వకపోవడం సమంజసం కాదు. కోర్టు దిక్కారణ క్రింద డిఇఓపై ఏపిఏటిలో కేసు వేయండి.

ప్రశ్న : **80 శాతం దృష్టి లోపం గల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు జిల్లా మెడికల్ బోర్డు నుండి ధృవపత్రం పొంది కన్వేయన్స్ అలవెన్సు కోసం ఎంఇఓకు దరఖాస్తు చేయగా, తనకు అధికారం ఉందా అని ఎంఇఓ సందేహిస్తున్నారు. వివరణ ఇవ్వండి మరియు సంబంధిత జిఓలను తెల్పండి.**

**- జె.వి.ఎస్.కె.ప్రసాద్,** మాచర్ల, గుంటూరు జిల్లా

జవాబు : జిఓ ఎంఎస్ నం.262 ఆర్థిక & ప్రణాళిక; తేది.25.08. 1980 మరియు పంచాయితీరాజ్ శాఖ మెమో నం.68072 /Es H.V/85-2; తేది.06.09.1985లోని నిబంధనలనను సరించి అంధులు మరియు అంగవైకల్యం గల ఉద్యోగులకు కన్వేయన్స్ అలవెన్స్ మంజూరుచేసే అధికారం సంబంధిత కార్యాలయాధిపతులకే అప్పగిస్తూ జిఓ నం. 63 పంచాయితీరాజ్ తేది.05.01.1981ను విడుదల చేశారు. ఇంకా జిఓ నం.40 విద్య; తేది.07.02.2002 ప్రకారం మండల పరిషత్ యాజమాన్యంలోని ఉపాధ్యాయులకు కార్యాలయాధిపతి ఎంఇఓనే కనుక పై జిఓలలోని నిబంధనలకు అనుగుణంగా ఉంటే కన్వేయన్స్ అలవెన్స్ మంజూరు చేయవచ్చు.

ప్రశ్న : **నేను 02.11.1996న ఎస్‌జిటిగా చేరి అప్రెంటీస్ కాలంలో ఎస్ఎస్‌సి కొరకు ఇఓఎల్ వినియోగించుకున్నందున తేది. 14.12.1999న రెగ్యులర్ స్కేల్ పొందాను. తేది.03.02. 2009న ఎస్ఏ (పిఎస్) ప్రమోషన్ పొందాను. ప్రస్తుతం నా వేతనం (1.12.2013) రూ. 17050. 96,98 డిఎస్‌సిలకు చెందిన నాకంటే జూనియర్లు తేది. 24.01.2012న పదోన్నతి పొంది అధిక వేతనం పొందుచున్నారు. స్టెప్అప్ లేదా ప్రీపొన్మెంట్ వర్తింపజేసుకునే అవకాశం ఉన్నదా?**

**- ఎం.ఇ.కృపావరం,** పిఠాపురం, తూర్పుగోదావరి జిల్లా

జవాబు : మీకు, మీ జూనియర్‌కు వేతనాల్లో వ్యత్యాసం ఇఓఎల్ కారణంగా ఏర్పడి వుంటే స్టెప్అప్ ద్వారా సవరించటం వీలుకాదు. ఆర్‌పిఎస్-2010 ఫిక్సేషన్ సందర్భంలో జూనియర్ ముందుగా ఇంక్రిమెంట్ పొందుచున్న యెడల సీనియర్ ఇంక్రిమెంట్ తేదీని ప్రీపోన్ చేసే వీలున్నది. ఆ తర్వాత వచ్చిన వ్యత్యాసాన్ని సవరించటానికి ప్రీపోన్‌మెంట్ నిబంధనలు అనుమతించవు.

## పాఠకులకు గమనిక

ఇ-మెయిల్ లేదా లేఖల ద్వారా ప్రశ్నలు పంపేవారు వారి పేరు, ఫోన్‌నంబరు, ఐక్యఉపాధ్యాయ చందానంబరు తప్పనిసరిగా వ్రాయాలి. ప్రశ్నలు సూటిగా స్పష్టంగా ఉండాలి. జిఓ / మెమో కాపీలు కావలసిన వారు సంబంధిత జిల్లాలలో యుటియఫ్ కార్యాలయాలను లేదా బాధ్యులను సంప్రదించాలి. పత్రికా కార్యాలయం నుండి జిఓ / మెమో కాపీలు పంపుటకు వీలుకాదు.

# వివిధ జిల్లాల కార్యవర్గ సమావేశాలు

## తూర్పుగోదావరి

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపియుటియఫ్) తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశం జూన్ 15న కాకినాడ ఎన్‌జిఓ హాల్‌నందు యుటియఫ్ జిల్లా అధ్యక్షులు జి.ప్రభాకరవర్మ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు హాజరైనారు. కేంద్రంలో, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగంను బలపరిచే చర్యలు తీసుకోవాలని, వారి మేనిఫెస్టోలో విద్యారంగం పట్ల యిచ్చిన హామీలను నిలబెట్టుకోవాలనీ ఆయన కోరారు. అలాగే పాఠశాలల్లో ఖాళీగా వున్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకోసం డిఎస్‌సి-2014 నియామకాల నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈలోపున తాత్కాలిక పద్ధతిన అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని కోరారు. అలాగే గత సంవత్సర కాలం నుండి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ఎదురుచూస్తున్న 10వ పీఆర్‌సీని 50% ఫిట్‌మెంట్‌తో ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన 2500 పండిట్, 2500 పిఇటి పోస్టులు అప్‌గ్రేడ్ చేసి పదోన్నతులు వెంటనే చేపట్టాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్, ఎయిడెడ్ విద్యారంగంను బ్రతికించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ రాష్ట్ర కర్తవ్యాలను ప్రవేశ పెట్టారు. ప్రభుత్వ విద్యారంగంను నిలబెట్టుకోవడానికి మండల, పట్టణ స్థాయిల లో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేసి సదస్సులు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

యుటియఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.సత్తిరాజు కార్యదర్శి నివేదికను, జిల్లా కర్తవ్యాలను ప్రవేశపెట్టారు. జిల్లా కోశాధికారి కె.వి.ప్రసాద్‌బాబు ఆర్థిక నివేదికను, సంక్షేమ పథకం ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎస్‌వి చలపతి పథకం నివేదికను ప్రవేశపెట్టారు. పలు తీర్మానాలను ఆమోదించారు. బదిలీ కోరుకుని ఇంకనూ రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని సమావేశం తీర్మానించింది. రాజమండ్రి (రూరల్) పిడింగొయ్యి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు జివిఎస్‌వి రవికృష్ణ మే 4వ తేదీన మరణించగా, కుటుంబ సంక్షేంలో సభ్యుడైనందున వారి కుటుంబ సభ్యులకు 1.50,000/- చెక్కును కుటుంబ సంక్షేమ పథకం గౌరవాధ్యక్షులు జి.చిట్టిబాబు, రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు, జిల్లా కుటుంబ సంక్షేమ పథకం అధ్యక్షులు కెఎస్‌ఎస్ ప్రసాద్, జిల్లా యుటియఫ్ ప్రధాన బాధ్యులు జి.ప్రభాకరవర్మ, కె.సత్తిరాజు చేతుల మీదుగా అందజేశారు. జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులు ఎన్. విశ్వనాథ్, ఎన్.అరుణకుమారి, జిల్లా కార్యదర్శులు ఎస్.జ్యోతిబసు, డివి రాఘవులు, జి.అప్పలనాయుడు, షరీఫ్, ఎంఆర్‌సి మోహన్, టి. కామేశ్వరరావు, చక్రవర్తి, చైతన్య, మంగరాజు, పి.నాగేశ్వరరావు, ఎం. నాగేశ్వరరావు, డి.అన్నపూర్ణ, జె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమగోదావరి

పశ్చిమగోదావరి జిల్లా యుటియఫ్ కార్యవర్గ సమావేశం జూన్ 14న తాడేపల్లిగూడెంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని 46 మండలాలకు గాను 43 మండలాల నుండి కార్యవర్గ సభ్యులు హాజరై జయప్రదం చేశారు. జిల్లాశాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సాల్టీ కార్యకలాపాల నివేదిక, కర్తవ్యాలను వివరించారు. హాజరైన అందరూ కర్తవ్యాలను, నివేదికను చర్చల అనంతరం ఏకగ్రీవంగా ఆమోదించారు. జిల్లాలో గత 14 నెలల నుండి నిలిచిపోయిన వివిధ రకాల ఉపాధ్యాయుల ప్రమోషన్లు వెంటనే అమలు చేయాలని, పండిట్, పిఇటి పోస్టుల అప్‌గ్రేడ్ చేయాలని, రు 398 వేతనంతో పనిచేసిన వారికి నోషనల్ ఇంక్రిమెంట్లు యివ్వాలని, ఖాళీగా వున్న ఎంఇఓ, డివైడిఇఓ, డైట్ లెక్చరర్ల పోస్టులను వెంటనే ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని, విద్యావికాస ఉద్యమంలో చురుకుగా పాల్గొని ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని తీర్మానించారు.

ఐక్యఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు సిహెచ్.సుభాష్‌చంద్రబోస్ సందేశమిస్తూ 10వ పీఆర్‌సీ నివేదిక వెంటనే ఆమోదించి యథతథంగా 2013 జులై 1 నుండి అమలు చేయాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయుటకు వీలుగా డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సభ్యత్వ, పత్రికా క్యాంపెయిన్లు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. రాబోయే ఆగస్ట్ 10వ తేదీకి యుటియఫ్ ఆవిర్భవించి 40 సం॥ కావస్తున్న సందర్భంగా ఆ తేదీన పెద్దఎత్తున పతాకావిష్కరణలు, విద్యాగోష్టులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో పెద్ద ఎత్తున విద్యార్థులను చేర్చుటకు వీలుగా ప్రతి యుటియఫ్ కార్యకర్త స్వచ్ఛందంగా పనిచేసి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు బిఎస్ ప్రకాశరావు, సహాధ్యక్షులు సిహెచ్.జగన్మోహన్‌రావు, ఎస్.జయప్రభ, కోశాధికారి పి.వి.నరసింహారావు, కార్యదర్శులు ఎం.రామకృష్ణ, టివి రామకృష్ణ, ఎంవి శ్యామ్‌బాబు, జివి రామానుజరావు, కనకదుర్గ, శ్రీదేవి, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళం

టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగంపై యిచ్చిన హామీలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాల విద్యారంగానికి అధిక ప్రాధాన్యత యివ్వాలని ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపియుటియఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు గొంటి గిరిధర్ అధ్యక్షతన నిర్వహించిన యుటియఫ్ శ్రీకాకుళం జిల్లా కార్యవర్గం సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాల పునఃప్రారంభమునకు 3 నెలలముందే డిఎస్‌సి నియామకాలు చేస్తామని, క్రమం తప్పకుండా డిఎస్‌సి నియామకాలు చేపడతామని, కంప్యూటర్ విద్య అందిస్తామని, మౌలిక వసతులు మెరుగు పరుస్తామని, మధ్యాహ్నభోజన పథకంలో ప్రతిరోజు కోడిగ్రుడ్డు పెడతామని మ్యానిఫెస్టోలో పేర్కొన్నారని ఆయన గుర్తుచేశారు.

ఇటీవల జరిగిన రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశంలో ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించుకోవడానికి ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని, ప్రతి మండలంలో కొన్ని పాఠశాలలను యుటియఫ్ దత్తత తీసుకొని నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుందన్నారు. పాఠశాల విద్యారంగంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎంఇఓ, డివైఇఓ పోస్టులను అడ్‌హాక్ రూల్స్‌తో తక్షణమే భర్తీ చేయాలని,

పండిట్స్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, స్పెషల్ టీచర్ల సర్వీస్‌కు నోషనల్ ఇంక్రిమెంట్లు యివ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశం తీర్మానించింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆశతో ఎదురుచూస్తున్న 10వ పీఆర్‌సీ 50% ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని తీర్మానించింది. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి సిహెచ్.రవీంద్ర కార్యక్రమాల నివేదికను, రాష్ట్ర కార్యవర్గ కర్తవ్యాలను, విద్యా వికాస ఉద్యమం, క్యాంపెయిన్, భవిష్యత్తు పోరాటాలపై ప్రతిపాదించిన నిర్ణయాలు కార్యవర్గం చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు జి.భాస్కరావు, సహాధ్యక్షులు ఎస్.కిషోర్, వాగ్దేవి, కోశాధికారి పి.అప్పారావు, జిల్లా కార్యదర్శులు ప్రకాశ్, బి.చిట్టిబాబు, జిల్లా నాయకులు ఆర్.దమయంతి, బి.ధనలక్ష్మి, కె.మణిమాల, ఆరిక భాస్కరరావు, ఎస్.వెంకటరావు, ఎస్.జగదీశ్వరరావు, బొడ్డేపల్లి జనార్ధన రావు, బమ్మిడి శ్రీరామమూర్తి, కె.వి.శ్రీరామమూర్తి, ఆర్.ఆనందరావు, పి.ధర్మారావు, కె.కామేశ్వరరావు, కె.గౌలినాయుడు, జిల్లాలోని అన్ని మండల, పట్టణ శాఖల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాల్గొన్నారు.

## అనంతపురం

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపియుటియఫ్) అనంత పురం జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం జూన్ 16న ప్రభుత్వ ఉన్నత పాఠశాల అనంతపురం కొత్తూరునందు అధ్యక్షులు కె.నాగేంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షుడు ఎన్. నరసింహుడు మాట్లాడుతూ మెరుగైన పీఆర్‌సీ కోసం యుటియఫ్ గట్టిగా జెఏసితో కలిసి పోరాడుతుందని, హెల్త్‌కార్డ్స్, నోషనల్ ఇంక్రిమెంట్స్ కోసం ప్రభుత్వంతో చర్చలు జరిపి సాధిస్తామని చెప్పారు. గౌరవాధ్యక్షు లు ఎస్.మహమ్మద్ జిలాన్ మాట్లాడుతూ గతంలో ఉద్యమాల ద్వారా సాధించిన వాటిని ఒక్కొక్కటి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.కె.నాగేంద్రబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ సామాజిక బాధ్యతగా కనీసం రెండు పాఠశాలలను దత్తత తీసుకొని 100% ఎన్‌రోల్‌మెంట్ సాధించాలని, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులను తీర్చి దిద్దాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత పుస్తకాలు, దుస్తులు, భోజనం, హెల్త్‌కార్డ్స్ గురించి తల్లిదండ్రులకు తెలియచేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ గతంలో పీఆర్‌సీకంటే మెరుగైన పీఆర్‌సీని సాధిస్తామని, పండిట్, పిఇటి పోస్టుల అప్‌గ్రేడేషన్ కోసం కృషి చేస్తామని, 13 జిల్లాల్లో మన సంఘం పెద్ద సంఘంగా వుందని, కావున జేఏసిలో కీలకపాత్ర వహిస్తామని తెలిపారు. ప్రధానకార్యదర్శి వి.కోటేశ్వరప్ప కార్యకలాపాల నివేదిక ప్రతిపాదించగా సభ్యులు చర్చించి ఆమోదించారు. పలు తీర్మానాలను, భవిష్యత్ కర్తవ్యాలను సమావేశం ఆమోదించింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ఎమ్.సుధాకర్, ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, ఎం.సుధాకర్, గోవిందరాజులు, విజయభాస్కర్, సాయినాథ్‌బాబు, కోశాధికారి ఈశ్వరయ్య వివిధ మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

## నెల్లూరు

ప్రభుత్వ విద్య బలోపేతానికి ప్రతి యుటియఫ్ కార్యకర్త నడుం బిగించాలని యుటియఫ్ నెల్లూరు జిల్లా కార్యవర్గ సమావేశం పిలుపు నిచ్చింది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యా వికాస ఉద్యమం ద్వారా ప్రతి మండలాలు మైక్ ప్రచారం జరపాలని, తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాల ఉపాధ్యాయులకు తోడ్పాటు అందించి విద్యార్థుల సంఖ్య పెంపుకు కృషి చేయాలని, ప్రతి మండల శాఖ 5 పాఠశాలల్ని దత్తత తీసుకోవాలని పిలుపు నిచ్చారు. అదే సందర్భంలో ప్రభుత్వ విధానాలను మార్చుకొనే విధంగా ప్రభుత్వ విద్య పటిష్టతకు తల్లిదండ్రులను కలుపుకొని ఉద్యమాలు చేయాలన్నారు.

అవినీతి డిఇఓ రామలింగంపై నెల్లూరు జిల్లా యుటియఫ్ చేసిన పోరాటం చారిత్రకమైందని ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. రామలింగం జిల్లా విద్యా వ్యవస్థను అస్తవ్యస్థం చేశాడని దానిని చక్కదిద్దుకోవాల్సిన బాధ్యత యుటియఫ్‌దేనన్నారు.

రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ పదవీ విరమణ వయస్సు 60 సం॥లకు పెంపుపట్ల హర్షం వ్యక్తం చేశారు. వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎయిడెడ్, మున్సిపల్ టీచర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, గత కౌన్సిలింగ్‌లో కోరుకున్న ఉపాధ్యాయులను వెంటనే రిలీవు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సిహెచ్.శ్రీహరి, కె.పరంధామయ్య, జిల్లా కార్యదర్శులు అన్ని మండలాల ముఖ్య నాయకత్వం పాల్గొని చర్చించారు.

## కడప

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపియుటియఫ్) కడప జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం జూన్ 10న కడపలోని డిసిఇబి హాల్‌లో జిల్లా అధ్యక్షుడు ఎస్.ఓబుల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం బలోపేతం చేయటానికి 'విద్యా వికాస వేదిక' ఏర్పాటైందని, విద్యా వికాస ఉద్యమంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ పెరగటానికి కృషి చేయాలని కోరారు. జిల్లా ప్రధానకార్యదర్శి బి.లక్ష్మిరాజ కార్యకలాపాల నివేదిక ప్రవేశ పెట్టారు. కార్యవర్గ సభ్యులు చర్చించి ఆమోదించారు.

స్పెషల్ టీచర్ల కాలానికి 2 నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, భాషా పండితులు, పిఇటి అప్‌గ్రేడేషన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని, నూతన పీఆర్‌సీ 60% ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలని, మానటరీ బెనిఫిట్ జులై 2013 నుండి అమలు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్‌రూల్స్ వర్తింపజేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని, మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ ప్రకటించి, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్స్, రేషనలైజేషన్ ప్రక్రియ జరగటానికి చర్యలు తీసుకోవాలి. నగదు రహిత ఆరోగ్య కార్డులు అన్ని ఆసుపత్రులలో అన్ని రకాల జబ్బులకు అమలయ్యేలా మార్పుచేసి ఉత్తర్వులు ఇవ్వాలని, ఉర్దూ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు వెంటనే సరఫరా చేయాలని తదితర సమస్యలపై తీర్మానాలను ఆమోదించారు.

సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షుడు బీరం సుబ్బారెడ్డి, జిల్లా సహాధ్యక్షులు ఎం.విజయ్‌కుమార్, ఆర్.ఉషాతులసి, ట్రెజరర్ ఎస్.వి. సుబ్బరాజు, కార్యదర్శులు బి.రమణారెడ్డి, పి.చంద్రశేఖర్, భూషణయ్య, జాబీర్, విద్యాసాగర్, మస్తానయ్య, హరిప్రసాద్, శ్రీనివాసులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీచర్స్ సొసైటీ సమావేశం

కడప జిల్లా ఎలిమెంటరీ మరియు సెకండరీ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం జూన్ 29న డిసిఇబి హాల్‌లో అధ్యక్షుడు బి.లక్ష్మిరాజ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పబ్బిపురం, ఆర్‌కె నగర్ ప్లాట్ల అభివృద్ధికి అండగా ఉంటామని తెలిపారు. పబ్బాపురం ప్లాట్ల అభివృద్ధికి అడ్డంకిగా వున్న సాంకేతిక అంశాలను అధిగమిస్తామని తెలిపారు. పబ్బాపురం ప్లాట్లు పూర్తి అభివృద్ధి జరిగేవరకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు.

ఆర్‌కె నగర్ ప్లాట్ల అభివృద్ధికి త్వరలో ఆర్‌కె నగర్ ప్లాట్లలో సమావేశం నిర్వహిస్తామన్నారు. జిల్లా కేంద్రంలో నూతన ప్లాట్ల కోసం ఎమ్మెల్సీల సహకారంతో సాధించుకోవటానికి కృషి చేస్తామన్నారు.

ఈ సమావేశంలో కార్యదర్శి కె.సురేష్‌బాబు కార్యక్రమాల నివేదిక ఆర్థిక నివేదిక ప్రవేశ పెట్టారు. ఈ సమావేశంలో పి.చెంచురామయ్య, ఎస్.రామమోహన్‌రెడ్డి, ఎల్.బాలశౌరిరెడ్డి, కె.ఎస్.పర్వతుల్లా, బి.వి. శివారెడ్డి పాల్గొన్నారు.

## చిత్తూరు

గత సంవత్సరం మే నెలలో బదిలీ అయి రిలీవుకాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని వారి స్థానంలో తాత్కాలిక ఉపాధ్యాయులను నియమించాలని ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, యండపల్లి శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. అదే విధంగా డిఎస్‌సి వెంటనే నిర్వహించి టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, ఈ సంవత్సరమైనా ప్రభుత్వ విద్యారంగం సజావుగా జరిగేటట్లు చూడాలన్నారు. తిరుపతి యుటియఫ్ కార్యాలయంలో జూన్ 16న చిత్తూరు జిల్లా విస్తృత కార్యవర్గం జరిగింది. అందులో అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్సీలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. సమావేశానికి జి.శ్రీరామమూర్తి అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి మాట్లాడుతూ అనేక మండలాల్లో ఉపాధ్యాయుల సమస్యలు పెండింగ్‌లో వున్నాయని వాటి పరిష్కారంలో మండల విద్యాశాఖాధికార్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జిల్లా పరిషత్‌లో ఉపాధ్యాయుల పిఎఫ్ నమోదు పూర్తిచేసి 2012-13, 2013-14 స్టేట్‌మెంట్లు యివ్వాలన్నారు.

విద్యార్థుల నమోదు కోసం విద్యా వికాస ఉద్యమం చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం అంగీకరించిన పండిట్, పిఇటిల అప్‌గ్రేడేషన్ పూర్తి చేయాలన్నారు. ఖాళీగా వున్న డివైఇఓ, ఎంఇఓ పోస్టులను తాత్కాలిక పద్ధతిన ప్రమోషన్లు యిచ్చి భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవాధ్యక్షులు కోదండరెడ్డి, సహాధ్యక్షులు రమణయ్య, వరలక్ష్మి, కార్యదర్శులు డి.నిర్మల, ఎస్‌ఎస్ నాయుడు, రెడ్డెప్ప, పి.సుబ్రహ్మణ్యం, టి.రఘుపతిరెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, సూర్యప్రకాష్, ముత్యాలరెడ్డి, సోమశేఖర్ నాయుడు, ఉత్తాన్ని, రహమాన్, జి.శ్రీనివాసు లు, ఎం.జనార్ధన్‌రెడ్డి, బండి మధుసూదనరెడ్డి, బిర్లా నాయుడు, నాగ భూషణం, 65 మండలాల నుండి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపియుటియఫ్) గుంటూరు జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు జి.ప్రభుదాస్ అధ్యక్షతన జరిగింది. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడం, ఉపాధ్యాయ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కెవిఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ వృద్ధా? అభివృద్ధా? అంశంపై చర్చ జరుగుతోందని, వాస్తవానికి మానవాభివృద్ధితో కూడిన ఆర్థికాభివృద్ధి జరిగితేనే నిజమైన అభివృద్ధి జరిగినట్లని చెప్పారు. ఉన్నత పాఠశాలల్లో పండిట్, పిఇటిల అప్‌గ్రేడేషన్‌కు కంప్యూటర్ టీచర్ల నియామనికి, ఎయిడెడ్ టీచర్ల ప్రమోషన్లు, బదిలీలకు కృషి చేస్తామని చెప్పారు. గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ నూతన ఆంధ్రప్రదేశ్‌లో 30వేల వరకూ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా వుంటయాని, వాటిని భర్తీ చేయాలని, తక్షణం విద్యావాలంటీర్లనైనా నియమించాలని, నాన్‌టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని, ఎంఇఓ, డిప్యూటి డిఇఓ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేస్తామని చెప్పారు.

ఏపి యుటిఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునేందుకు విద్యా వికాస ఉద్యమం నిర్వహి స్తామన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో నాణ్యమైన విద్య వుందనేది భ్రమ మాత్రమేనని, దీనిని అనేక ఫలితాలు నిరూపిస్తున్నాయన్నారు. విద్య కార్పొరేట్ శక్తుల వశం కాకుండా ప్రభుత్వ పాఠశాలలు మరింత సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం వుందన్నారు. రాష్ట్ర కోశాధికారి ఎన్.తాండవకృష్ణ మాట్లాడుతూ నూతన రాష్ట్రం ఏర్పాటు నేపథ్యంలో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని, దీనిలో మహిళా ఉపాధ్యాయులు మరింత భాగస్వాములు కావాలని కోరారు. జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రమాదంలో ఉన్నాయని, వాటిని కాపాడుకునేందుకు యుటియఫ్ కృషి చేయాలన్నారు. జులై నెలాఖరులోపు క్యాంపెయిన్స్ పూర్తి చేయాలని, ఉద్యమ తరగతులు నిర్వహించాలని చెప్పారు. ఆర్థిక నివేదికను కోశాధికారి పి.ప్రేమ్‌కుమార్ ప్రవేశపెట్టారు. సాయంత్రం జరిగిన సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు మల్లేశ్వరరావు, టి.వినోద, జిల్లా కార్యదర్శులు, మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

## కర్నూల్

జూన్ 10వ తేదీన కర్నూలులోని కార్మిక కర్షక భవన్‌లో జిల్లా అధ్యక్షులు డి.రామశేషయ్య అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.నరసింహుడు సమావేశాన్ని ప్రారంభిస్తూ సభ్యత్వ, జనరల్ ఫండ్ జయప్రదం చేయడమేగాక, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలనే లక్ష్యంతో 'విద్యా వికాస ఉద్యమాన్ని' జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్‌కుమార్, సహాధ్యక్షులు వై.మనోహర్, కోశాధికారి జె.సుధాకర్, జిల్లా కార్యదర్శులు బి.ప్రతాప్, ఎస్‌ఎం జయరాజు, కె.లక్ష్మయ్య, ఎన్‌ఎస్ బాబు, బివై సుబ్బరాయుడు, ఎం.నాగరాజు, ఎం.వెంకటేశ్వర్లు, ఆర్.ప్రసాద్‌బాబు, జి.సర్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బొబ్బిలిలో విద్యా వికాస వేదిక సర్వే

విజయనగరం జిల్లాలో విద్యా వికాస వేదిక ఆధ్వర్యంలో పాఠశాల లు లేని గ్రామాలను సందర్శించి సర్వే నిర్వహించారు. బొబ్బిలి పట్టణానికి 4 కి.మీ. దూరంలో గల మైదాన ప్రాంత గిరిజన గ్రామాలు విద్యా సౌకర్యాలకు దూరంగా వున్నాయి. పాఠశాలలే కాదు కనీసం అంగన్వాడీ కేంద్రం కూడా లేదు. ఆ గ్రామాల నుండి రేషన్ కూడా తీసుకెళ్లడానికి 2 నెలలకు ఒకసారి వెళ్తారు. అక్కేనవలస గ్రామంలో బడిఈడు పిల్లలు 22మంది, బట్టివలసలో 18మంది, ఒట్టివలసలో 12మంది, కొత్తవలసలో 11మంది, చినబట్టివలసలో 8మంది పిల్లలు వున్నారు. వీరంతా వేరే గ్రామం వెళ్ళి చదువుకోవాలంటే 3 కి.మీ. దూరం ప్రయాణం చేయాలి. కనుకనే ఎవ్వరూ బడికి పోవటం లేదు. పాఠశాల లేకనే ఈ పిల్లలంతా చదువుకు దూరమైనారని అక్కడి గిరిజనులు వాపోయారు. ఆయా గ్రామాలలో పాఠశాలలు ఏర్పాటు చేయాలని విద్యా వికాస వేదిక బృందంతో పాటు, ఆ గిరిజన గ్రామాల ప్రజలు మండల అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

బొబ్బిలి మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ కాలనీ విస్తరించి 3 సంవత్సరాలు గడిచినా పాఠశాల లేకపోవడం మరింత ఆశ్చర్యానికి గురిచేసింది. కాలనీలో 3 రోజుల పాటు వేదిక సభ్యులు ఇంటింటా సర్వేచేస్తే 70మంది బడిఈడు పిల్లలు కన్పించారు. వీరంతా నక్కల, యానాదుల సామాజిక వర్గానికి చెందినవారు. ఈ పిల్లలంతా ప్లాస్టిక్ వస్తువులు, కాగితాలు, సంచులు వేరుకుంటూ కన్పించారు. యాచక వృత్తికి కూడా పంపుతామని చెప్పారు. బడిలేకనే మా పిల్లలు భవిష్యత్ పాడైపోతుందని అన్నారు.

కాలనీ వాసులతో సమావేశం ఏర్పాటు చేసి, వీధుల్లో పాదయాత్రలు చేసిన తరువాత బడి ఎలాగైనా సాధించుకోవాలనే పట్టుదల పెరిగింది. మున్సిపల్ కమీషనర్, విద్యాశాఖాధికారులకు వినతి పత్రాలు సమర్పించిన తరువాత పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరితోపాటు బొబ్బిలి డివిజన్ నాయకులు పి.మధుసూదన రావు, కె.రామకృష్ణ, వి.ప్రసన్నకుమార్, పి.సత్యన్నారాయణ, రాధాకృష్ణ, జి.శ్రీనివాస్, పి.వరప్రసాద్, విద్యా వికాస వేదిక సభ్యులు డా॥ బి. శ్రీరాములు, ఐద్వా నాయకులు వి.ఇందిర, శ్యామ్, వెంకటరావులు పాల్గొన్నారు.

## ఏ.కొండూరులో యుటియఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం

యుటియఫ్ ఎ.కొండూరు మండల శాఖ ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జూన్ 27,28 తేదీలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల నుండి సమస్యలు యుటియఫ్ శాఖ దృష్టికి ఉపాధ్యాయులు తెలుపుకున్నారు. ముఖ్యంగా 25 పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా నడపడం, ఏ.కొండూరు జిటిడబ్ల్యుఎస్, కోమటికుంట, యుపి స్కూల్స్ ఉపాధ్యాయునితో 8 తరగతులు నడపటం వంటి సమస్యలున్నాయి. విద్యావాలంటీర్ల నియామకం తక్షణం జరపాలని కోరారు. ఉపాధ్యాయుల సర్వీస్ సమస్యలు, బదిలీలు జరపాలని మొదలగునవి ఉపాధ్యాయులు విన్నవించడమైనది. జిల్లా కార్యదర్శి పి.శోభన్‌బాబు, పర్యవేక్షణలో ఉత్సాహభరితంగా జరిపిన ఈ క్యాంపెయిన్ 6 ఉన్నత పాఠశాలలు, 47 మండల పరిషత్, 2 సిఎస్ఐ, 1 జిటిడబ్ల్యుఎస్‌లలో సాగింది.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు యుటియఫ్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ మండల గౌరవాధ్యక్షులు బి.అర్జునరావు, కోశాధికారి జి.రామకృష్ణ, యుటియఫ్ మండల నాయకులు జి.రామయ్య, కె.ఎ.మంగయ్య, సిహెచ్.వి.సుబ్బారావు, వి.నరేంద్ర, జి.కృష్ణ, ఏ.భరత్, బి.నాగేంద్ర, వి.ప్రతాప్, ఎస్.రవీంద్ర, పి.భవాని, జి.శ్రీనివాస రావు, పి.గోపి, డి.శ్రీనివాసరావు, ఎల్.చంటి, బి.శ్రీరాములు, మొదలగు వారు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల పరిరక్షణే మన ధ్యేయం

చిత్తూరు జిల్లా ఐరాలమండలం పొలకల హైస్కూల్‌నందు యుటియఫ్ ఐరాల మండల శాఖచే ఎస్ఎస్‌సి ఫలితాలలో నూరు శాతం సాధించినందులకు మండలంలోని 7 పాఠశాలల ప్రధానోపాధ్యా యులను ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, యండపల్లి శ్రీనివాసులు రెడ్డి ఘనంగా అభినందించారు. మధ్యాహ్నం "నేటి విద్యా విధానం - సవాళ్ళు" అనే అంశంపై 'విద్యా సదస్సు' నిర్వహించబడి నది. ఈ సందర్భంగా విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాబోయే రోజులలో ప్రభుత్వ బడుల పరిరక్షణ మనందరి కర్తవ్యంగా పనిచేయాలని, అలాగే సంస్కరణలకనుగుణంగా పిల్లలకు 'నాణ్యమైన' విద్యా బోధన జరగాలని తెలిపారు. జర్మనీ దేశంలో విద్యతోపాటు ఆరోగ్య మరియు నైతిక విలువలను బోధించడం హర్షణీయమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలలో గల ప్రాథమిక బడులను బలోపేతం చేస్తూ గ్రామస్థుల భాగస్వామ్యంతో పరిపుష్టి చెందించాలని తెలిపారు.

ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక పాఠశాలనందు ఇద్దరికి తగ్గకుండా ఉపాధ్యాయులుండాలని, అలాగే 'విద్యాహక్కు చట్టం'కు భంగం లేకుండా రేషనలైజేషన్ చేయాలని, ఖాళీగా వున్న ఉపాధ్యాయ మరియు పర్యవేక్షణాధికారులైన డివైఇఓ, ఎంఇఓ పోస్టులను హాడ్‌హాక్ రూల్స్ రూపొందించి వెంటనే ఖాళీలను పూరించాలని డిమాండ్ చేశారు. యుటియఫ్ జిల్లా అధ్యక్షులు జి. శ్రీరామమూర్తి, జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి, ఎంఇఓ జి.రామచంద్రనాయుడు, ప్రధానోపాధ్యాయులు జి.రామానాయుడు, ఎంపిడిఓ కె.సుధాకర్‌రావు, జిల్లా యుటియఫ్ కార్యదర్శి ఎం.సోమ శేఖరనాయుడు, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.కన్నయ్య నాయుడు, పి.రమేష్‌నాయుడు, సహాధ్యక్షులు ఏకాంబరం, సి.చాముండేశ్వరి, కార్యదర్శులు కె.అరుణ్, పద్మావతి, జి.దేవరాజుల నాయుడు, ఎన్.రామచంద్ర, ఎల్.సుబ్రహ్మణ్యం, జయంద్రారెడ్డి, రమణ మూర్తి, జయచంద్ర, పురందరి చౌదరి, విజయకుమార్ తదితరులు మండలంలోని ఉపాధ్యాయులందరు పాల్గొన్నారు.

## యుటియఫ్ సీనియర్ కార్యకర్త ప్రకాశరావు మృతికి సంతాపం

నెల్లూరు జిల్లా దామరమడుగు హైస్కూల్ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు, యుటియఫ్ సీనియర్ కార్యకర్త ఓ.ఎస్ ప్రకాశ రావు జూన్ 28న ఆకస్మికంగా మరణించారు. యుటియఫ్ ఆవిర్భావ సమయంలో కోట, వాకాడా ప్రాంతంలో సంఘ విస్తరణకు కృషి చేశారు. జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులుగా పనిచేశారు. ప్రస్తుతం పెన్షనర్ల సంఘం జిల్లా నాయకులుగా వున్నారు. ప్రకాశరావు మృతి పట్ల యుటియఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఐ.వెంకటేశ్వర రావు, పి.బాబురెడ్డి, సీనియర్ నాయకులు డి.రామిరెడ్డి, డి.మస్తాన్ రావులు, ఇంకా యుటియఫ్ నెల్లూరు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# ఆందోళన, పోరాట కార్యక్రమాలు

## పార్వతీపురం

గిరిజన విద్యాభివృద్ధికి ఆటంకంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలంటూ విజయనగరం యుటియఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పార్వతీపురం ఐటిడిఏ కార్యాలయం ఎదుట జూన్ 27న ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నా శిబిరాన్ని యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.వైజయగౌరి ప్రారంభించి మాట్లాడారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతులు అధికారులు కల్పించగలరని, అయినా వాటిపై దృష్టి పెట్టడం లేదన్నారు. 2002 నుండి సిఆర్‌టిలుగా పనిచేస్తున్నా సిఆర్‌టిలకు విద్యా సంవత్సరం ప్రారంభానికి రెన్యువల్ ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో ఆశ్రమ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత తీవ్రంగా ఉందని, వారికి మార్చి, ఏప్రిల్ నెల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యుటియఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.మురళిమోహన్ గిరిజన ప్రాథమిక పాఠశాలల నుండి 3,4,5 తరగతుల విద్యార్థులను ఆశ్రమ పాఠశాలలకు బదలాయించడం వలన జిపిఎస్ పాఠశాలలు నానాటికీ మూతపడే ప్రమాదం వుందని అన్నారు. పిఓ ఈ విధానాన్ని రద్దు చేయాలని, 8 మందికీ కారుణ్య నియామకాల ఉత్తర్వులు యివ్వాలని, అన్ని పాఠశాలలకు రన్నింగ్ వాటర్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

అనంతరం ఏపి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి మిడియం బాబూరావు ధర్నా శిబిరంలో పాల్గొని ప్రసంగించారు. యుటియఫ్ చేస్తున్న పోరాటాలకు సంపూర్ణ మద్దతు అందిస్తామని తెలియజేశారు. 10మంది విద్యార్థులున్నా గిరిజన ప్రాంతాలలో పాఠశాలలు కొనసాగించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.లక్ష్మణమూర్తి, యుటియఫ్ జిల్లా అధ్యక్షులు డి.రాము డిమాండ్ చేశారు. ఈ శిబిరంలో జిల్లా నాయకులు జి.వెంకటనాయుడు, ఎన్.శ్రీరాములు, వై.ఎరకమ్మ, లలిత, మురళి, దామోదరరావు, మురళీకృష్ణ, శ్రీను, విజయ్‌కుమార్, సీతయ్య, రవి, 110మంది జిపిఎస్, సిఆర్‌టి టీచర్లు పాల్గొన్నారు. అనంతరం ప్రాజెక్ట్ డిడి వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. డిడి శిబిరానికి వచ్చి సమస్యల పరిష్కారానికి హామీ యిచ్చారు.

## కడప




ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపియుటియఫ్) కడప జిల్లా శాఖ ఉపాధ్యాయుల పింఛను దారుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల స్క్రూటినీ మరియు మంజూరు కోసం జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ కడపలోని కొత్త రిమ్స్ పరిపాలనా భవనము వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి జిల్లా ప్రధానకార్యదర్శి బి.లక్ష్మిరాజ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, పింఛనుదారులు మరియు వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల స్క్రూటినీ, మంజూరు కోసం 5 లేదా 6 నెలల సమయం పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ వేగవంతంగా జరగాలంటే ఆఫీసుల చుట్టు ప్రదక్షిణలు చేసి చదివింపులు సమర్పించుకోవాల్సిన పరిస్థితి కల్పిస్తున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు సీరియల్ నంబరు ప్రకారం సిస్టంలో ఎన్‌రోల్ చేయాలని, సీనియార్టీ ప్రకారం స్క్రూటిని, మంజూరు జరగాలని డిమాండ్ చేశారు.

ఈ ధర్నాలో జిల్లా ట్రెజరర్ ఎస్.వెంకటసుబ్బరాజు, యుటియఫ్ నాయకులు కె.సుబ్బన్న, మురళీ, నిజాముద్దీన్, శంకర్‌బాబు, మోహన్ రెడ్డి, కొండయ్య, సుబ్బయ్య, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, చంద్రశేఖర్, శ్రీహరి, హరినాథ్‌బాబు, రమణ, సాంబశివారెడ్డి, కె.గంగన్న తదితరులు పాల్గొన్నారు.

## గంగవరం



ఎంఈఓ శాంతకుమారి తీరును నిరసిస్తూ చిత్తూరు జిల్లా గంగవరం మండల శాఖ జూన్ 9న స్థానిక ఎమ్మార్సీ వద్ద ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా యుటియఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.సోమచంద్రారెడ్డి మాట్లాడుతూ మండలం నుంచి పదిమంది 9 నెలల క్రితం ఉపాధ్యాయులు బదిలీపై వెళ్ళారని, వీరికి సిపిఎస్ స్టేట్‌మెంట్లు వెంటనే యివ్వాలని, సిపిఎస్ ఉపాధ్యాయుల విషయంలో అక్రమాలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కంచమని అడిగితే వేధింపులు అంటున్నారని ఇది ఎంతమాత్రం సమంజసమన్నారు. కో-ఆర్డినేషన్ సమావేశం అన్ని సంఘాలకు చెప్పి నిర్వహించాలన్నారు. మండల ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్సీలో రికార్డుల సక్రమంగా వుంచాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక నిరాహారదీక్షకు దిగుతామని హెచ్చరించారు. నెలాఖరులోపు అన్ని సమస్యలు పరిష్కరిస్తామని ఎంఈఓ హామీ యివ్వడంతో వారు ధర్నా విరమించారు. ఈ ధర్నాలో నాయకులు సోమచంద్రారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రసన్నకుమార్, కేశవులు, గౌస్‌బాషా, మునిరాజు, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు

గుంటూరు కార్పొరేషన్ విస్తరించిన నేపథ్యంలో చేబ్రోలు, తాడికొండ, ప్రత్తిపాడు మండలాల పరిధిలోని 13 గ్రామాలకు 20% ఇంటి అద్దెను అమలు చేస్తూ గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.సురేష్ కుమార్ గెజిట్ విడుదల చేసినట్లు యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రభుదాస్, ఎం.హనుమంతరావు తెలిపారు. చేబ్రోలు మండలం గొడవర్రు, గుండవరం, చేబ్రోలు, కొత్తరెడ్డిపాలెం, పాతరెడ్డి పాలెం, వేజెండ్ల, సుద్దపల్లి, వడ్లముండి, తాడికొండ మండలం గరిక పాడు, పొన్నెకల్లు, ప్రత్తిపాడు మంలం యనమదల, చినకోండ్రుపాడు, తిక్కిరెడ్డి పాలెంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు 20% ఇంటి అద్దె పొందవచ్చని తెలిపారు.

### గుంటూరులో ఉపాధ్యాయులు, అధ్యాపకుల నిరసన ప్రదర్శన

ప్రభుత్వోద్యోగుల ఉద్యోగ విరమణ వయసును 58 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పెంచేలా ప్రభుత్వం జారీచేసిన జీఓ 147 ద్వారా వేలమంది ఎయిడెడ్ సిబ్బందికి అన్యాయం జరిగిందని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఎయిడెడ్ విద్యా సంస్థల్లోని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బందికి ఉద్యోగ విరమణ వయసు పెంపుదలను వర్తింపజేయాలని కోరుతూ యుటియఫ్, ఎయిడెడ్ జూనియర్ అధ్యాపకుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జులై 3న నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయసు పెంపుదలను ప్రకటించడంతో ఉద్యోగులందరూ హర్షం వ్యక్తం చేశారన్నారు. కానీ ఎయిడెడ్ సిబ్బందికి దీన్ని వర్తింపజేయలేదన్నారు. గతంలో 55 ఏళ్ల నుంచి 58 ఏళ్లకు ఉద్యోగ విరమణ వయసును పెంచినప్పుడు ఎయిడెడ్ సిబ్బందికి వర్తింప జేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా వారికి వర్తింపజేస్తే వెంటనే రాజకీయ నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. త్వరలోనే మళ్లీ వారితో చర్చిస్తామన్నారు. ప్రభుత్వ ఎయిడెడ్ సిబ్బందికి న్యాయం జరిగేందుకు ఉద్యమం చేయాలని పిలుపునిచ్చారు. ఎయిడెడ్ జూనియర్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి హరిశ్చంద్రప్రసాద్, యుటియఫ్ రాష్ట్ర కోశాధికారి తాండవకృష్ణ, జిల్లా అధ్యక్షుడు ప్రభుదాస్, ప్రధానకార్యదర్శి హనుమంతరావు, ప్రేమ్ కుమార్, పాల్‌రాజు, శివపూర్ణయ్య, వెంకటేశ్వర్లు, జగదీష్, వీరబాబు, అధ్యాపకుల సంఘం నాయకులు కైలాస్‌నాథ్ బాబు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఏలూరు

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులందరి పదవీ విరమణ వయస్సు 60 సంవత్సరాలకు పెంచుతూ శాసన సభ ఆమోదించిన చట్టం 4/2014ను రాష్ట్రంలోని ఎయిడెడ్ కళాశాలల అధ్యాపకులు, ఎయిడెడ్ ఉపాధ్యాయులు, సిబ్బంది అందరికి వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపియుటియఫ్) పశ్చిమ గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జులై 3న ఏలూరు యుటియఫ్ జిల్లా కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించింది. ప్రదర్శనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల నుద్దేశించి యుటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు షేక్‌సాబ్జీ మాట్లాడుతూ రాష్ట్రంలో వున్న 6 లక్షలమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సు 60 సంవత్సరాలకు వర్తింపజేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన చట్టాన్ని ఎయిడెడ్ సిబ్బందికి వర్తింపజేసే వరకు యుటియఫ్ పోరాడుతుందని అన్నారు. శాసనసభలో చట్టాన్ని సవరించి ఎయిడెడ్ సంస్థలకు వర్తింపజేసేందుకు యుటియఫ్, పిడిఎఫ్ శాసన మండలి సభ్యులు కృషి చేస్తారని అన్నారు. ప్రదర్శన అనంతరం యుటియఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు షేక్‌సాబ్జీ ఆధ్వర్యంలో యుటియఫ్, ఆక్టా, ఎయిడెడ్ గిల్డ్ ప్రతినిధి బృందం స్త్రీ, శిశు సంక్షేమ మంత్రి పి.సుజాతను జెడ్‌పి అతిథి గృహంలో కలిపి మెమోరాండం సమర్పించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకువెళ్ళి ఎయిడెడ్ సిబ్బందికి కూడా 60 సంవత్సరాలు వర్తింపజేస్తామని హామీ ఇచ్చారు. ప్రదర్శనలో జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీకాంత్, జిల్లా సహాధ్యక్షులు సిహెచ్.జగన్మోహనరావు, జిల్లా కార్యదర్శి ఆర్.రవికుమార్, సుబ్రహ్మణ్యం, ఆక్టా రాష్ట్ర చైర్మన్ ఎల్. వెంకటేశ్వరరావు, ఎయిడెడ్ గిల్డ్ కార్యదర్శి టి.కొండలరావు, ఎయిడెడ్ రాంబాబు, యుటియఫ్ నగర శాఖ నాయకులు అనిల్‌బాబు, అప్పారావు, నంబూరి రాంబాబు, జి.వి.సూరపరాజు, జాద్‌వలి తదితరులు పాల్గొన్నారు.

### అనంతపురం డిఇఓతో ఎమ్మెల్సీ గేయానంద్ యుటియఫ్ నాయకుల భేటీ

ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టరు ఎం.గేయానంద్ అనంతపురం జిల్లా యుటియఫ్ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారులకు సూచించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాధికారి మధుసూదన్‌రావు చాంబరులో పలు అంశాలపై చర్చించారు. ప్రైవేట్‌కంటే అన్ని విధాలుగా మెరుగైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తున్నా ప్రజల్లో ప్రభుత్వ విద్యపట్ల వ్యతిరేక భావాన్ని పోగొట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, పిల్లలకు ఈ విద్యా సంవత్సరం సకాలంలో పాఠ్య పుస్తకాలు, యూనిఫారమ్‌లు అందజేయాలని, యూనిఫారమ్ నాణ్యతతో కూడినదిగా వుండాలని, విద్యార్థులకు స్కాలర్ షిప్పుల గురించి ఆరా తీశారు. స్కాలర్‌షిప్పులను విద్యార్థులకు అందే విధంగా చొరవ తీసుకోవాలని తెలిపారు. అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల కు ఉపాధ్యాయులు లేకుండా వున్నారని అటువంటి చోట కొరత లేకుండా చూడాలని కోరారు.

కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులు నియంత్రించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు ప్రథమ ప్రాధాన్యత నివ్వాలని ఆదేశించారు. అవసరమైతే తన నిధులు ఇవ్వడానికి కూడా సిద్ధమన్నారు. అంతేకాకుండా ఉపాధ్యాయుల సర్వీస్ విషయాలపైన, కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిపైన సమీక్ష జరిపారు. ఉపాధ్యాయులు, సంఘ నాయకులు, జిల్లా విద్యాశాఖాధికారులు సమన్వయంతో పనిచేస్తునే జిల్లా విద్యాభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్సీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారులతోపాటు యుటియఫ్ సంఘ నాయకులు గౌరవాధ్యక్షులు మహమ్మద్ జిలాన్, అధ్యక్షులు కె.నాగేంద్ర, ప్రధానకార్యదర్శి వి.కోటేశ్వరప్ప, ఆడిట్ కన్వీనర్ వై.సాయినాథ్, జెవివి జిల్లా నాయకులు ఎస్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### సభ్యత్వ నమోదులో పశ్చిమగోదావరి జిల్లా గణపవరం, నిడమర్రు, నల్లజర్ల శాఖల ఆదర్శం

ప్రతి సంవత్సరం పశ్చిమగోదావరి జిల్లాలోని గణపవరం, నిడమర్రు, నల్లజర్ల మండల శాఖలు పాఠశాల తెరచిన రోజునే సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తి చేయడం గత 5 సం॥లుగా జరుగుచున్నది. ఈ సంవత్సరం కూడ జూన్ 12వ తేదీ సాయంకాలానికి యుటియఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తిచేసి జిల్లా, రాష్ట్ర కోటాలు అదే రోజు సాయంకాలానికి జిల్లా శాఖకు చెల్లించి ఆదర్శంగా నిలిచారు. అలాగే మొగల్తూరు మండల శాఖ లక్ష రూపాయలు జనరల్‌ఫండ్ హామీలు పొంది జిల్లాలో (ఈ సమాచారం అందేటప్పటికి) అగ్రభాగాన నిలిచారు. జయప్రదం చేసిన కార్యకర్తలకు, సహకరించిన ఉపాధ్యాయులకు రాష్ట్ర కమిటీ తరపున అభినందనలు.

# కెజిబివి టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

**విజయవాడ**

ఆంధ్రప్రదేశ్ కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల రాష్ట్ర సదస్సు జూన్ 22న విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపియుటియఫ్) రాష్ట్ర కార్యాలయంలో యుటియఫ్ సహాధ్యక్షురాలు కె.విజయగౌరి అధ్యక్షతన నిర్వహించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, కె.ఎస్.లక్ష్మణరావు, బొడ్డు నాగేశ్వరరావు, యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వర రావులు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ 2007 నుండి ప్రారంభం అయిన కెజిబివి పాఠశాలలు ప్రత్యేకించి విద్యలో పూర్తిగా వెనుకబడి, మధ్యలో చదువు మానేసి, సింగిల్ పేరెంట్స్‌గా గల బాలికల కోసం ఈ పాఠశాలలు ఏర్పాటు చేయబడినవని, అందులో పనిచేసే ఉపాధ్యాయినులు నిజానికి మట్టిలో మాణిక్యాలను తయారు చేస్తున్నట్లే అటువంటి పాఠశాలలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వాలు మరింత బాధ్యత వహించాల్సివుంది. నిధులు కూడా పెంచాల్సి వుంది. ఈ పాఠశాలలో 3,544మంది సిఆర్‌టిలు పనిచేస్తున్నారని వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, సర్వీసులను క్రమబద్ధీకరించాలని, ప్రసూతి సెలవు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా పలు సమస్యలు వున్నాయని వాటి పరిష్కారం కోసం కెజిబివి ఉపాధ్యాయులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి సందేశమిచ్చారు. అనంతరం కెజిబివి టీచర్ల ఫెడరేషన్ రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**నూతన కమిటీ**

గౌరవాధ్యక్షులు కె.విజయగౌరి (యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు), అధ్యక్షులు వి.సుజాత (కర్నూలు), ప్రధానకార్యదర్శి ఎ.గీతాకుమారి (ప్రకాశం), ఉపాధ్యక్షులు కె.రమాదేవి(విజయనగరం), బి.విజయలక్ష్మి (గుంటూరు), కె.కౌసరీ (కడప), రాష్ట్ర కార్యదర్శులు ఎం.గౌరి (విజయనగరం), పి.అరుణకుమారి (గుంటూరు), పి.రాధాదేవి(కడప).

**కడప**



ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపియుటియఫ్) కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో కెజిబివి టీచర్ల సమావేశం సిఎస్ఐ స్కూల్ కడపలో అధ్యక్షుడు ఎస్.ఓబుల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కెజిబివి టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. జిల్లా ప్రధానకార్యదర్శి బి.లక్ష్మిరాజ మాట్లాడుతూ మీ విధులు సక్రమంగా నిర్వహిస్తూనే సమస్యల పరిష్కారానికి ఉద్యమాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా మహిళా ఉపాధ్యాయులకు యిస్తున్న సెలవులను వీరికి వర్తింపచేయాలని, కెజిబివి టీచర్లుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ ఉపాధ్యాయులుగా పరిగణించాలని, పిఎఫ్, సిపిఎస్ వీరికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాధాదేవి వివిధ మండలాల కెజిబివి టీచర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ ఎస్.వి.సుబ్బరాజు, కార్యదర్శి పి.చంద్రశేఖర్, జిల్లా నాయకులు రామాంజనేయులు, మురళీ పాల్గొన్నారు.

**అనంతపురం**

అనంతపురం జిల్లాలోని కెజిబివిలలో గెస్ట్ టీచర్లుగా పనిచేస్తున్న దాదాపు 107మంది ఆందోళన కార్యక్రమం, రిలేనిరాహారదీక్షలు ఆర్‌విఎం ఆఫీసు ఎదుట నిర్వహించారు. వీరు దాదాపుగా 6,7 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. కాని ఇప్పుడు వీరిని తొలగించారు. అందుకు వీరు పోరుబాట పట్టారు. వీరందరిని సిఆర్‌టిలుగా తీసుకోవాలని నిరాహారదీక్షలు చేపట్టారు. వీరికి సంఘీభావంగా యుటియఫ్ జిల్లా శాఖ పక్షాన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.కె.నాగేంద్రబాబు, జిల్లా గౌరవాధ్యక్షులు మహమ్మద్ జిలాన్, అధ్యక్షులు కె.నాగేంద్ర, ఆడిట్ కమిటీ కన్వీనర్ సాయినాథ్‌బాబు సంఘీభావం తెలిపి వారి పోరాట పటిమకు, వారికి ఆర్థిక సహాయంగా రెండువేల రూపాయలు అందించారు.

### మడకశిర నియోజక వర్గంలో ఎస్‌టిఎఫ్ నాయకులు యుటియఫ్‌లో చేరిక



మడకశిర నియోజకవర్గంలో ఎస్‌టిఎఫ్ నాయకులందరూ మూకుమ్మడిగా యుటియఫ్‌లో సభ్యత్వం తీసుకొన్నారు. మడకశిర ప్రాంతంలోని ఎస్‌టిఎఫ్ నాయకులు కి.భూతన్న, పి.సూర్యనారాయణ, మాలింగప్ప, జోగప్ప, ఆదినారాయణ, రంగయ్య, మూళ్ళగిరప్ప, హర్షవర్ధన్, వెంకటేశు, నరసింహమూర్తి, వెంకటరాయుడు తదితర 60మంది కార్యకర్తలు యుటియఫ్ సంఘంలో చేరి సభ్యత్వం తీసుకొన్నారు. ఈ సందర్భంగా మడకశిర అధ్యక్షులు నరసింహులు అధ్యక్షతన నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ యుటియఫ్ ఉద్యమాలకు పుట్టినిల్లు, విలువలతోకూడిన సంఘం సమరశీల పోరాటాలు సల్పే సంఘం అని ఇటువంటి సంఘంలో పనిచేయడానికి తమకు అందివచ్చిన అదృష్టమని భావించి, ఈ జోనల్ ప్రాంతమందు యుటియఫ్ ఎదురులేని సంఘంగా తీర్చిదిద్దుతామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.మహమ్మద్ జిలాన్, అధ్యక్షులు కె.నాగేంద్ర, ప్రధానకార్యదర్శి వి.కోటేశ్వరప్ప, మడకశిర జిల్లా కార్యదర్శి మారుతి ప్రసాద్, జిల్లా కార్యదర్శులు విజయభాస్కర్, ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, సుధాకర్, ఆడిట్ కన్వీనర్ సాయినాథ్, రొద్దం మండల ప్రధానకార్యదర్శి నరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.కె.నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడెడ్, రెసిడెన్షియల్, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులకు

# రిటైర్మెంట్ వయస్సు 60 సం॥లు వర్తింప చేయాలి

### కాకినాడ

ఎయిడెడ్ విద్యా సంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు జూనియర్, డిగ్రీ కాలేజీలలో పనిచేసే లెక్చరర్లకు, సిబ్బందికి పదవీ విరమణ వయస్సు 60 సం॥లు వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ జూలై 2న తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో యుటియఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. డిఇఓ కార్యాలయం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన, అనంతరం నిర్వహించిన సమావేశంలో యుటియఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి.ప్రభాకరవర్మ, కె.సత్తి రాజులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి మొదటి 5 సం॥లో పదవీ విరమణ వయస్సు పెంపుదల ఉత్తర్వులలో ఎయిడెడ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, లెక్చరర్లను చేర్చకపోవటం అందరిలో ఆందోళన కలిగించిందన్నారు. నగర పర్యటనలోనున్న ఉప ముఖ్యమంత్రి ఎన్. చిన్నరాజప్పకు యుటియఫ్ ప్రతినిధి వర్గం విజ్ఞాపన పత్రం అందించి, ఎయిడెడ్ యాజమాన్యంలోని అందరు ఉద్యోగులకు 60 సం॥లు పదవీ విరమణ వయస్సు వర్తింపచేసేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్ళి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ నీతుప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో యుటియఫ్ జిల్లా కార్యదర్శి జోగా అప్పారావు, కాకినాడ నగర శాఖ అధ్యక్షులు సిహెచ్.వి.రమణ, ఎయిడెడ్ జూనియర్ కాలేజీ సంఘం జిల్లా అధ్యక్షులు రామారావు, రాష్ట్ర కోశాధికారి జి. రఘురాం, జిల్లా నలుమూలలు నుండి కాకినాడ, రాజమండ్రిలోని ఎయిడెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యుటియఫ్ కార్యకర్తలు 200 మంది పాల్గొన్నారు.

### కర్నూల్

జులై 3వ తేదీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్. నరసింహుడు ప్రారంభించారు. జిల్లా నాయకులు జయరాజు, మనోహర్, సుబ్బరాయుడు, రవికుమార్, దావీద్, సామేలురాజు, జనార్ధన్, వీరారెడ్డి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

### అనంతపురం

జిఓ 147లోని ఆదేశాలలో ఎయిడెడ్ విద్యా సంస్థలను పేర్కొనక పోవడంతో ఎయిడెడ్ సిబ్బందికి పదవీ విరమణ ఉత్తర్వులు వర్తించ వని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి తెలియజేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎయిడెడ్ సిబ్బంది మరియు యుటియఫ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు జరుగుచున్నాయి. అందులో భాగంగా జులై 4న నిరసన ర్యాలీని యుటియఫ్ ఆఫీసు నుండి కలెక్టర్ క్యాంప్ ఆఫీసు వరకు వెళ్ళి నిరసన తెలిపి కలెక్టర్‌కు ప్రాతినిధ్యం చేశారు. ఇందులో ఎయిడెడ్ సిబ్బంది ఎయిడెడ్ జూనియర్ కాలేజి లెక్చరర్లు మరియు యుటియఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు. కలెక్టర్ స్పందిస్తూ ఎయిడెడ్ సిబ్బందికి 60 సం॥లకు పెంచడం న్యాయమైనదని దీనిని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సానుకూల మైన ఉత్తర్వులు యిప్పించుటకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.మహమ్మద్ జిలాన్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నాగేంద్ర, వి.కోటేశ్వరప్ప, జిల్లా కార్యదర్శులు ఎన్. విజయభాస్కర్, ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, ఆడిట్ కన్వీనర్ వై.సాయినాథ్ బాబు, మండల నగర నాయకులు గోపాల్, లింగమయ్య, రామకృష్ణ, తిప్పయ్య, బ్రహ్మానంద, నల్లప్ప, శేషు, క్రిష్టయ్య తదితరులతో పాటు ఎయిడెడ్ గిల్డ్ జిల్లా అధ్యక్షులు ఎస్.వన్నూరప్ప, నాగరాజశర్మ, రామచంద్ర అశోక్, ఎయిడెడ్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షులు సి.బ్రహ్మా నందరెడ్డి, బి.బసయ్య, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## క్రొత్తపల్లి నారాయణరావు మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటు

యుటియఫ్ సీనియర్ నాయకులు విశ్రాంత వ్యాయామోధ్యాయు లు క్రొత్తపల్లి నారాయణ రావు జూన్ 7వ తేదీ రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. వారి భౌతికాయానికి 8వ తేదీ తెనాలిలో అంత్య క్రియలు జరిగాయి. ఉద్యోగ విరమణ అనంతరం గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో స్థిరపడ్డారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె వున్నారు. వీరి సతీమణి మైనేని దుర్గాంబ కూడా ఉపాధ్యా వృత్తిలో కొనసాగారు. ఆమె గతేడాది మృతి చెందారు. యుటియఫ్ సంఘ నిర్మాణానికి, ఉపాధ్యాయ ఉద్యమానికి అవిరళకృషి చేశారు. ముఖ్యంగా వ్యాయామోధ్యాయులకు ఉపయుక్తమై అధ్యాపక దర్శినిని, పిఏటి పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను రూపొందించడంలో విశేష కృషి చేశారు. ప్రస్తుతం వీరు రూపొందించిన సిలబస్ అందరికీ మార్గదర్శకంగా ఉన్నది. వివిధ సమితులు, మండలాల్లో నాయకత్వ బాధ్యతలను నిర్వహించడంతోపాటు జిల్లా కమిటీలో వివిధ హోదాల్లో పనిచేశారు. యుటియఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించి జిల్లా కేంద్రాల్లో ఆడిట్‌లను సమర్ధవంతంగా పూర్తి చేశారు. ప్రతియేటా యుటియఫ్ ప్రచురించే డైరీని కొంతకాలం వీరు రూపొందించారు. అందరూ వీరిని 'జిఓల నారాయణ' అని పిలవడం రివాజు. ఉపాధ్యాయునిగా ఎదిగి, నమ్మిన ఆశయం కోసం నీతి, నిజాయితీతో నిబద్ధతగా జీవితం గడిపిన ఆదర్శమూర్తి నారాయణ రావు.

వీరి మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. వీరి పార్థివదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, యుటియఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, రాష్ట్ర ట్రెజరర్ ఎన్.తాండవకృష్ణ, సీనియర్ నాయకులు వై.ఎల్.నారాయణ, ఎ.వి.సత్యనారాయణ, సిపిఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్ వలి, తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఖుద్దూస్, పలువురు ఉపాధ్యాయులు వివిధ మండలాల యుటియఫ్ బాధ్యులు, జిల్లా శాఖ బాధ్యులు పెద్ద ఎత్తున హాజరై పూలమాలలువేసి ఘననివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# రౌండ్‌టేబుల్ సమావేశాలు

## గుంటూరు

'విద్యా వికాస వేదిక' గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని యుటియఫ్ జిల్లా కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం జూన్ 25న నిర్వహించారు. సమావేశానికి జి.ప్రభుదాస్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యారంగం ప్రభుత్వ విద్యారంగం, ప్రైవేట్ (కార్పొరేట్)గా రెండు భాగాలు కావడానికి ఆర్థిక సంస్కరణలు కారణమన్నారు. ఏపిలో 56% ప్రభుత్వరంగంలో, 44% ప్రైవేట్‌లో విద్యార్థులుంటే కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో 80% ప్రభుత్వ, 20% ప్రైవేట్ ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలపడాలంటే ప్రధానంగా వ్యవస్థాగత మార్పులు జరగాలని, ప్రైవేట్ పాఠశాలలపై నియంత్రణ ఉండాలని, మంచి ఉపాధ్యాయులను ప్రోత్సహించాలని, మౌలిక వసతులు మెరుగుపరచాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆకాంక్షలను అర్థం చేసుకొని, లోపాలను సవరించుకొని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం కోసం విద్యా వికాస వేదిక కృషి చేయాలని కోరారు. డీఈఓ డి.ఆంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం దిగజారుతున్న ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడం కోసం ఏం చేయాలనేది ఆలోచించాలని, తల్లిదండ్రులతో సంబంధాలు పెంచుకోవడంతోపాటు పనిగంటలు కూడా పెంచే విధంగా ఆలోచన చేయాలని అన్నారు. రాష్ట్ర కోశాధికారి ఎన్.తాండవకృష్ణ మాట్లాడుతూ కొఠారి కమీషన్ చెప్పిన విధంగా కామన్ స్కూల్స్ ఏర్పాటుకు కృషి చేయాలని డబ్బున్న వారికి ఒక రకమైన విద్య, పేదవారికి మరొక విద్యలాంటి వ్యత్యాసాలు లేని విధంగా పాఠశాలలు వుండాలన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు టి.రవీంద్రబాబు, ఆర్‌యుపిపి నాయకులు ఆర్.బుర్రియ, ఎపిపిటిఏ నాయకులు పి.వెంకటరత్నం, టిఎన్‌యుఏ నాయకులు వీరస్వామి, జెవివి నాయకులు ఎన్.వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ నాయకులు భగవాన్‌దాస్, యుటియఫ్ నాయకులు ఎం.హనుమంతరావు, పి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

## బొబ్బిలి



విజయనగరం జిల్లా బొబ్బిలి డివిజన్ కేంద్రంలో విద్యా వికాస వేదిక ఆధ్వర్యంలో జూన్ 29న రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సమన్వయకర్తగా యుటియఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి వ్యవహరించారు. బి.శివున్నాయుడు (వైకాపి), రెడ్డివేణు (సిపిఎం), ఎం.రమణ(టిడిపి), జిల్లా ప్రధానకార్యదర్శి బి.జోగినాయుడు (ఏపిటిఎఫ్), ఎయిడెడ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు కె.కృష్ణదాసు, ఆక్టా సంఘ నాయకులు కె.చిరంజీవులు, ప్రముఖ అధ్యాపకులు బి.శ్రీరాములు, రచనా సమాఖ్య నాయకులు ఎం.విజయ మోహన్, బాలల సాహితీవేత్తలు పి.శ్రీనివాసరరావు, నాగరాజు, జన విజ్ఞాన వేదిక ఎం.శశిభూషణరావు, భాషా పండితుల సంఘం కె.అప్పలనాయుడు, మండల విద్యాశాఖాధికారి కె.ప్రసాదరావు, వ్యవసాయ కార్మిక సంఘం వి.చిన్నంనాయుడు, యుటియఫ్ నాయకులు వై.స్వామినాయుడు, ప్రసన్నకుమార్, కె.రామకృష్ణ, గంగులు, ఎన్.అజయ్, కెవిపిఎస్ నాయకులు పి.వరప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

